ఆంధ్రసచిత్రవారపత్రిక



24 - 1 - 75
60 పైసలు

1974 సం.లో విడుదలైన డైరెక్ట్ టేక్ తెలుగు చిత్రాలు - విడుదల తేదీలు

1.	పల్లెటూరి చిన్నోడు	9–1–74
2.	సంసారం–సాగరం	10–1–74
3.	కన్నవారి కలలు **C**	11–1–74
4.	జీవితరంగం **A**	11–1–74
5.	ప్రేమలు–పెళ్లిళ్లు	12–1–74
6.	ఖైదీబాబాయ్ **C**	15–2–74
7.	మంచివాడు **C**	21–2–74
8.	గాలిపటాలు	1–3–74
9.	గుండెలుతీసినమొనగాడు **C.A.**	7–3–74
10.	అమ్మాయి పెళ్లి	8–3–74
11.	కోడెనాగు **C**	15–3–74
12.	స్త్రీ గౌరవం	21–3–74
13.	పెద్దలు మారాలి	28–3–74
14.	నిజరూపాలు	29–3–74
15.	మనుషుల్లో దేవుడు	5–4–74
16	తులాభారం	12–4–74
17.	చందన	19–4–74
18.	ఉత్తమ ఇల్లాలు	19–4–74
19.	ముగ్గురు అమ్మాయిలు	26–4–74
20.	అల్లూరి సీతారామరాజు **C.S.**	1–5–74
21.	నీడలేని ఆడది **C. A.**	9–5–74
22.	తులసి	23–5–74
23.	కలిసొచ్చిన కాలం	23–5–74
24.	అందరూ దొంగలే **C**	31–5–74
25.	మనుషులు–మట్టిబొమ్మలు	31–5–74
26.	బంట్రోతు భార్య	7–6–74
27.	బంగారు కలలు **C**	21–6–74
28.	అనగనగా ఒక తండ్రి	28–6–74
29.	రాధమ్మ పెళ్లి	6–7–74
30.	కృష్ణవేణి **C**	11–7–74
31.	ఓ సీత కథ	19–7–74
32.	గౌరి	1–8–74
33.	ఆడంబరాలు–అనుబంధాలు	9–8–74
34.	నోము **C**	15–8–74
35.	దీర్ఘసుమంగళి	22–8–74
36.	విజయరాముడు	24–8–74
37.	తాతమ్మ కల	30–8–74
38.	ధనవంతులు–గుణవంతులు	6–9–74
39.	చైర్మన్ చలమయ్య	6–9–74
40.	మాంగల్య భాగ్యం	7–9–74
41.	ఆడపిల్లల తండ్రి	7–9–74
42.	ఇంటికోడలు	12–9–74
43.	భూమికోసం **C**	19–9–74
44.	ఇంటింటి కథ	20–9–74
45.	చక్రవాకం **C**	27–9–74
46.	నిత్యసుమంగళి	4–10–74
47.	తిరుపతి	5–10–74
48.	హారతి	12–10–74
49.	మంచిమనుషులు **C**	18–10–74
50.	నిప్పులాంటి మనిషి **C**	25–10–74
51.	దొరబాబు **C**	31–10–74
52.	సత్యానికి సంకెళ్లు	6–11–74
53.	పల్లెపడుచు	15–11–74
54.	అమా[illegible]వాస	16–11–74
55.	జీవి	28–11–74
56.	దేవ.	6–12–74
57.	దీక్ష	11–12–74
58.	రామ్–రహీం	12–12–74
59.	ఊర్వశి **C**	20–12–74
60.	ఎవరికివారే యమునాతీరే	20–12–74

C. కలర్ : **A.** ఎడల్ట్సు : **C.A.** కలర్, ఎడల్ట్సు : **C.S.** కలర్, సినిమా స్కోప్

ద ర్శ కు లు

దాసరి నారాయణరావు 5, వి. మధుసూదనరావు 4, కె.యస్. ప్రకాశరావు 2, కె. ప్రత్యగాత్మ 2, పి. యస్. రావు 2, కె. విశ్వనాథ్ 2, కె. సత్యం 2, లక్ష్మీదీపక్ 2, వి. బి. రాజేంద్రప్రసాద్ 2, బి. వి. ప్రసాద్ 2, పి. సి. రెడ్డి 2, ఎన్. టి. రామారావు 1, భానుమతీ రామకృష్ణ 1, విజయనిర్మల 1, బి. విఠలాచార్య 1, ఆదుర్తి సుబ్బారావు 1, కె. బాపయ్య 1, టి. కృష్ణ 1, కె. వి. నందనరావు 1, కె. బాబూరావు 1, యస్. డి. లాల్ 1, టి. రామారావు 1, కె. కామేశ్వరరావు 1, బి. ఏ. సుబ్బారావు 1, యస్. యస్. బాలన్ 1, బి. భాస్కర్ 1, టి. ప్రకాశరావు 1, యస్. యస్. దేవదాసు 1, గిరిబాబు 1, పి. నాగాంజనేయులు 1, వి. రామచంద్రరావు 1, బి. యస్. ఆర్. 1, జి. విశ్వనాథం 1, యం. రంగారావు 1, పి. డి. ప్రసాద్ 1, పద్మనాభం 1, కె. హేమాంబరధరరావు 1, రామినీడు 1, కె. వాసు 1, తిలక్ 1, పి. సాంబశివరావు 1, చక్రవర్తి 1, కె. వరప్రసాదరావు 1, పట్టు 1.

44 గురు దర్శకులు, చిత్రాలు 60

సంగీతం

చక్రవర్తి 9, కె. వి. మహదేవన్ 8, యస్. రాజేశ్వరరావు 7, రమేష్‌నాయుడు 6, సత్యం 6, పెండ్యాల 4, టి. చలపతిరావు 3, వి. కుమార్ 2, సత్యం, భానుమతి 1, విశ్వనాథ్ 1, వేణు 1, శంకర్ 1, జె. వి. రాఘవులు 1, ఆదినారాయణరావు 1, యస్. హనుమంతరావు 1, ముత్తు 1, ఎ. ఎ. రాజ్ 1, విజయభాస్కర్ 1, సలీల్ చౌదరి 1, బ్రహ్మానందరావు 1, గోపాలం 1, ఘంటసాల • రాజేశ్వరరావు 1, టి. వి. రాజు • హనుమంతరావు 1.



మ్యాడ్రిడ్‌లో జరిగిన ఆయిదవ అంతర్జాతీయ చలనచిత్రోత్సవ సందర్భంగా ఏర్పాటు చేసిన సత్కార సభలో రిషికపూర్, హాలీవుడ్ నటి [illegible]లా బ్రిగీడా, సిమీగరేవాల్ తదితర ప్రతినిధులని చిత్రంలో చూడవచ్చు.

Printed and Published by S. NageswaraRao at the Andhra Patrika press, MallikarjunaRao Street, Gandhinagar, Vijayawada-3. Editor: S. Radhakrishna



వీనస్ మహీజా పిక్చర్స్
యశోద కృష్ణ
ఈస్ట్‌మన్ కలర్
నిర్మాత: సి.హెచ్.ప్రకాశరావు
దర్శకత్వం: సి.యస్.రావు B.A.
రచన: ఆరుద్ర
సంగీతం: యస్.రాజేశ్వరరావు
కెమెరా: జి.కె.రాము
నవయుగ
VEEKAY

ఆంధ్రసచిత్ర వారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు
స్థాపితం : 1908
శివలెంక శంభుప్రసాద్
సంపాదకుడు
(1938 - 1972)
శుక్రవారం : 24-1-'75
ఆనందనామ సం. పుష్యమాస శు. ఏకాదశి
సంపుటము : 68 సంచిక : 19
సంపాదకుడు :
శివలెంక రాధాకృష్ణ
★
సంవత్సర చందా – రు. 33-80 పై.
ఆరుమాసాల చందా – రు. 16-90 పై.
విడిప్రతి వెల 60 పైసలు
ఆంధ్రపత్రిక కార్యాలయము
గాంధీనగరం, విజయవాడ-520003.

విషయానుక్రమణిక

అట్టమీద బొమ్మ :
నటి "ప్రమీల"

పై వారమే
"చిగురించిన జీవితం" ప్రారంభం!

మనలో మాట

'ఫిలిం బ్యాలట్'లో పాల్గొనేవారికి ఉపయోగపడతాయని యీ సంచికలో సినిమాల జాబితా, దర్శకుల, సంగీత దర్శకుల జాబితాలను వేశాము. దర్శకులు ఒక్కొక్కరెన్నేసి చిత్రాలకు సారథ్యం వహించారో ప్రక్కన గల సంఖ్యలు సూచిస్తాయి. బ్యాలట్ పత్రం వారపత్రికలోనిదే వాడాలని మరోసారి మనవి. తెల్లకాగితాలపై వ్రాసినవి చెల్లవు. నటీనటుల ఎన్నిక విషయంలో పాఠకులకు జాబితాలతో పని వుండదు అనుకుంటున్నాము. ఎందుకంటే ఎవరి అభిమాన నటులు, వారికే వుంటారు. పైగా సహాయ నటుల ఎన్నిక కూడా వున్నందువల్ల జాబితా వేయటం వల్లమాలినపని అయిపోతుంది కూడాను.

దీపావళి కథల పోటీలో మామూలు ప్రచురణకై ఎన్నుకున్న కథల రచయితలకు మేము ఉత [illegible] రాశాము. మా నుంచి [illegible] ందని తతిమ్మా పోటీలో [illegible] చయితలను వారి రచనలు ప్రచు[illegible] మోదం పొందలేదని త్రిప్పిపంపబడవని గ్రహించ వలసిందిగా కోరుతున్నాము.

హతానికి దారితీసిన అసంతృప్తి

బీహారు రాష్ట్రంలో తమ అసంతృప్తిని శత విధాల తెలియపరుస్తూ మూడు వేల మంది ప్రభుత్వ డాక్టర్లు, పన్నెండువేలయిదొందల మంది ఇంజనీరులు ఒకేసారి మూడ్రోజులు తాప్పున శలవులు పెట్టి కూర్చున్నారట— కిం ప్రయోజనం!

లోపలి భాగాలు తారుమారైన పిల్లాడు

కాలిఫోర్నియాలో వో వింత శిశువు జన్మించాడట. అతనికి అవయవాలు, శరీర భాగాలు అన్నీ కూడా తారుమారుగా వున్నాయట. మామూలుగా మానవుని గుండెలో నాలుగు గదులుంటే యీతని గుండెకు రెండే గదులున్నాయట. ఎడమ ప్రక్క వుండాల్సిన గుండె కుడి భాగంలో వుండడమే గాక, తల క్రిందులుగా కూడా వున్నదట. ఎడమ భాగంలో వుండాల్సిన పొట్ట కుడిభాగంలో వుందట. లీవరు ఎడమ భాగంలో [illegible]ట. లోపలి అన్ని భాగాలూ తారుమారుగా [illegible] ందులుగా వున్న యీ పిల్లాడు నవంబరు 18 న పుట్టాడట. హంగేరియన్ మెమోరియల్ ఆసుపత్రికి చెందిన అంత మంది డాక్టర్లూ యీ వింత బాలుని స్థితికి అస్సలు కారణం బోధ పడక తలలు చేత్తో పుచ్చుకూర్చున్నారట.

మిక్కుటంగా మాతృభాషలు

మన దేశంలో యిప్పటికి 281 మాతృ భాషలున్నాయట. అయిదు వేల మందైనా మాట్లాడేభాషలను లెక్క తీస్తే యీ సంఖ్య తేలిందట. ఈ విషయం లోక్‌సభ విన్నదట.

పసివాడికి పన్ను

బెంగాల్‌లో ఒకాయన తన పిల్లాడి పేర బహుమతిగా వచ్చిన 80 వేల విలువ చేసే యిల్లు ఆదాయపు శాఖ వారి చెవిన వేశాడట. ఆ పిల్లాడికి రెండో ఏడట. ఆ విషయం తెలియపరచనందువల్ల సదరు శాఖ ఆ పసి కుర్రాడికి కూడా ఆదాయప్పన్ను విధించిందట.

24-1-1975 శుక్రవారం మొదలు 30-1-1975 గురువారం వరకు

మేషం:— వ్యాపార విస్తరణ ప్రయత్నాలు బాగుంటాయి. మిత్రులకు సహాయం చేస్తారు. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. ప్రయాణాలు వాయిదా పడతాయి. భవిష్యత్తులో మీకు లాభించగల వ్యవహారాల్లో అభివృద్ధిని సాధిస్తారు. స్త్రీలకు — ఆరోగ్యం బాగుంటుంది. దైవకార్యాలు నెరవేరతాయి.

వృషభం:— వృత్తిలో ముఖ్యమైన వ్యక్తులను కల్సుకొంటారు. నూతన విషయాలను తెల్సుకొంటారు. రాజకీయ వ్యవహారాలు బాగుంటాయి. సాహసిక వ్యవహారాలు లాభిస్తాయి. వారం ఆఖరులో మీ కార్యక్రమాలు హడావుడిగా ఉంటాయి. స్త్రీలకు —కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. బంధువులకు సహాయం చేస్తారు.

మిథునం :— మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. వ్యాపారంలో ఆదాయం పెరుగు తుంది. రావలసిన డబ్బు అందగలదు. విద్యా వైజ్ఞానిక రంగాల్లో ఖ్యాతిలభిస్తుంది. కోర్టు వ్యవహారాలు బాగుంటాయి. వృత్తిలో అనుకూల వార్తలను వింటారు. స్త్రీలకు —ఆరోగ్యం బాగుంటుంది. వినోదకాలక్షేపాల్లో పాల్గొంటారు.

కర్కాటకం:— అనవసరమైన శ్రమ కలుగు తుంది. సాహసిక వ్యవహారాల్లో నష్టం వస్తుంది. వారం మధ్యలో మీ కార్యక్రమాలు బాగుంటాయి. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. భాగస్వాములతో కలసి చేసే వ్యాపారాలు బాగుంటాయి. స్త్రీలకు — కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. మీ తాలూకు వస్తువులు పోవచ్చును.

సింహం:— ఆర్థిక వ్యవహారాలు బాగుంటాయి. వృత్తిలో మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. వారం మధ్యలో చికాకులు యేర్పడతాయి. ప్రయాణాల్లో శ్రమ కలుగు తుంది. వారం అఖరులో మీ కార్యక్రమాల్లో అనుకూలత లభిస్తుంది. స్త్రీలకు — ఆరోగ్యం బాగుండదు. సంతానానికి సౌఖ్య సంతోషాలు లభిస్తాయి.

ఫాలాక్షుని డైరీ

చైనాగింజ—మనగింజ

రాయపూరుకు చెందిన బోరొండా గ్రామంలో కొందరు శాస్త్రజ్ఞులు చేరి ప్రపంచంలో కల్లా పొడవైన వడ్ల గింజను రూపొందించారట. ఈ వడ్ల గింజ 14.5 మిల్లీమీటర్ల పొడవుందట. చైనా వారు రూపొందించిన వడ్లగింజ, 14.25 మిల్లీ మీటర్లేనట.

మందులకొరతవల్ల మలేరియా అభివృద్ధి!

తగినన్ని మందులు, నిరోధక సాధనాలూ లేనందువల్ల మలేరియా వ్యాధి ఏషియామీద విరుచుకుపడనున్నదని, లాస్ ఏంజలిస్ టైమ్స్ పత్రిక రాసిందట. వారి అంచనాల ప్రకారం హిందూదేశంలో ఈ ఏడు సుమారు మూడు నాలుగు మిలియనుల జనాభాకి మలేరియా వచ్చి తీరుతుందట. మనని విడిచి వూరంతా పిడుగుపడు గాక!

పరాభవం పాలైన డాక్టరు

డాక్టరు సరిగా చూడని కారణాన కేన్సరుతో బాధపడుతున్న వో రోగి నిష్కారణంగా చనిపోయాడన్న వార్త పేపరులో చదివిన కొందరు చదువరులు డెహ్రాడూన్ ఆసుపత్రిమీద విరుచుకుపడి, ఆ డాక్టరు గారిని పట్టుకుని ముఖానికి నల్లరంగుదట్టంగా పట్టించి మరీ వదిలారట. దాంతో డాక్టర్లంతా సలబై ఎనిమిదిగంటలు సమ్మె చేయడానికి వెంటనే సమావేశమయ్యారట. దటీజిండియన్స్పిరిట్!

రూపాయి బ్రతుకు

స్వాతంత్ర్యం వచ్చిన్నాటినుంచి మన దేశంలో రూపాయకు పరువు టకటక దిగుపోతూ వస్తోంది. 1961లో 79.5పైసల విలువలోకి జారినరూపాయి తన విలువను 1971 నాటికి 43.4 పైసలకు దిగజార్చుకుని, అప్పటికయినా ఆగక్క యీ నాటికి 27.6 పైసలకు తగ్గిపోయిందట. అయినా ఆశ్చర్యం చెందనవసరంలేదని, యీ లెక్కన పోతే అయిదో ప్రణాళికయ్యేసరికి రూపాయి బ్రతుకు అమావాస్యవుతుందని బెంగపడరాదని, గత రెండేళ్ళగా ధరలు విపరీతంగా పెరిగినమాట వాస్తవమేనని కేంద్ర ఆర్థికమంత్రి మిస్టర్ సి. సుబ్రహ్మణ్యంగారన్నారట. ఆశయా బాధ్యతే కేంద్రం!!

నగలతో పరారయిన స్వామీజీ


అహమ్మదాబాదులో వో నలబైయ్యేళ్ల బాబాజీ గారో అమాయకుణ్ణివలలో వేసుకుని తన చిన్న చిన్న గారడీలచేత ముందాతని మెప్పుపొంది, ఆయనింట్లో తిష్టవేశాడట. వేశాక అహ్మదాబాదులో వున్న బంగారాన్నంతా వో యాగంద్వారా అతనింట్లోకి రప్పిస్తాననా అమాయకుణ్ణి వప్పించి, ఆ యాగానికిగానూ తనకు కొంత బంగారము, కొంత ధనము కావాలన్నాడట. దాంతో ఆ అమాయకుడు తన భార్యనగలు, చెల్లెళ్లనగలు, చుట్టాల నగలు ఒలిచి, డబ్బు అప్పుచేసి, ఆ స్వామిజీ చేతిలో పోశాడట. సుమారు పదిహేనువేల రూపాయల నగలతోనూ, రెండున్నరవేల ధనంతోనూ ఆ స్వామిగారు అంతర్ధానమైపోయాడట. స్వామి కనపడక, కళ్ళు అజ్ఞానప్పొరలువిడి, ఆ అమాయకుడు లబోదిబమంటున్నాడట—పోలీసు ! వాళ్ళెంచేస్తారు ! విచారిస్తారు.

పొగాకు ఉత్పత్తి—మ ూత

పొగాకు ఉత్పత్తి చేయూత నిచ్చి, అమెరికా ప్రభుత్వం మరణాలకే చేయూతనిస్తోందని "అమెరికన్ మెడికల్ ఎసోసియేషన్" అనే వో పత్రికలో వో ఆర్టికల్ అన్నదట. పొగ్తాగడం వల్ల కాన్సరువంటి భయంకర రోగాలు వస్తాయని ప్రపంచంలోని విజ్ఞాన వేత్తలంతా ఏనాడో రూఢిపరచినా, యునైటెడ్‌స్టేట్స్ పొగాకు ఉత్పత్తి కోసం యింకా పాటుపడుతూ వాటికి చేయూతనిస్తోందట. వైట్‌మెమోరియల్ మెడికల్ సెంటర్ కార్డియో పల్మోనరీయూనిట్ ... లాస్ ఏంజలిస్‌కు చెందిన కార్డియాలజిస్ట్ డాక్టర్ వెల్డన్‌వాకర్ యీ విషయం రాస్తూ, ఏటా అమెరికా పొగాకు పుత్పత్తి మీద 11,550 మిలియనులు ఖర్చు చేస్తోందన్నారట.

తలని తరిగించిన అమ్మకం

తనకు యిల్లుఅమ్మమంటే ఆమ్మకుండా మరొకడికి అమ్మిందని క్రిష్ణగిరితాలూకా "మిటహళ్ళి" గ్రామంలో సుబ్రహ్మణ్యం అనే ఒకతను కోపంతో చిన్నమ్మ అనే ఆమె మీద పగబట్టి, ఆమె ఆరుబయట నిలబడివుండగా కొడవలితో ఆమె మీదకి లంఘించిన్నరున ఆమె తలనరికి, మొండెం నుంచి వేరుచేసి గిరాటేసేశాడట. కోర్టాతనికి యావజ్జీవ శిక్ష విధించిందట—ఇంకేంచెప్పడానికి లేదే!!



వారఫలం

మహేష్

కన్య :— మీ కంటే పెద్దవారు కూడా మీ సహకారాన్ని కోరవలసి వస్తుంది. పుణ్యకార్యాలు చేస్తారు. సాహసిక వ్యవహారాలు బాగుంటాయి. మిత్రుల సహాయం లభిస్తుంది. వారం ఆఖరులో మీ ప్రయత్నాలకు ఆటంకాలు రాగలవు. స్త్రీలకు—కుటుంబ వ్యవహారాల్లో శ్రమ కలుగుతుంది. ప్రయాణాలు వాయిదా పడతాయి.

తుల :— వృత్తిలో అనుకూల వార్తలను వింటారు. సాహిత్య కళారంగాల్లో ఖ్యాతి లభిస్తుంది. స్థిరాస్తి వ్యవహారాలు బాగుంటాయి. ప్రయోజనం గల సంభాషణలను జరుపగలరు. మీరు యిదివరకు చేసిన ప్రయత్నాలు ఫలించగలవు. స్త్రీలకు—ఆరోగ్యం బాగుంటుంది. బంధువుల వ్యవహారాల్లో మీ కృషి ఫలిస్తుంది.

వృశ్చికం: వ్యాపారంలో శ్రమ కలుగుతుంది. ప్రయాణాలు వాయిదాపడతాయి. వారం మధ్యలో రావలసినడబ్బు అందుతుంది. వృత్తిలో నూతనావకాశాలు లభిస్తాయి. స్త్రీలకు—కుటుంబ వ్యవహారాల్లో కార్యభారం పెరుగుతుంది. పుణ్యకార్యాలు చేస్తారు.

ధనుస్సు — మీ ఆలోచనలు ఫలిస్తాయి. రావలసిన డబ్బు అందుతుంది. వారం మధ్యలో వ్యతిరేక పరిస్థితి యేర్పడుతుంది. మీ ప్రయత్నాలకు ఆటంకాలు వస్తాయి. వారం ఆఖరులో అన్ని వ్యవహారాలు తిరిగి బాగుంటాయి. స్త్రీలకు—ఆరోగ్యం బాగుండదు. సాటివారిలో గౌరవ ప్రాబల్యాలు బాగుంటాయి.

మకరం :— రాజకీయ వ్యవహారాల్లో శ్రమ కలుగుతుంది. ప్రయాణాలు వాయిదా పడతాయి. వ్యాపారంలో ముఖ్యమైన వ్యక్తులను కల్సుకొంటారు. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు. వారం ఆఖరులో చేజిక్కిన అవకాశాలు కూడా జారిపోవచ్చును. స్త్రీలకు — కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. ఆడంబరంకోసం వ్యయం చేస్తారు.

కుంభం :— వ్యాపారంలో ఆదాయం బాగుంటుంది. నూతన విషయాలను తెల్సుకొంటారు. సాటివారితో వాదప్రతివాదాలు తగవు. కోర్టు వ్యవహారాల్లో శ్రమ కలుగుతుంది. వారం ఆఖరులో మీ ప్రయత్నాలు సులువుగా నెరవేరతాయి. స్త్రీలకు—ఆరోగ్యం బాగుంటుంది. బంధు మిత్రులను కల్సుకొంటారు.

మీనం :— మీ మంచితనమే మీకు యిబ్బందిని కలిగించగలదు. పుణ్యకార్యాలు చేస్తారు. వృత్తిలో నూతనావకాశాలు లభిస్తాయి. సాహసిక వ్యవహారాలు బాగుంటాయి. వారం ఆఖరులో అనవసరమైన సందేహాలు కలుగుతాయి. స్త్రీలకు — ప్రయాణాలు వాయిదా పడతాయి. సాహిత్య కళారంగాల్లో ఖ్యాతి లభిస్తుంది.

''అబ్బబ్బ! ముదనష్టపు పిలక బావా వీడూను... చెవులు బద్దలు కొడుతున్నాడు'' అంటూ శ్రీమతి కాఫీ కప్పు అందించింది.

రోడ్డుమీద సింహాచలం ఎడతెరిపి లేకండా సన్నాయి వాయిస్తున్నాడు.

''ఓ ఓ ఓ...పిలక బావయ్య ... పిలక బావయ్య''

ఆదివారం రోజంతా ఇంట్లో గడపమని ప్రభుత్వం మంజూరుచేసిన వీకెండ్. పిలక బావ కాస్తా శ్రీమతి మూడ్ చెడగొట్టేశాడు. శ్రీమతి మూడ్ ఒకసారి చెడిందంటే రోజంతా మూడీగానే వుంటుంది. అందుకే కొంచెం ఈజ్ చెయ్యాలనిపించి ''ఏం? అంత కర్ణ కఠోరంగా లేదే?'' అన్నాను. శ్రీమతి తారా జువ్వలా లేచింది.

''మీకేం? రోజంతా హాయిగా ఆఫీసులో గడుపుతారు. నేను వీడి సంగీతం వినలేక ఛస్తున్నాను. ఇదిగో చూడండి! వాణ్ణి పిలిచి కాస్త హెచ్చరించండి. లేదా ఈ కొంపయినా మార్చండి. ఏదో ఒకటి జరగాల్సిందే! అంతే'' అని అల్టిమేటమ్ ఇచ్చి తుర్రుమంది.

సింహాచలాన్ని పిలిచి హెచ్చరించవలసిందిగా శ్రీమతి కొంతకాలంగా చెబుతూ వున్నమాట నిజమే కాని కొంపమార్చమనడం ఈ రోజే జరిగింది. అంటే సమస్య తీవ్రస్థాయికి చేరుకుందన్నమాట. ఏదో ఒక పరిష్కార మార్గం చూడకపోతే ఇంట్లో శాంతి భద్రతలకు ముప్పు కలగొచ్చు.

కాఫీ చప్పరిస్తూ శ్రీమతి పాయింట్‌ని అర్థం చేసుకోవాలని ప్రయత్నించాను. నిజమే! రోడ్డుమీద సింహాచలం సన్నాయి వాద్యం కొంచెం ఇబ్బందిగానే వుంది. క్రిందటి వారమంతా ''అబ్బాయే పుడతాడూ...'' దంచాడు. అంతకుముందొక వారం పదిరోజులు ''గాంధి పుట్టిన దేశమా ఇది?'' అని సందేశం వెదజల్లాడు. మధ్య మధ్యన ''దమ్ ... మారో దమ్...'' హిందీ పాటలు కూడా అందుకుంటాడు. ఒకపాట సాధన పట్టుకుంటే దాని అంతు తేల్చి మా ప్రాణాలు విసుగెత్తేదాకా వదలడు. పైగా ఒక వేళాపాళా అంటూ లేదు. ఉదయం పిలకబావ. మధ్యాహ్నం పిలకబావ. రాత్రిళ్లు పిల్లలు చదువుకునే వేళ పిలకబావ. పడుకునేప్పుడు పిలకబావ. విని విని విసుగెత్తదూ? మొదట్లో ఒక్కడే పాడుతుండేవాడు. తరువాత మరో ఇద్దరు కలిసి వాయించడం మొదలు బెట్టారు. ఒక వారం నుండీ ఒక డమ్ముకూడా కలిసింది.

సింహాచలం నాకు నెలకోసారి క్రాపు కత్తిరించి పోతుంటాడు! అదే పరిచయం. 'క్రాపులు చక్కగా కత్తిరించబడును, అనే బోర్డుతో మెయిన్‌రోడ్డు మీద ఒక చిన్న బడ్డీ షాపు. ప్రక్కనే ఒక చిన్న పాక. అందులో అతని సంసారం. ఒకసారి క్రాపు కత్తిరిస్తున్నప్పుడడిగాను.

''ఏమిటోయ్? పాటలు దంచేస్తున్నావ్''

''అవును బాబుగోరూ! బేండు మేళంలో శాన్సు దొరికినాది. పెళ్లిళ్ల సీజనొచ్చేసరికి నాలుగైదు పాటలు నేర్చుకోడం పూర్తిగావాలి.'' అన్నాడు హుషారుగా.

''నీ పాటలు కాదు గాని మా చెవులు తుప్పొదిలిస్తున్నావ్'' అన్నాను నవ్వుతూ.

''నేర్చుకోడం కంద బాబూ! అట్టనే వుంటుంది. రెణ్ణెల్లాగండి. నా పాటిని గుమ్మయిపోతారు'' అన్నాడు వుత్సాహంగా.



నువ్వా నా బలవా?

తాతినేని వెంకట నరసింహారావు

అంటూ తన తాత ముత్తాతలు గొప్ప క్లారినెట్ విద్వాంసులనీ, తన తండ్రి మిలట్రీ డ్రస్సు వేసుకుని బుర్ర మీసాలతో క్లారినెట్ వాయిస్తే పూళ్లో సుంటలంతా అన్నపానాలు మరచి చుట్టూ చేరేవారనీ వగైరా వగైరా చెప్పాడు. సింహాచలం వుత్సాహం చెడగొట్టడానికి మనస్కరించలేదు.

శ్రీమతి మూడు ఖచ్చితమైన అభియోగాలు తెచ్చింది.

సింహాచలం రాత్రీ పగలూ బెండుమేళం పాటలతో చుట్టుపక్కల అందరి ప్రశాంతతనీ చెడగొడుతున్నాడు.

మున్సిపాలిటీ స్థలంలో జబర్దస్తీగా పాక వేసుకుని వుంటున్నాడు.

లైసెన్సు లేకుండా షాపు నడుపుతున్నాడు.

శ్రీమతి అభియోగాలు సబబుగా కనిపించక పోవడం నాకే ఆశ్చర్యం అనిపించింది. గవర్నమెంటు ఆఫీసర్ని కావడంవల్ల సహజంగా నాకు 'నెగెటివ్' దృక్పథం అంటే ఎడ్డెం అంటే తెడ్డెం అనడం బాగా అలవాటయింది. చెకోవ్ గాబోలు ఒకసారిలా అన్నాడు. "వృత్తి ధర్మంగా ఇతరుల బాధలతో సంబంధం వున్న వ్యక్తులు-అంటే న్యాయమూర్తులు, పోలీస్ అధికార్లూ, డాక్టర్లూ వగైరాలకు ఇతరుల చావు బ్రతుకుల్ని కూడా నిర్లక్ష్యంగా చూడటం అలవాటయి పోతుంది. కసాయివాడు తన పెరట్లోనే మేకల్ని గొర్రెల్ని చంపుతూ కూడా రక్తాన్ని గమనించడు. వీళ్లూ అంతే" అని. ఆ లక్షణాలన్నీ సహజంగా నాకూ అలవడ్డాయి. ఇతరుల బాధలు నా కంటికి కనిపించడం మానివేశాయి. అలాంటి నాకు శ్రీమతి వాదం సబబుగా కనిపించకపోవడం ఆశ్చర్యంకాదూ ? నా హృదయం ఎంతగా కరుడు కట్టుకుపోయినా ఇంకా ఎక్కడో కాస్త స్పందన మిగిలివుంది. ఈ స్పందనే సింహాచలం అభివృద్ధిని గుర్తించ గలిగిందనుకుంటాను.


నేను మొట్ట మొదట సింహాచలాన్ని ఒంటరివాడిగా గుర్తించాను. చెట్టు క్రిందే క్షౌరాలు చేస్తుండేవాడు. తరువాత చిన్న బడ్డీ షాపు పెట్టాడు. షాపుతో సింహాచలం హోదా పెరిగి నా క్రాపు కత్తిరించడానికి అర్హత సంపాదించుకున్నాడు. కొన్నాళ్లకు జంట కుదుర్చుకున్నాడు. షాపు ప్రక్కనే ఖాళీ స్థలంలో ఒక చిన్నపాకను భార్యాభర్తలిద్దరూ శ్రమించి తమ స్వంత చేతులతో కట్టుకున్నారు. ఈ ఇల్లు కట్టుకునే కృషే నా కుతూహలాన్ని బాగా రేకెత్తించింది. ఒక అతి చిన్న వ్యక్తి తన బ్రతుకుని సుఖవంతం చేసుకోవడానికింత బ్రహ్మాండమైన కృషిని నా కళ్లెదుటే జరుపుతుంటే చూడకండా ఎలా వుండగలను ? మా ఇంట్లో లాన్‌లోకూర్చుని చూస్తే మెయిన్ రోడ్డు మీద అంతా కనిపిస్తుంది. సాయంసమయాల్లో సింహాచలం మట్టిత్రవ్వి అతనిభార్య నెత్తిమీదకెత్తేవాడు. ఆమె నవ్వుతూ మోసుకువెళ్ళేది. ఆమె మట్టి మోస్తున్నా నా కళ్లకు సత్యభామ వయ్యారం కనిపించేది. అజంతా శిల్ప సౌందర్యం మనసులో మెదిలేది. రంభా, ఊర్వశి, తిలోత్తమ వగైరా బ్యూటీ లంతా మెదిలేవారు. సింహాచలం భార్య అంత అందగత్తె. మిసమిస లాడే యవ్వనం, ఆమె రాకుమార్తె అయివుంటే ఆమెకోసం యుద్ధాలు జరిగివుండేవి. కనీసం ఆమె ఒక కాలేజి స్టూడెంటయివున్నా పోటీలు పడిమరీ ఆమెను ఆరాధించేవాళ్లు.

నిజం చెప్పాలంటే ఆమెను చూసినప్పుడు నాకు కామోద్రేకంలాంటి వికారాలేమీ కలుగలేదు. ఏలాంటి చె లంపూ రాలేదు. ఎందుకో పూజ్యభా అప్సరసో శాపవశాన భూలోకంలో లం భార్య అయివుంటుందనిపిం ల్ల సంసారం నాకు ముచ్చటగా కనిపించింది. సింహాచలం బడ్డీ పెట్టుకుని తన వృత్తిచేసుకుంటున్నాడు. ఇల్లు కట్టుకుని సంసారంతో సుఖంగా వుంటున్నాడు. బ్యాండుమేళంలో చేరి జీవితంలో మరో మెట్టుపైకి పోవాలని పట్టుదలతో సాధన చేస్తున్నాడు. ఇదితప్పెలా అవుతుంది? నాది ఎంత కర్ర పెత్తనం వుద్యోగం అయితే మాత్రం రోడ్డుమీద తన ఇంట్లో పాటలు పాడుకునేవాణ్ణి పిలిచి పాడొద్దని చెప్పడానికి అధికారం నా కెవరిచ్చారు ? రోడ్డు మీద లారీలూ, బస్సులూతిరగొద్దని శాసించగలనా? జంతువుల్నీ పక్షుల్నీ నిశ్శబ్దంగా వుండమని ఆర్డరు వెయ్యగలనా? ఇలాంటివేవీ చెయ్యలేని నేను సింహాచలానికి ఎలా చెప్పగలను?

మధ్యాహ్నం భోజనం కానిచ్చి నడుం వాల్చాను. మళ్లీపాట.

"ఓ ఓ ఓ...పిలక బావయ్యా...పిలక బావయ్యా..."

శ్రీమతి విసుక్కుంది. ఇంత చిన్న విషయాన్ని ఆమె అంతగా పట్టించుకోవడంనాకు నచ్చలేదు. ఇరుగుపొరుగన్న తరువాత



కొంచెం సర్దుబాటవుసరం. ఇష్టమున్నా లేకపోయినా కొన్నిఅసౌకర్యాలు తప్పవని నచ్చజెప్పడానికి ప్రయత్నించాను.

సాయంత్రం లాన్‌లో కూర్చుని పేపరు చూస్తున్నాను. ప్రక్కింటి శాస్త్రికూడా వచ్చి కూర్చున్నాడు. శాస్త్రికూడా గవర్నమెంటు ఆఫీసరే. వేరే డిపార్ట్‌మెంటులో.

"ఓఓఓ... పిలక బావయ్య ... పిలక బావయ్యా..." మళ్లీ అదే పాట. నాకు శాస్త్రి అభిప్రాయం తెలుసుకోవాలనిపించింది.

"శాస్త్రిగారూ ! మీకీ సన్నాయి మేళం అసౌకర్యంగా లేదూ?" అన్నాను.

"చంపేశారు. చెవుల్లో దూది పెట్టుకుంటున్నాం." అంటూ నిజంగానే చెవుల్లో దూది చూపించాడు. శ్రీమతి కాఫీతో ప్రవేశించింది.

"అబ్బో శాస్త్రిగారూ ! ఆయనకు అతి శ్రావ్యంగా వినిపిస్తోందిట" దెప్పి పొడిచింది.

"అవునా రావుగారూ?" అంటూ శాస్త్రి ఆశ్చర్యపోయాడు.

"దీనికేదో పరిష్కార మార్గం చూడకపోతే మనం ఇక్కడుండలేం."

"అయితే ఏంచేద్దామంటారు ?"

"వాణ్ణి పిలిపించి వాయించొద్దని చెబుదాం ? అంతే. కొన్ని సందర్భాల్లో కఠినమైన నిర్ణయాలు తీసుకోవాలి. తప్పదు మరి" అన్నాడు.

"అన్యాయం..."

"ఏం? రోజూ వాడు మనల్ని నానా హింసా పెట్టడం అన్యాయంకాదూ ?"

"వాడు మనల్నేమీ కావాలని బాధ పెట్టడంలేదు. వాడి బ్రతుకుతెరువుకోసం వాడి తాపత్రయం..."

"ఏదో ఒక త్రయం... మన కంటిమీద నిద్ర లేకుండా చేస్తున్నాడు. అయినా మీరు మరీ అంత సత్తెకాలంలో వుంటే ఎలా

నువ్వు అబలవా ?

గండీ...'' అంటూ నౌకరు కుర్రాణ్ణి సింహాచలాన్ని పిలుచుకురమ్మని పురమాయించాడు. కొంచెంసేపట్లో సింహాచలం వచ్చాడు.

''దణ్ణాలు బాబూ !''

''కూర్చోవోయ్'' అంటూ లాన్ చూపించాడు శాస్త్రి. సింహాచలం వినయంగా కూర్చున్నాడు. చెప్పవలసిందంతా శాస్త్రి కుండ బద్దలు కొట్టినట్లు చెప్పాడు. మెత్త మెత్తగానే నిష్కర్షగా కొంచెం కటువుగా చెప్పాడు. సింహాచలం తెల్లబోయాడు. తన సన్నాయివాద్యం మాకు అసౌకర్యంగా వుండటం నమ్మలేకపోయాడు.

''బాబూ! తమరు రెణ్ణెల్లోపిక పట్టండి. నేర్చుకోడం పూర్తయిపోతది'' అన్నాడు.

''రెణ్ణెల్లా ? అప్పటివరకూ మమ్మల్ని ఇల్లు విడిచి పొమ్మన్నావా ? చెప్పు'' అన్నాడు శాస్త్రి. సింహాచలంలోకూడా సహనం నశించి పోయినట్టుంది.

''అయితే నన్నే ఇల్లొగ్గేసి పొమ్మంటరా?'' అన్నాడు విసుగ్గా.

''నువ్వూ పోవద్దు. మేమూ పోము. అందరమూ కలిసి సహజీవనమే చేద్దాం. నువ్వు బేండుమాళం మానెయ్.''

''ఇదెక్కడన్యాయం బాబూ ? తమరు సెప్పండి'' అంటూ నావంక తిరిగాడు. సింహాచలం దృష్టిలో నేను కొంచెం సబబయిన మనిషినని. న్యాయం సింహాచలం వైపునే వుందని మనసు చెబుతున్నా జవాబు చెప్పలేకపోయాను. సింహాచలం వెళ్లిపోయాడు.

''చూశారా? చూశారా?వాడి పొగరు?...'' అంది శ్రీమతి. నాకు పొగరేమీ కనిపించలేదు. పిల్లిని గదిలో పెట్టి కొడితే ఏం చేస్తుంది ? గత్యంతరం లేక కలబడుతుంది. అదే చేశాడు సింహాచలం.

మర్నాడు శాస్త్రి ఒక టైపు చేసిన కాగితం తీసుకొచ్చి ముందు పెట్టాడు.

''ఏమిటది ?''

''సంతకం పెట్టండి.'' చదివి చూశాను. సింహాచలం మీద పోలీస్ కంప్లెయింట్.

''పిచ్చుక మీద బ్రహ్మాస్త్రమా శాస్త్రి గారూ ?''

''వాడు పిచ్చుకా? పిచ్చుకటండీ? అయినా మీరు సంతకం పెట్టండి. మిగతా పాపం అంతా నాది. సరేనా ?''

''నా వల్లకాదు''

''నే ... ంతకం పెట్టగల్ను. కాని పోలీ... , మీ సంతకం చూస్తే వెంటనే ఉ... కుంటాడు.''

శ్రీమతి కూడా నా మీద బాగా వత్తిడి తెచ్చింది. చెవిలో జోరీగలా పోరింది. పోరు భరించలేక చివరకు సంతకం పెట్టాను.

రెండు రోజుల తరువాత ఒక సాయంత్రం సింహాచలం భార్య భోరు భోరున ఏడుస్తూ వచ్చింది.

''ఏమిటీ పాడుసంత ?'' అంటూ శ్రీమతి వచ్చింది.

''బాబుగారూ ! దయుంచండి. ఆ దిక్కుమాలిన బేండు మేళం మాకొద్దు. ఉన్నది శాన. కలో గంజో తాగి తొంగుటము. ఆయన్ను పోలీసు టేషన్లో పెట్టినరు. కేసూ గీసూ అంత్రను. ఒగ్గిపించండి. బాబూ ! మీకు పుణ్యముంటుంది ... '' అని ఒకటే ఏడుపు.


నా మనసు చివుక్కుమంది. సింహాచలం పోలీసుస్టేషన్లో వున్నందుక్కాదు, సింహాచలం భార్య పోలీసుస్టేషనుకు వెళ్లినందుకు.


''సరే ! కేసూ గీసూ లేకుండా నేను చూస్తాను. నువ్వెళ్లు'' అని పంపించివేశాను. శ్రీమతి మూతి మూడు వంకర్లు తిరిగింది. వెళ్లిపోతున్న సింహాచలం భార్య వంక కొర కొరా చూసింది.

సింహాచలం భార్యని పోలీసు స్టేషన్లో వూహించుకోలేక పోయాను. ఎప్పుడో చూసిన సినిమాలో ఒక సీను గుర్తొచ్చింది. పది మంది రాక్షసుల చేతుల్లో ఒక ముక్కుపచ్చలారని అబల. బహు చమత్కారంగా చిత్రించాడు డైరెక్టరు. ఒక గులాబి పువ్వుని పది మంది రాక్షసులూ ఒకరి తరువాత ఒకరు వాసన చూశారు. పువ్వు వాడిపోయింది. అలాంటి అఘాయిత్యమేమీ సింహాచలం భార్యకు జరగలేదు గదా ? ఏదైనా జరిగితే ఆ పాపం నాది. వెంటనే పోలీసుస్టేషనుకు ఫోన్‌చేసి కంప్లెయింటుని వుపసంహరించుకుంటున్నానని చెప్పాను.

''అయితే మీ ఇష్టం సార్. నేను కేసు రిజిష్టరు చెయ్యను. రాస్కెల్ని ఒక ఉతుకు ఉతికాను. ఇహ మీకెలాంటి ఇబ్బందీ వుండదు'' హామీ ఇచ్చాడు ఇన్స్పెక్టరు.

ఆ సాయంత్రం సింహాచలం భార్యతో సహా మా ఇంటికొచ్చాడు. మనిషి బాగా నలిగిపోయాడు. శారీరకంగా కన్నా మానసికంగా బాగా కృంగిపోయినట్లు కనిపించాడు. తనకు జరిగిన అన్యాయానికి నిరసన తెలపలేదు సరిగదా తనకు అన్యాయం జరగటం న్యాయం అన్నట్లు కనిపించాడు.





Criterion AMA 3109 TEB

"బాబుగారూ ?"

"ఏమిటోయ్ సింహాచలం ?"

"ఒక్క మనవి బాబూ! తెల్లారగట్ల పాడుకోవచ్చా ?" ప్రాధేయపడుతున్నట్లుగా అడిగాడు.

"పొద్దంటే వినవు. నీ ఎర్రి నీది" అంది సింహాచలం భార్య.

"నువ్వుండేవ్" గసిరికొట్టాడు సింహాచలం.

"తెల్లారగట్లేకాదు, రోజంతా పాడుకో. పొద్దనడానికినేనెవణ్ణి" అని చెప్పాలనిపించింది. నా అహం చెప్పనివ్వకుండా అడ్డుపడింది.

"సరే!" అని మాత్రం అనగలిగాను. సింహాచలం ముఖంలో వెలుగు కనిపించింది. ఆ మాత్రం కన్సెషన్‌కూడా నా వద్ద నుండి వస్తుందని అనుకునివుండడు. నేను సరే ననడం శ్రీమతికి నచ్చలేదు. అసలు నేను హోదాకు తగ్గట్టు కరుగ్గా వ్యవహరించడం లేదనీ, నా అధికార దర్పాన్ని చూపించడం లేదనీ, నాలాంటి ఆఫీసర్లు ఉండబట్టే దేశంలో అరాజకం ఇలా ప్రబలిపోతోందనీ ఆమె నమ్మకం. ఆ నమ్మకాన్ని మరోసారి నాముందు వల్లించింది.

ఆ విషయం అంతటితో ముగిసిపోతుందనుకున్నాను. కాని అలా జరుగలేదు.

పదిరోజుల తరువాత ఒకరోజు వుదయం రోడ్డుమీద బ్రహ్మాండమైన కోలాహలంగా వుంది. జనం చాలామంది గుమిగూడి తమాషా చూస్తున్నారు. ఒక రసికుడైన మంత్రిగారు పట్టణాల్లోని ఆక్రమణలను అందమైన అమ్మాయిల ముఖాలమీద స్ఫోటకం మచ్చలని ఛలోక్తిగా అన్నాడట. ఆ స్ఫోటకం మచ్చల్ని అంటే ఆక్రమణలను ప్లాస్టిక్ సర్జరీద్వారా తొలగించడమే ప్రస్తుత 'తొలగింపు' ఉద్యమానికి అర్థం కావచ్చు.

ముందు జాగ్రత్తగా సింహాచలం షాపులో సామాన్లన్నీ తీసి ఒకపక్కన పదిలంగా పెట్టి భార్యని కాపలా వుంచాడు. ఇంట్లో సామాన్లన్నింటినీ త్వరత్వరగా రోడ్డుమీదకు చేర్చి అందరితోపాటు భార్యాభర్తలిద్దరూ వినోదం చూడ్డానికి నిలబడ్డారు. ఒక ట్రాక్టరొచ్చి సింహాచలం బడ్డీని మోసుకుపోయింది. ఒక డోజరు సింహాచలం పాకని ఒక్క నిముషంలో నేలమట్టంచేసి విజయ గర్వంగా వెళ్లిపోయింది. భంగపడ్డా బ్రతిమాలినా లాభంలేదని వాళ్లకు తెలిసి వుంటుంది. అందుకే ఎవర్నీ ప్రాధేయ పడలేదు. ఆ విధ్వంసకాండ పూర్తయినాక

నువ్వు అబలవా ?

కొంచెం అల్లరి సద్దుమణిగాక మరోసారి ఇద్దరూ కూలిన కొంపదగ్గరకు వెళ్లి పుల్లా పుడకా ఏరుకున్నారు. నాకు ఎప్పుడో చదివిన ఒక సంఘటన మనసులో మెదిలింది. ఒక భూకంపం తరువాత అమెరికాలో ఒక పెద్ద మనిషి చెప్పుకోడాని కెవరూలేక అట్టబోర్డు మీద ఇలా రాసి పెట్టాడుట.

"ఆస్తి పోయింది. భార్యాబిడ్డలు పోయారు. సర్వం పోయింది. కాని నా ఆత్మ విశ్వాసం పోలేదు" అని తన పని తను చేసుకుంటున్నాడు.

సింహాచలం ఆత్మవిశ్వాసం నాకు తెలుసు. ఇలాంటి ఎదురుదెబ్బలు ఎన్నో తినివుంటారు.

బాంబ్

— జి. శ్రీకృష్ణ

ఇండియా శాంతి అంటే
అగ్రరాజ్యాలు భ్రాంతి అన్నాయి
భారతీయులు అహింసంటే
అం?   తెలీదన్నారు.

గాం   రికితే
అతనికి   ఎన్నారు.

భరత దేశం ధర్మం అంటే
చైనావారు తరిమి కొట్టారు.

ఇండియా అణుబాంబ్ ప్రేలిస్తే
'రియల్లీ ఇటీజ్ ఎ గ్రేట్ కంట్రీ!'
అన్నారు.

అయినా వాళ్లకు భవిష్యత్తుమీద నమ్మకం పోలేదు. ఆ రోజంతా చెట్టుక్రిందే గడిపి చీకటి పడగానే క్రొత్త జీవితం ప్రారంభించడానికి ఎక్కడికో వెళ్లిపోయారు. కొన్నాళ్ల తరువాత నేను జీపులో వెడుతూ సింహాచలం ఒక చెట్టునీడన తన వ్యాపారం చేసుకోవడం చూశాను.

దేశంలో మిగతా పథకాలన్నీ కుంటుతూ నడుస్తుండగా ఈ ప్లాస్టిక్ సర్జరీ — అంటే ఆక్రమణల తొలగింపు పథకం అంత స్పీడుగా అమలులోకి రావడానికేదో పెద్ద కారణం వుండితీరాలి. ఏ మంత్రిగారో ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వుండాలనుకున్నాను. కాని అది నిజంకాదు. ఏ మంత్రిగారూ తాఖీదు లివ్వలేదు.

దీనికంతటికీ మా శ్రీమతే కారణం అని తెలిసి నేను నమ్మలేకపోయాను. టౌన్ ప్లానింగ్ ఆఫీసరుగారి భార్యామణి, నా భార్యా రత్నానికి చిన్ననాటి స్నేహితురాలుట. ఇద్దరూ కలిసి చదువుకున్నారుట. స్నేహితులన్న తరువాత ఒకరి కొకరు ఆ మాత్రం సాయం చేసుకోకపోతే ఎలా ? అలా నరుక్కొచ్చింది శ్రీమతి. అసలు శ్రీమతికి సింహాచలం దంపతులమీద ఎందుకంత కక్ష ? అది ఒక మిలియన్ డాలర్ ప్రశ్న. జవాబు శ్రీమతి చెప్పదు.

* * *

నా పొరుగు ఆసామీ శాస్త్రికి ఒక కలొచ్చిందిట. ఆ కలలో సాయిబాబా కనిపించి "ఏమిటోయ్ పంతులూ ? నా సందేశం నీవరకూ రాలేదా ? నీ మంచి కోరి చెబుతున్నాను. నన్ను నమ్ము ..." అన్నాట్ట. శాస్త్రి కనిపించిన వాళ్లందరికీ ఈ సంగతి చెప్పాడు. కొందరు శాస్త్రి అదృష్టాని కసూయపడ్డారు. కొందరు 'దేనికయినా అర్హతుండాలి. దేవుడు కల్లో కనిపించడం మాటలా ?' అన్నారు. కొందరు భజన్లు చెయ్యమని సలహా ఇచ్చారు. శాస్త్రి ఉన్నట్లుండి పరమ భక్తుడయిపోయాడు.

భజన్లు ... అఖండ భజన్లు ... నగర సంకీర్తనలు ... అన్నదానాలు సాగిపోతున్నవి. నేను రెండు మూడుసార్లు భజన్లకు హాజరయ్యాను. బహుశా నాలో తగినంత సంస్కారం లేకనేమో నాకు నచ్చలేదు. భగవంతుణ్ణి గుట్టుచప్పుడు లేకుండా మనసులో ప్రార్థించుకోవడం ఈ భజన్లకన్నా ఏమాత్రం తక్కువనస్థాయి భక్తో నాకర్థం కాలేదు. భజన్లు చేసినంత మాత్రాన దేవుడు దగ్గరై నాలాంటి మూఢుడికి దూరంగా జరిగిపోతున్న దాఖలా ఎక్కడా కనిపించదు.

శాస్త్రి ఇంట్లో ఒకరోజు విభూతి పడిందన్నారు. మరోరోజు కుంకుమ పడిందన్నారు. జనం విపరీతంగా వెళ్లి చూస్తున్నారు. నేనూ వెళ్లి చూసొచ్చాను. క్షమించాలి. నాకు సంస్కారంలేని ఆలోచనే మనసులో మెదిలింది. 'విభూతి, కుంకుమా పడకపోతే, లడ్లూ, మైసూరు పాకులూ, రసగుల్లాలూ పడగూడదూ? అన్నం దొరక్క అలమటించిపోతున్న నిర్భాగ్యుల్ని వాళ్ల ఖర్మకు వదలి వెయ్యక అన్నం వర్షం కురిపించరాదూ? వర్షాలు లేనిచోట వర్షం కురిపించరాదూ?...

వగైరా...వగైరా...''ఆలోచనలు.

మొత్తంమీద శాస్త్రి అదృష్టవంతుడు. దేవుడు పిలిస్తే పలుకుతున్నాడు. ఈ మధ్య శాస్త్రి ముఖంలో ఒక క్రొత్త వెలుగు కనిపిస్తోంది. సాల్వేషన్ పొందిన తృప్తి కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. అంతటితో ఆగిపోలేదు. నన్నొక పామరుడిగా, సంస్కారహీనుడిగా జమకట్టి మాట్లాడుతున్నారు భక్తులు. తామేదో భగవత్సందేశాన్ని పూరంతా వెదజల్లుతున్నట్లు మాట్లాడేస్తున్నారు.

అసలు విషయానికొద్దాం. చల్లకొచ్చి ముంతదాయటమెందుకు ? శాస్త్రి ఇంట్లో భజన్లు నాకు కొంచెం ఇబ్బందిగా వుంది. వారానికి నాలుగురోజులు — పాతిక ముప్ఫై గొంతులొక్కసారిగా రెండు గంటలసేపు ... భక్తిగీతాలే అయినప్పటికీ, ప్రశాంతతని కోరుకునే నాకు సరిపడలేదు. అయినాతప్పదు. పొరుగువాడు. సహించి వూరుకోవలసిందే.

''ఇదే పరిస్థితి అమెరికాలో వుంటే ఏం జరుగుతుంది?'' అని ఒక అమెరికా నుండి తిరిగొచ్చిన స్నేహితుణ్ణడిగాను.

''పొరుగువాడు మర్యాదగా ఒక చీటీ పంపించి వుండేవాడు''

''ఏమని ?''

''మిత్రమా! రాజ్యాంగం నీకు స్వేచ్ఛగా బ్రతికే అవకాశం ఇచ్చింది. అంతేగాని నా స్వేచ్ఛను హరించే హక్కు నివ్వలేదు. సామరస్య పూర్వకంగా ఈ సమస్యను మనలోమనం పరిష్కరించుకోలేకపోతే చట్టం పరిష్కరిస్తుంది''అని అన్నాడు.

''ఆ స్థాయికిమనం ఎప్పుడెదుగుతామో?'' అని గొణుక్కున్నాను.

''ఏమిటోయ్ గొణుక్కుంటున్నావ్''

''ఏమీలేదు'' బొంకేశాను.

శాస్త్రి ఇంట్లో అఖండభజన సప్తాహం జరుగుతోంది. అంటే వారం రోజుల పాటు నిర్విరామంగా రిలే భజనలు చెయ్యడమన్న మాట.

''ఈ వారం రోజులూ హైదరాబాద్ వెళ్దామా?''

''పిల్లల చదువులూ?''అంది శ్రీమతి.

''ఇప్పుడు మాత్రం ఏమంత వంటపడుతుందంటావ్?''

భక్తులు తీసమ్మై లయబద్ధంగా పాడుతున్నారు.

''విఠ్ఠల...విఠ్ఠల...హై...హై...'' జోరుగా సాగుతోంది. మా పిల్లలు తంచనుగా చదువులు మానేసి కూర్చున్నారు. నాకెందుకో సింహాచలం గుర్తొచ్చాడు. బ్రతుకు తెరువు కోసం పాటలు సాధన చేసుకుంటున్న సింహాచలాన్ని కొంపా గోడూ పీకి నిర్దాక్షిణ్యంగా గెంటివేశాము. ఒక కొంటె ఆలోచనొచ్చి శ్రీమతిని పిలిచాను.

''శాస్త్రి మీద పోలీసు కంప్లెయింట్ ఇస్తున్నాను.''అన్నాను. శ్రీమతి నన్నదోరకంగా చూసింది.

''మీకు మతిగాని పోతోందేమిటి ?''అంది పైగా.

''నా ప్రశాంతతని భంగపరచే హక్కు వాళ్లకు లేదు'' అన్నాను కాగితం మీద కలం పెడుతూ.

''ఇరుగూ పొరుగూ... ఆ మాత్రంసర్దుకోవాలి''అంది.

''సింహాచలం ఇరుగూ పొరుగూ కాడా ? వాడికొక న్యాయం, శాస్త్రికొక న్యాయమా?'' అన్నాను. నాపోలిక శ్రీమతికి నచ్చలేదు. కొంటెగా నా వంక ' ంది.

''నిజానికి సింహా నా కేమీ ఇబ్బంది కలిగించలేదు

''అయితే ఎందు- ్యంకట్టుకున్నావ్ ?''

''ఏం ? మీకు బాధగా వున్నట్లుంది పాపం''

''అవును. బాధగానే వుంది''

''అయితే నేను చేసింది తప్పుకాదు''

''సరేలే. కారణంచెప్పు''

శ్రీమతి కొంచెంసేపాగింది.

''తోడేలూ—మేకా కథ మీకు తెలుసుగా ? తోడేలు తిన్నగావెళ్లి మేకను చంపలేకపోయిందా ? తగూ పెట్టుకుంది ?''

తోడేలేమిటి ? మేకేమిటి ? నా కంతా తికమకగా వుంది.


''అయితే ఇంతకూ నువ్వు తోడేలువెందుకయినట్టు ?''

''మీ కోసం''

''అంటే ?''

''మీరు రోజూ సాయంత్రాలు లాన్‌లో కూర్చుంటారు. సింహాచలం భార్య మీ ముందు పిట పిట లాడుతూ తిరగడం నాకు నచ్చలేదు. పైగా మీరు వాళ్లమీద ప్రత్యేకంగా చూపిస్తున్న కుతూహలం మరీ ప్రమాదకరంగా కనిపించింది. నా జాగ్రత్త నేను పడ్డాను...''

నా మెదడు కొంచెంసేపు మొద్దుబారిపోయింది. భూమి తల క్రిందులుగా కనిపించింది. ఆ యవస్థలో ఏదో వాగేశాను ''రాక్షసీ! నువ్వు? అబలవా?...'' అని.



డాక్టర్ సలహాలు

—డా. కె. వెంకటేశ్వరరావు

ఎస్. బి. ఆర్. కటక్.

స్త్రీలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ ఫెయిల్ అవటానికి ఛాన్సుందా? భార్యా భర్తలు ఎన్నాళ్ళు జాగ్రత్తగా వుండాలి.

ఏ ఆపరేషన్ అయినా— విజయవంతం— అవుతుందని అనుకొనే— శస్త్ర వైద్యులు మొదలు పెడతారు. (కొన్ని సందర్భాలలో మినహా)

కొన్ని ఆపరేషన్‌ల వల్ల ఆశించిన ఫలితం లభించటం కొన్నిటిలో ఈ ఫలితం ఆశించినంత ఏర్పడక పోవటం సహజం.

మీ సమస్య కూడా ఈ దృక్పథంతో చూసి— తగిన సహాయం పొందండి. కుటుంబ నియంత్రణకు 'ట్యూబెక్టమీ' చేయించుకొంటే 'ఫెయిల్' అవటం చాలా అరుదు. ఆపరేషన్ చేసిన ప్రదేశంలోని పుండు బాగా మానే వరకు— (దాదాపు 2 నెలలు) జాగ్రత్తగా ఉండాలి.

ఎస్. కె. బి. తిరుపతి.

మా బాబుకు ఒకటిన్నర సం. లు తరచూ ఒకేత్తిగా విరోచనాలు అవుతున్నాయి.

పిల్లలకు విరేచనాలు— ఆహారం పిల్లల అలవాట్లు, మట్టి మొదలగునవి తినటం, శరీరంలో ఇతర భాగాలలో సూక్ష్మ క్రిములు చేరటం, మొదలయిన కొన్ని కారణాల వల్ల ఏర్పడవచ్చును.

పాలు— నీరు కలిపే విధానంలో వీటి నిష్పత్తి ఎక్కువ తక్కువలు అవటం వలననే ఎక్కువగా విరేచనాలు అవుతాయి. కడుపులో పురుగులు (ఏలిక పాములు, నులి పురుగులు, గియార్డియాసిస్, అమీబియాసిస్) ఉంటే కూడా తరచూ విరేచనాలవుతాయి.

మలపరీక్ష చేయించటం, ఆహార విధానాలలో తగిన శ్రద్ధ వహించటం తీసుకోవలసిన కొన్ని జాగ్రత్తలు.

పి. ఆర్. బి. గుడివాడ.

నా వయస్సు 22 సం. లు నాకు సంవత్సరము నుండి కాలి వేళ్ళు, చేతి వేళ్ల వాపులు, మోచేయి నొప్పులుగా వుంటున్నాయి. ముఖ్యముగా నిద్ర లేచినప్పుడు ఎక్కువగా వుంటోంది.

ఈ లక్షణాలు 'రుమటాయిడ్ ఆర్థ్రైటిస్'ను తెలియ చేస్తాయి. వీటికి తగిన శ్రద్ధలో మందులు 'ట్రయాక్టిన్' మొదలయినవి, ఫినైల్ బ్యుటాజోన్ మాత్రలు వైద్యుల సూచన ప్రకారం వాడాలి.

చేతులను, కాళ్ళను వేడినీళ్లలో ఉదయాన్నే కొద్ది సేపు ముంచితే, నెప్పులు చాలా మటుకు తగ్గుతాయి.

ఎ. ఆర్. ఇ

నేను అతి ... బాధ పడుచున్నాను. దీనికి ఆహారములో తీసుకొన వలసిన మార్పులు వాడవలసిన మందులు తెలియచేయండి.

—డయాబెటిస్ గురించి— వివరంగా— దినపత్రిక సోమవారం సంచికలో— డాక్టరు కబుర్లు శీర్షికలో తెలియజేశాను. — తేదీల వివరాలు కావాలంటే 6—5—74, 13—5—74, 20—5—74.

వ్రాసినవే తిరిగి రాయటం రాను రాను విసుగనిపిస్తున్నది. ఒక నెలకి దాదాపు 1500 ఉత్తరాలు వస్తున్నాయి. వీటిలో — అడిగిన ప్రశ్నలే అడగటం సహజమై పోయింది.

ఎమ్. ఎ. కోడూరు

నాకు మూడు నెలల నుండి చెవి నెప్పిగా ఉన్నది. డాక్టరు క్లీను చేసి మందులు వాడారు. నొప్పి తగ్గినది. మరల 1 నెలగా చెవిలో దురదగా ఉన్నది. డ్రాప్సు వాడాము. కాని తగ్గలేదు.

చెవులలో తరచూ నెప్పి, దురద— ఫంగస్ వలన ఏర్పడుతుంది. చెవులలో నూనె—(ఏదో యంత్రానికి వేసినట్టు) వేయటం, గువిలి ఉన్నదనుకొని—పుల్లలతో కెలకటం వల్ల, పరిశుభ్రమైన నీరు— స్నానం మొదలయినవాటికి వాడకపోవటం వల్ల ఇలా తరచూ వస్తుంది.

'ఫంగస్' అని తేలితే— హైడ్రోజెన్ పెరాక్సైడ్, క్లోరోమైసిటిన్ డ్రాప్స్— చెవులలో వేస్తూ, లోనికి గ్రైసోవిన్ మాత్రలు రోజుకి 6 వంతున 10 రోజులు వాడాలి. ●

భవబంధాలు

చెళ్లూరి సీతారాజేశ్వర్రావు

జరిగినకథ 3: మంగళ పెళ్లికి హైదరాబాద్ వెళ్లి తిరిగి వస్తున్న డాక్టర్ మనోరమను రైల్లో కలిసిన చక్రవర్తి తాను దొంగగా మారడానికి ఆమెయే కారణమని నిందిస్తాడు. అదియదార్థమేనేమోనని బాధపడుతుంది మనోరమ. తనమూలాన పాడైపోయిన చక్రవర్తిని వివాహం చేసుకుని బాగుచేయాలని నిశ్చయించుకుని తాత కేశవయ్యతో చెబుతుంది మనోరమ

(గత సంచిక తరువాయి)

"చక్రవర్తి నావల్లే చెడిపోయాడు తాతయ్యా. అన్నివిధాల పతనమయ్యాడు. అతడ్నిదారిలో పెట్టడం కనీస ధర్మం. అందుకే నేనుఅతడికి చోటిచ్చాను."

"నోర్మూయ్...చోటుయిచ్చావ్. మంచి పనిచేశావ్ అప్పుడే పెద్దదానివయిపోయావు. అన్నీ నువ్వే అనుకుంటున్నావ్... ఆ పోకిరీ వెధవని బాగుచెయ్యడానికి నీకేం అవసరం ? అంతగా అయితే అయిదారు వేలు పడెయ్య లేకపోయావా ?"

మనోరమ బిక్కముఖం వేసింది.

కేశవయ్య ఆవేశాన్ని అణచుకుంటూ :"వాడెవడో నీకు బాగా టోపీ వేశాడమ్మాయ్. ఆ మాయలో నువ్వు పడిపోయావ్. నీ కిన్నేళ్లువచ్చినా, ఇంత చదివినా లోకం పోకడ తెలియదు. ఈ పెళ్లికి నేనేకాదు. ఎవరూ ఇష్టపడరు. వృధాగాచేతులు కాల్చుకోకు. తల్లీతండ్రీ లేని నిన్ను పెంచి పెద్దచేశాను. ఆమూడు ముళ్ళూ కూడ సవ్యంగా పడితే నాబాధ్యత తీరుతుంది. పూర్వంలాగే నీకు వంతపాడితే ప్రపంచం వూర్కోదు. నీ పెద్దరిక మేమయిందని నిలేసి అడుగుతుంది. తప్పు నువ్వు చేస్తున్నా మేంకూడా భాగస్థులమవుతాం. ఈ పొరపాటువల్ల అనేక చిల్లర సమస్యలు పుడతాయి" నచ్చచెప్పాడు.

అరగంట పాకింది ప్రొద్దు.

సారాంశం—కేశవయ్య ఒప్పుకోలేదు.

మనోరమ తనపంతం విడిచిపెట్టలేదు.

"నువ్వెంత ఏడ్చినా ఫలితం వుండదు. ఇది పరువుప్రతిష్ఠకి సంబంధించిన వ్యవహారమని మరచిపోకు" హెచ్చరించాడు.

కేశవయ్య బట్టల కొట్టుకి పోయాడు.

కాని ఆవేశం తాలూకూ నీడలు కేశవయ్యని వదిలిపోలేదు· మనోరమకి ఒక రాజకుమారుడ్ని తేవాలని ఆయన బంగారు కోరిక. అందుకే ఎన్నో సంబంధాలు వెతికాడు. తృప్తి కలుగలేదు. అయినా ఆయన నిరుత్సాహపడలేదు. ప్రయత్నించి ఆశగా వెతుకుతూనే వున్నాడు. కాని అవాంతరం ఈ రూపంగా వచ్చి దెబ్బకొట్టింది. హృదయానికి హత్తుకుపోయే నిరాశ మనిషిని కుదిపేస్తుంది. సంచలనం కల్గిస్తుంది. ఆవిషాదం యొక్క వత్తిడిని తట్టుకోవడంకష్టమవుతుంది. నీటినుంచి వచ్చిన చేపలా గిలగిలలాడాడు ఆయన. తన పెద్దరికం, మంచితనం అన్నీ నాశనమయ్యాయి. ఈ తప్పుకి అనేక కారణాలు కనిపించాయి. ముద్దు చెయ్యడమే పొరపాటయింది. చదువు చెప్పించకుండా వెంటనే పెళ్లిచెయ్యవల్సింది. ఏసమస్య వుండకపోను. అంతలోనే కేశవయ్య తెప్పరిల్లాడు. ఈ చెడువస్తుందని తను కలగన్నాడా? అయినా మనోరమలో ఈ తెలివితేటలు, తెలివితక్కువతనం ఎక్కడనుంచివచ్చాయి. ఏ ఆడపిల్లయినా ఇటువంటి సాహసం చేస్తుందా ? పెళ్లన్నది జీవితాంతం వుండే పంట. అందుకోసం బలమైన విత్తనాలు నాటుకోవాలి. ఏరకం విత్తనంవేస్తే ఆరకం పంటే వస్తుంది.

పదయ్యేదాకా అలాగే ఆలోచిస్తూ, యాంత్రికంగా కవుంటర్‌లో కూర్చున్నాడు. గుమస్తా యిచ్చే డబ్బుని నిర్లక్ష్యంగా లోపల పడ వెయ్యడంతప్ప ఎవరితోనూ ఏం మాట్లాడలేదు. ఆలోచనల్నేమేశాడు.

కుర్రాడ్ని కాఫీకి పంపాడు తలభారం ఎక్కువై. వెంటనే కృష్ణమూర్తికి ఉత్తరం రాసి పడేశాడు.

"...... నువ్వు వెంటనే బయలుదేరవల్సింది. నీ చెల్లెలు ఇక్కడ ఘనకార్యంచేసి కూర్చుంది. పోకిరి వెధవ ఏం చెప్పి పెట్టాడో, వాడ్నే పెళ్లిచేసుకుంటానని కూర్చుంది. వాడు జేబులు కత్తిరిస్తాడు. జైలుకిపోతాడు. ఇదీ ఉద్యోగం. మనపిల్లకి ఎంతమాత్రం తగిన సంబంధంకాదు. కనుక నువ్వు మాధవి వెంటనేబయలుదేరి రావలయును. సాధ్యమైనంత తొందరలో ఏదో సంబంధం మనం చెయ్యకపోతే మన గౌరవం మిగలదు."

కాఫీ త్రాగుతూ "క్రెపెన్ బిళ్లఅంటించు" అంటూ కవరు క

ఇంతలో లత ల

ఆమెని చూడగ ...త్తె తెప్పరిల్లాడు. మనోరమ ఉద్దేశ్యం ...ఆమెకి తెలుస్తుంది. పైగా లత నచ్చచెబితే వినకపోదు·

"రావమ్మా" సాదరంగా ఆహ్వానించాడు.

'లత పరువుమీదకూర్చుని, "ఏమిటి తాతయ్యా అలా వున్నావ్? " ప్రశ్నించింది. మనోరమ లాగానే, ఆమెకూడ' తాతయ్యా' అంటుంది.

"మనవరాళ్ళు ఘనకార్యాలు చేస్తున్నారు మరి" గుబురు మీసాల్లోనుంచి,వక్రహాస్యం తొంగిచూసింది

"అంటే·....."

"నీకేం తెలియదా ఏమిటి"

లత తల ఆడిస్తూ "నువ్వు చెప్పనిదే" అంది.

కష్టమర్సులోపలికి వస్తున్నారు. గుమస్తా, పని కుర్రాళ్ళు హడావిడిగా కనపడుతున్నారు. కేశవయ్య ఆ విషయం ఇంతమందిలో చర్చించడానికి యిష్టపడలేదు.

"లోపలకిరా...·." ప్రక్కగదిలోకి దారితీశాడు.

ఏదో సీరియస్ వ్యవహారమని తోచింది. లత సర్దుకుని స్టూలుమీద కూర్చుంది. కేశవయ్య తలుపు దగ్గరగావేసి, "నీకు తెలియదే అంటావా" సాభిప్రాయంగా లత ముఖంలోకి చూశాడు·

అయోమయంగా అన్నది లత "నాకేం తెలియదు.

"మరి చక్రవర్తి ఎవరు ?"

చెప్పింది.

"ఆ లుచ్ఛా వెధవని మనోరమ పెళ్లిచేసుకుంటుందట, ఆశీర్వదించమని నన్ను అడిగింది. "ఆవేశం పెల్లుబికింది ఆయనలో.

ఈ వార్త మొదటిసారి విన్నా లతలో అంతగా ఆశ్చర్యం కలుగలేదు. చక్రవర్తి మీద మనోరమ చూపుతున్న అభిమానం ఈ విధంగా దారితియ్యవచ్చునని లీలగా ఆమెకి తట్టింది. ఇప్పుడు కేశవయ్య చెప్పగానే ఒక నిట్టూర్పు విడచింది.

"ఇది నీకు ముందే తెల్సా ?"

"అనుమానం మాత్రంవుంది."

కేశవయ్య ముందుకువంగి : "మరి నాకు చెప్పలేకపోయావా ?" ప్రశ్నించాడు.

లత కూడ తీవ్రంగా ఆలోచిస్తున్నది. మనోరమ, చక్రవర్తి అంతరంగంలో మెదిలారు. మనోరమ తొందరపడింది. హీనుడికి ఉన్నత స్థానం యిచ్చింది. ఇది తగదు. ఏ విధంగానూ చక్రవర్తి దీన్ని ఉపయోగించుకోలేదు.ఒకసారి పతనమయ్యాక, ఆపాకుడు రాళ్లమీదనుంచి పైకి ఎక్కడం అంత సులభంకాదు.

కేశవయ్యని , వోదారుస్తున్నట్లు చెప్పింది. "నువ్వు ఆవేశపడకు తాతయ్యా. ఇది చాల డెలికేట్ వ్యవహారం. మనోరమ వ్యక్తిగా నిర్ణయం తీసుకుంది. కాదనడానికి మనం ఎవరం ? దాని మొండితనం నీకు తెల్సుకదా ? ఇన్నాళ్ళు నాతో ఇంత స్నేహమున్న చూచాయగానయినా చెప్పలేదు· నువ్వు చెప్పేదాకా నాకు అనుమానం వున్నది ?"

"అసలీ ముళ్లకంపలో ఎలాపడింది ?" నిరుత్సాహంగా అడిగాడు.

లత యావత్తు విశదీకరించింది. కాలేజీలో పరిచయం, ప్రేమ లేఖ వ్యవహారం, రైల్లో పరిచయం, యాక్సిడెంటు, స్వయంగా వానలో వెళ్లడం అన్నీ చెప్పింది.

"దీనికేదో పిచ్చి ఎక్కింది."

భవబంధాలు

"సువ్వేంకంగారుపడకు తాతయ్యా. నేను కనుక్కుంటాను."

కేశవయ్య తలుపు తీసి బయటికి దారితీస్తూ "ఏదోలా దానికి నచ్చచెప్పు నలుగురికి తెలిస్తే ఎంత అవమానం ?" అన్నాడు.

లత హాస్పిటల్ కి ఫోన్ చేసింది.

"ఏమిటి విశేషం ?" మనోరమ పలికింది.

"నువ్వేచెప్పాలి మరి. హీరోయిన్ వయ్యావుకదా!"

"..........."

"బయలుదేరి వస్తున్నాను."

"సారీ సాయంత్రం దాకా ఖాళీలేదు. పనిరద్దీగా వుంది."

లత పీన్‌మీద చెయ్యి అడ్డంపెట్టి "నేను ఫోన్ చెయ్యడం దానికి అనుమాన మొచ్చింది. ఖాళీ లేదంటోంది." చెప్పింది కేశవయ్యతో.

"చేసిన పని ఎలాంటిది ?"

"సాయంత్రం ఆరింటికి వస్తాను."

లత ఫోన్‌వుంచేసి ప్యాకెట్లు చేతిలో పట్టుకుని వెళ్ళడానికి ఉద్యుక్తురాలై "ఆ విషయం నాకు వదిలెయ్యి తాతయ్యా సాయంత్రం నేను కనుక్కుంటాను." అన్నది.

"నీదేభారం తల్లీ."

లత సాయంత్రందాకా యాంత్రికంగాగడిపింది. కేశవయ్య చెప్పినప్పట్నుంచి ...ప్పుడు మనోరమని చూద్దామా అన్న ...లుదేరింది. ఆమె కంగారుకి తగ్గట ...ఎక్కువగా వుంది. పర్మిషన్ అడగడ ...రాలేదు. ఏడున్నర ప్రాంతంలో తెరిపి చేసు... ...దేరింది.

చక్రవర్తి గేటుదగ్గరవున్నాడు. రిక్షాలో ఎక్కడికో పోతున్నాడు. వరండాలో నిలబడి మనోరమ టా...టా చెబుతోంది. లతని చూసి రిక్షా బయలుదేరింది.

"బాగ్దాద్ ఎక్కడికో బయలుదేరాడే !"వ్యంగ్యం విసిరింది లత.

మనోరమ ముఖం ఎర్రగా చేసుకుని తనగదిలోకి పోయి కూర్చుంది. లతకూడ వెంటవచ్చింది. "ప్రేమికులు జంటగా వెళితేనే అందం ? ఏమంటావ్ ?"

"హో ... విషయం తెల్సిందన్నమాట" అన్నది మాత్రం మనోరమ బరువుగా నిట్టూరుస్తూ.

"ఘనకార్యాలు యిట్టే పాకుతాయి."

మెడికల్ జర్నల్ తిరగవేస్తోంది యాంత్రికంగా మనోరమ. లత ధోరణికి అదే జవాబుగా తోచింది. తాతయ్య అంతా లతతో చెప్పేవుంటాడు. తనని క్రాస్ చెయ్యడానికి బయలుదేరింది...ఛీ... ప్రతీవాళ్ళు తనని నిలదీసేవాళ్లే. సానుభూతిగా అర్థంచేసుకునేవాళ్లేవరూలేరు.

'పెళ్లి ఎప్పుడు ?' లత మరోసారి ప్రశ్నించింది.

"త్వరలోనే" సమాధానం ముభావంగా వచ్చింది.

"జేబులు కత్తిరించే వెధవకోసం యిన్నాళ్ళు నిరీక్షించావన్నమాట."

కోపంగా అంది "చక్రవర్తిని అవమానించక."

"చక్రవర్తిని అనడం అనవసరం. దీనికి కేంద్రం నువ్వు. నిన్నే అనాలి. నీ తెలివితేటలకి సంతోషించాలో ఏడవాలో తెలియడం లేదు."

"ఆవేశపడకుండా నన్నర్థం చేసుకో లతా? చక్రవర్తిని నైతికంగా బాగు చెయ్యడం నా ధర్మం. అందుకే ఈ బాధ్యతను పటిష్టం చెయ్యదల్చుకున్నాను పెళ్ళితో."

"ఈ సంస్కారం నీకెలా అబ్బింది?"

"మీరంతా నన్ను పొడుచుకు తింటున్నారు."

లత లేచి ఆమె దగ్గరగా వెళ్లింది. మనోరమని తన చేత్తో బుజ్జగిస్తూ "తాతయ్యఎంత క్షోభపడుతున్నాడో నీకు తెల్సా? ఈ పెళ్ళన్నది నీకు ఒక్క దానికే సంబంధించినది కాదు. నీ చుట్టూ నీ వంశం, నీ పెద్దలు వున్నారు. వాళ్లకిదెంత ఆఘాతమో నీకు తెల్సా? అయినా చక్రవర్తిని సానుభూతితో పెళ్లి చేసికుంటున్నందుకు, రేపు సరయిన ప్రతిఫలం రాకపోతే చింతించవలసి వస్తుంది ఇవన్నీ నువ్వు బాగా ఆలోచించావా? " నచ్చచెప్పింది.

ఇన్నాళ్ల స్నేహంలోనూ మనోరమ సమస్యలన్నీ లతే పరిష్కరించింది. ఏ చిన్న విషయమొచ్చినా లతనే ఆశ్రయించేది. కాని నేడు యిద్దరూ చెరో వైపు వున్నారు. సంఘటన తెచ్చిన 'యిరుకు' యిద్దరి మధ్య వున్నది. దానివల్ల బుసలు కొడుతున్నారు.

"ఎడ్వాంచర్ నాకిష్టం లతా. అందుకే చేస్తున్నాను. ఫోర్‌కాస్ట్ చెయ్యడం మంచి పని కాదు. మానవుడు భవితవ్యాన్ని ఆశాజనకంగానే ఆశిస్తాడు. చక్రవర్తిలో తప్పక మార్పు వస్తుంది. అతడూ మనిషిగా సంఘంలో నిలబడతాడు"

లతకి కోపం ముంచుకు వచ్చింది. "చక్రవర్తిని ప్రేమించావా?"

"ఆ. . . పర్వనాలిటీ వుంది. మగాడు. ఎన్ని తప్పులు చేసినా మారాలి. ఇవాళో, రేపో ఏదో బిజినెస్‌లో చెయ్యి పెడతాడు. పాత తప్పులు అన్నీ సమసిపోతాయి."

"అని నువ్వు అనుకుంటున్నావ్. కాని సంఘం నిమ్మళ్ళి సాఫీగా వదలదు. ఎన్నో చిక్కులు తెచ్చి పెడుతుంది. సినిమాల్లోలాగా వెన్నెల త్రాగేస్తూ ప్రేమని తింటూ కాలం గడపడం దుర్లభం. వాస్తవానికి దూరంగా ఆలోచించుకోవడం దురాశే అవుతుంది. చక్రవర్తి మీద సానుభూతి వుంటే మరోలా పరిష్కరించుకో. కాని దారి యిదిమాత్రం కాదు." లత తన భావాన్ని పునరుద్ఘాటించింది.

మనోరమలో పట్టుదల బీజం పెరిగి మొలక ఎత్తింది. లేతదనం పోయి గట్టిపడింది. ఈ దశలో వంచడం కష్టమే మరి. ఎవరెన్ని చెప్పినా ఆమెలో ఏర్పడిన భావం జంకడం జరగదు. అందుకే లత ఎంత ఆవేశపడినా ప్రయోజనం లేక పోయింది.

"నువ్వు లక్ష చెప్పు. వింటాను. కాని నా నిర్ణయం మాత్రం మారదు. ఎన్ని ఆటంకాలు వచ్చినా చక్రవర్తిని పెళ్లి చేసుకుంటాను."

"ఛాలెంజీయా!"

"అనుకో."

లత అసహనంగా లేచి నిలబడింది. తనని బొత్తిగా నిర్లక్ష్యం చెయ్యడం ఆమెకి బాధ వేసింది.

తన రాకవల్ల ఏదైన మార్పు వస్తుందని చాల సేపు వాదించి, విఫలురాలయింది. మనోరమని మళ్ళించడం అసాధ్యంగా తోచింది.

"తెల్సి నిప్పులో చెయ్యి పెడితే ఎవరూ ఏం చెయ్యలేరు. దట్స్ యువర్ ఫేట్. ఇంత మందిని కాదని నువ్వు చేసిన సాహసం ఫెయిల్ అయితే జీవితం ఎంత దుర్భరమో అప్పుడు తెలుస్తుంది. ఆ రోజున నీకు సలహా చెప్పే వాళ్ళు కాని, సాయం చేసే వాళ్ళు కాని దొరకరు. వయస్సు, డబ్బు, చదువు అన్నీ వున్నాయని నువ్వు విర్రవీగచ్చు. ఇవేమీ కూడ నీకు ఆ రోజున సాయం చెయ్యవు."

లత వెళ్ళబోయి మనోరమ కంఠం విని గుమ్మం దగ్గర ఆగింది.

"బెదిరిస్తున్నావా?" అంటూ కుర్చీలోనుంచి లేచి గుమ్మంలోకి వచ్చి, "ఒడ్డున వుంటే అంతా లోతుగానే కనబడుతుంది. లైఫ్‌లో ఏ ప్రాబ్లం అయినా సాల్వుచేసే కెపాసిటీవుందని భావిస్తున్నాను" ఘాటుగా చెప్పింది.

"సీ ఎ హెల్" లత విసవిసా నడిచి పోయింది.

"లతా" వరండాలోకి వచ్చి పిల్చినా, ఆగలేదు.

వచ్చినది మాత్రం చక్రవర్తి. "ఏమంటోంది స్నేహితురాలు. చాల కోపంగా వెళ్ళి పోతోంది."

"నన్ను ఎవరూ అర్థం చేసుకోవడం లేదు" గొణుక్కుంది.

చక్రవర్తి ఆమె భుజాలతో తన దగ్గరకి తీసు కుంటూ "నేను అర్థం చేసుకుంటాను మనో" అన్నాడు నెమ్మదిగా.

మెరిసే కళ్ళతో చూసింది. "నిజంగానా"

"నిజం."

చీకటి వస్తూగా పడింది. ఆకాశంలో నక్షత్రాలు మెరుస్తున్నాయి. హాస్పిటల్ గేటు దగ్గర దీపం వెల్గుతున్నది. హాస్పిటల్ వాతావరణం సద్దుమణి గింది. డ్యూటీ నర్సులు పైకి కిందికి తిరుగుతున్నారు. మనోరమని చూసి లోపలికి వస్తున్న నర్సు తప్పుకుంది.

మనోరమ వాచీ చూసుకుని, డ్యూటీ నర్సుకు అప్పగించి బయలుదేరింది.



"పిక్చర్ కి పోదాం మనో" చక్రవర్తి సూచించాడు.

మనోరమ వెంటనే ఒప్పుకుంది. ఆమెకీ రిక్రియేషన్ కావాలి. మన స్సంతా గందరగోళంగా ఉంది. టాక్సీ స్టార్టు చేసింది. చక్రవర్తి ప్రక్కన కూర్చున్నాడు.

" ...కి వెళ్లి పో" డ్రయివర్ కి చెప్పి ...ింది. ...కీలో పరుగులు తీస్తో... ...మ సీరియస్‌గా డ్రయివ్ ...ంది. చక్రవర్తి ఏదో మాట్లాడబోయి వూరుకున్నాడు.

భోజన హోటల్ ముందు కారాగింది.

"మీాల్సు చేద్దాం. నాకు ఆకలి వేస్తోంది".

ఇద్దరూ ఏ.సి.లో కూర్చున్నారు, ఫ్యామిలీలో.

"మీా వాళ్ళు ఏమన్నారు ?" చక్రవర్తి ప్రశ్నించాడు.

సాభిప్రాయంగా చూసి: "వాళ్ళు ఏమన్నా అనవసరం. రెండవ తారీఖున మన రిజిస్టరు మ్యారేజి జరుగు తుంది." అంది.

చక్రవర్తి కళ్ళు వెలిగాయి. ఆమె చెయ్యి తీసి ముద్దు పెట్టు కున్నాడు. "ఇది నా అదృష్టం"

సర్వర్ భోజనం తెచ్చాడు.

"ప్రతిసారీఅలా ఫీలవక. ఇలా గయితే నీలోనుగతనం చచ్చిపోతుంది. నిన్ను నీవు ఉన్నతం చేసుకుంటూ ముందుకుపోవాలి".

వీళ్ళు వెళ్ళేసరికి ...నిమా మొదలుపెట్టా...

ప్రక్కనున్న మనుష్యుల్ని మరచి పోతూ మనోరమ సినిమాలో లీనమయి పోయింది. కాని చక్రవర్తి ఆమెని మాత్రం చూస్తున్నాడు. మనోరమ తనది అన్న భావం అతడికి ఎనలేని తృప్తి యిస్తోంది. ఒకనాడు ఆమె అందరాని వస్తువు. నేడు తన పాదాల ముందు ఉన్నది. ఆమెని పొందడం నిజంగా తన అదృష్టం. ఇన్నివిధాలుగా పతనమయిన తనకి ఆమె దొరకడం వరమే మరి. ఇది తను మాత్రం అనుకున్నాడా?

అన్ని సంపదలు ఉన్న మనోరమ తన భార్య.

చక్రవర్తి కుడి చేత్తో ఆమెని పొడిచాడు కేవలం తన హక్కుని రుజువు చేసుకోడానికి.మనో రమ వంగి 'ఏమిటి సినిమా చూడటం లేదా ?" అనడిగింది.

"నిన్ను చూస్తున్నాను".

"నన్ను టికెట్ యిచ్చి చూడక్కర్లేదు. ఫ్రీ ప్యాసు" చిన్నగా నవ్వింది.

చక్రవర్తి సాధికారంగా నవ్వేడు.

ఓడిపోయే పరిస్థితిలో ఉన్న రాజకీయ నాయ కుడు హఠాత్తుగా ఘనవిజయం సాధించినా అంత సంతోషించి ఉండడు. మానవకల్యాణం నిమిత్తం మరో కొత్త ఫార్ములా కనిపెట్టిన సైంటిస్టు కూడా అంత ఆనందించి ఉండడు. ఎక్స్ట్రాగా ఉన్న తార బాక్సాఫీసు హిరోయిన్‌గా చలామణీ అయినా అంత సంతోషం పొంది ఉండదు.

చక్రవర్తి వెన్నెలలో విహరిస్తున్నాడు. కలల్లో తేలిపోతున్నాడు.

ఇంతలో చిన్న పరీక్ష ఎదురయింది. ఓ సాయం త్రం తను ఉంటున్న లాడ్జికి ఒక యువకుడు వచ్చాడు. మనోరమ కోరిక మీాద పది రోజుల నుంచి లాడ్జిలోనే ఉంటున్నాడు.

"నా పేరు కృష్ణమూర్తి"

"హా. వెరీ గ్లాడ్. మనో బ్రదర్" కరచాలనం చేశాడు.

కృష్ణమూర్తి ఎట్టి ప్రసంగాలు చెయ్యకుండా జీబులో తీసి "ఇదిగో పాతిక వేలు. మనోరమని మరచి పోయేందుకు మా కానుక. వెంటనే దూరం పో..." హెచ్చరించాడు.

చక్రవర్తికి డబ్బు చూడగానే మతి పోయింది. తులాదండం వంగింది. కాని అంతలోనే యధా స్థితికి వచ్చింది. "నేను డబ్బు కోసం గడ్డి తినే వెధవనే. కాదనను. కాని ఈనాడు ఆ వెధవ పని చెయ్యను. ఈ డబ్బుతో మనోరమని కొలవలేరు".

"మరో పాతిక వేలు" బేరం హెచ్చింది. రూపాయలు టేబిల్ మీాదకి వచ్చాయి.

చక్రవర్తి విచిత్రంగా నవ్వాడు. "రూపాయలు అన్నివేళలా పనిచెయ్యవు మిస్టర్. మీాకు డబ్బు ఉందని మనుష్యుల్ని కొనడానికి ప్రయత్నించకండి"

కృష్ణమూర్తి హతాశుడయ్యాడు.

విషయం విని, మనోరమ నిర్ఘాంతపోయింది.

* * *

రెండవ తారీఖున రిజిస్టర్డ్ మ్యారేజి జరిగి పోయింది.

ఎవరెన్ని చెప్పినా, బెదరించినా మనోరమ చలించ

(36 వ పేజీ చూడండి)

సీరియల్ నాటకం

డైవోర్స్-'70

సూరత్తు వేణుగోపాలరావు



(గత సంచిక తరువాయి)

మాలతి : క్షమించండి. మీ యింట్లో అమ్మాయి –

పురుషోత్తం : అమ్మాయి నా దగ్గరే వుండాలని కోర్టువారు తీర్పు చెప్పారు. ఈ సంగతులు మీ కనవసరం –

మాలతి : అదికాదండీ... మీరు నన్ను అన్యథా శంకిస్తున్నారు. మీ అమ్మాయికి ఒక గవర్నస్ కావాలటగా! ఆ వుద్యోగం నాకిప్పిస్తారేమో [illegible]

పురుషోత్తం : [illegible]! మరి ముందే చెప్పేస్తే [illegible] కొంచెం అనుమానం స్ఫురించగా) మాకు టీచరు చాలా అవసరమని మీకెలా తెలిసింది? నేనే పేపరు లోనూ వేయించలేదే?

మాలతి : (నసుగుతూ) నిరుద్యోగంతో బాధపడే నాలాంటి దురదృష్టవంతులు పేపర్లు ఉన్నారంగా చదవటమేకాకుండా, ఎక్కడ నౌకరీ దొరుకుతుందోనని అహర్నిశలూ వాకబు చేసుకుంటూ వుండాలి. ఒక స్నేహితుడు చెబితే, గంపెడాశతో వచ్చాను. తీరా వచ్చాక, ఖాళీకాస్తా రెండు నిమిషాల క్రిందటే భర్తీ అయిపోయిందని తమరు సెలవివ్వలేదు. అదే పదివేలు.

పురుషోత్తం : (తీక్షణంగా) ఎవరా స్నేహితుడు? మిమ్మల్నెవరైనా పంపించారా? మీరు నిజంగా దేనికొచ్చారు?

మాలతి : (చిరుకోపంతో) ఏమిటేమిటో



ప్రశ్నలు వేస్తున్నారు. పోలీసులుకూడా నేరస్తుల్ని ఇంత తికమక పెట్టరు ... మీకంత అనుమానంగా వుంటే ఎందుకులెండి. (లేవబోతుంది.)

పురుషోత్తం : ఉండండి...ఈమధ్య సి.ఐ.డి.లిలాగే అడ్డమైనవాళ్లనీ గూఢచారులుగా పంపిస్తున్నారట!

మాలతి : (ఆశ్చర్యంగా) సి.ఐ.డిలా ?

పురుషోత్తం : వాళ్ళే .. ఇక వేరే పనిపాటలు లేనట్లు మనలాంటివాళ్ళ మీదకు వస్తున్నారు. దేశంలో ఎన్నెన్ని ఘాతుకాలు జరిగిపోతున్నా పట్టించుకోరు... ఇంతకీ మీ క్వాలిఫికేషన్సు చెప్పారుకాదు.

మాలతి : బి. ఎ. పాసయ్యాను. టీచింగులో కొంత అనుభవం కూడా వుంది. రెండు నెలలు క్రితందాకా కస్తూరిబాయి విద్యాలయంలో పని చేశాను. ఖాళీలు లేకపోవడంవల్ల తీసేశారు. (దీనంగా) మీరు ఉద్యోగం ఇప్పిస్తే నాకు చాలా సహాయం చేసినవారవుతారు.

పురుషోత్తం : మీకు పెళ్లి అయిందా ?

మాలతి : లేదం... నాన్న అకస్మాత్తుగా పోయింతర్వాత దిక్కులేని పక్షుల మయిపోయాం. ఇద్దరు తమ్ముళ్ళూ ఒక చెల్లెలూ స్కూల్లో చదువుకుంటున్నారు. సంసార బాధ్యతంతా నామీదే పడింది. ఇదిగో నా సర్టిఫికెట్లు చూస్తారా ? (అందిస్తుంది).

పురుషోత్తం : (ఒక నిమిషం చూసి) చాలా బాగున్నాయి. ఒక్క మాట. మా అరుణ అప్పుడప్పుడూ కొంచెం మారాం చేస్తుంటుంది. పైగా ఏ అడదిక్కూ లేదు

మాలతి : మరి అమ్మగారు ?

పురుషోత్తం : (చిరాకుగా) ఆ ప్రక్కనే వుంటుంది. మీరేమీ పట్టించుకోనక్కరలేదు. అమ్మాయి అక్కడికి వెళ్ళకుండా చూడవలసిన బాధ్యత మీది. పగలంతా మీ రిక్కడే వుండాలి. నే నెప్పుడైనా ఊరు వెలితే రాత్రిళ్ళుకూడా వుండవలసి వస్తుంది. మీకేమీ అభ్యంతరం లేదుకదా?—

మాలతి : అలాగేనండీ. మీ అమ్మాయిని నా కంటికి రెప్పలాగా చూసుకుంటాను.

పురుషోత్తం : జీతభత్యాలు చెప్పారుకాదు.

మాలతి : మీకెలా తోస్తే అలా యివ్వండి. మీ నీడన వుంటే అదే చాలు.

పురుషోత్తం : మీ కెన్ని టి కీ తక్కువ చెయ్యనులెండి. మీకోసం అరుణ గది ప్రక్కన ఇంకొకటి ఖాళీ చేయించిపెడతా. మీరక్కడే వుండొచ్చు. ఇవాళనుంచే పనిలో చేరండి.

మాలతి : చాలా థ్యాంక్సు. మళ్లీ మధ్యాహ్నం నుంచీ వస్తాను. (మాలతి బయటికి వెళ్లిపోతుంది. ప్రక్క భాగంలో సంభాషణ అంతా వింటున్న సావిత్రి గబగబా వీధి తలుపు దగ్గిరకి వెళ్లి కొంచెం పరకాయించి చూసి తిరిగి వచ్చేస్తుంది. (ముఖంలో ఈర్ష్య కోపం ద్యోతకమౌతున్నాయి)

సావిత్రి : (గో డ మీ ద మూ డు సా ర్లు కొడుతూ) ఏమండోయి, ఏమండోయి ! మిమ్మల్నే!

పురుషోత్తం : (వీధి తలుపు గబగబా వేసి అలమారా దగ్గిరకి వస్తాడు.) ఇప్పుడే ఆవిడలా వెళ్లింది. సమయా సమయాలు చూచుకుని పిలవాలి. నీ తొందర నీదేగాని అవతలవాళ్లు వింటారని కించిత్తైనా ఆలోచించవుగదా ! ఈ వేర్పాటు కాపరం చెయ్యడంలో నా తల్ప్రాణం తోకకి వస్తోంది.

సావిత్రి : (రుసరుసలాడుతూ) అ రు ణ కి టీచర్ని కుదిర్చినట్లేనా ? ఆవిడెవరో, పూర్వోత్తరాలేమిటో, భోగట్టా చేశారా ? ఎర్రగా బుర్రగా వుందని గబుక్కున కుదిర్చి

పురుషోత్తం : ఆమె పేరు మాలతి. కుటుంబంలో పిల్లలాగే వుంది. సర్టిఫికెట్లు చూస్తే మన అరుణకి సరైన టీచర్‌గా వుంటుం దనిపించింది.

సావిత్రి : దొంగ సర్టిఫికెట్లు చ లా గ్గా సృష్టించేస్తున్నారు. ఇంట్లో సర్వకాలాలు వుండే మనిషిని పెట్టుకునేటప్పుడు అన్ని సంగతులు తెలుసుకోవాలికాని పైలాపచ్చీసుగా వున్న పాతికేళ్ల అమ్మాయిని దబుక్కున పెట్టేసుకుంటారా ? ఇదేమైనా సబబుగా వుందా ? పైగా మీ ప్రక్క గదే ఖాళీచేస్తానని చెప్పున్నారా ? మీకు మతి పోతున్నట్లుంది.

పురుషోత్తం : (నిర్ఘాంతపోయి) ఆ! ఏమి టన్నావు ? ఆ అమ్మాయి ఎవరో నాకు తెలియదు. రెండు నెలలుగా టీచర్ని కుదర్చమని ఒకే గోల. కుదర్చగానే మరో అల్లరీ. నీతో ఈ కాపరం చెయ్యటం నా తరం కాదు.

సావిత్రి : (ఈసడింపుగా) కాపరం చెయ్యటం చేత కాదని మాటిమాటికీ అంటున్నారు మీ ఉద్దేశ్యమేమిటి ? పనస తొనలాంటి పిల్ల కనబడగానే పెళ్లాం చేదైపోయిందా ?

పురుషోత్తం : (రెచ్చిపోతూ) అబ్బబ్బ ! నువ్వూ నీ అనుమానాలు ? ఒక్క క్షణమైనా నన్ను ప్రశాంతంగా బ్రతకనిచ్చేటట్లు లేవు. ఉన్నంతసేపూ వూరికే కారాలూ మిరియాలూ నూరుతున్నావు. నేను క్లబ్బుకి పోతున్నాను. ఇక్కడ వుండిమాత్రం చేసేదేముంది ? (పురుషోత్తం తలుపు వేసుకుని వెళ్ళిపోతాడు. సావిత్రి కాసేపు అచేతనంగా నిలబడి పోతుంది. ఇంతలో విశ్వం ప్రవేశం. మెడలో కెమేరా, చేతిలో చిన్న టేప్ రికార్డరూ ఇంకో చేతిలో ఫైల్సు అవన్నీ తీసి బల్లమీద పెడుతూవుంటాడు.)

సావిత్రి : (ఆశ్చర్యంగా చూస్తూ) రెండు రోజులు హైద్రాబాదులో పనుందని వెళ్లావు. పదిహేను రోజు లయింది. నువ్వెక్కడున్నావో ఏమయ్యావో అని ఆదుర్దా పడుతున్నాం. ఒక్క ఉత్తరం ముక్క రాసి పడెయ్యకూడదూ. ఈ సరంజామా ఏమిటి ?

విశ్వం : వదినా, నీకో శుభవార్త చెప్పాలి. ఇంట్లో కాలు పెట్టిన వేళావిశేషం నాకు ...ష్టం కలిసివచ్చి మంచి ఉద్యోగం దొరికింది, ...ంతా నీ చలవే !

సావిత్రి : చాలా సంతోషం. జీతమెంత ?

విశ్వం : నేనూ నా స్నేహితుడూ కలిసి ఒక ఎల్‌క్ట్రానిక్స్ కంపెనీ పెడుతున్నాం. రెండు మూడు పెద్ద కాంట్రాక్టులు వచ్చాయి. చెత్త జీతాలతోటి పనేముంది ? మా నాయన నేనెందుకూ కొరగాని చవటననుకొని ఇంట్లోంచి పొమ్మనగానే బెదిరిపోయి కాళ్ల బేరానికి వస్తాననుకున్నాడు. ఏమైనాసరే ఈ విశ్వం అంత తేలిగ్గా లొంగిపోయే ఘటం కాదని నిరూపిస్తాను.

సావిత్రి : (నిస్పృహగా) నీ పట్టుదలా, నీ మొండితనమేగాని తండ్రి మాటకి కొంతైనా విలువ యివ్వద్దూ. ఊరికే కావేషాలు పెంచుకుని మనస్సులు పాడుచేసుకోవడం ఏమీ బాగాలేదు. నా మాట విని —

విశ్వం : ఆయన కాళ్లమీద పడమంటావు, అంతే ! అస్తమానం నా మనస్సు మార్చటానికి ప్రయత్నిస్తావేగాని నా జీవితంతోపాటు ముడిపెట్టుకొని ఇంకో వ్యక్తి వుందని మర్చిపోతున్నావు. పోనీలే, ఇంతకీ అన్నయ్యగారెలా వున్నారు !

సావిత్రి : (కొంచెం విరక్తిగా) వున్నారు ! ఆయనకేం ? మహరాజు. ఏం చేసినా చెల్లుతుంది !

విశ్వం : (తల పంకించి) ఏదో బాధపడుతున్నట్లున్నావు ! నేనెంత చెప్పినా వినకుండా ఆ నరహరిగాడి సలహామీద యీ విడాకుల ఊబిలో దిగారు.

సావిత్రి : (విచారంగా) అన్నీ ఆలోచించుకునే చేశాం. ఇప్పుడు మధనపడి ఏం ప్రయోజనం ? నేనే మోసపోయాను. మీ అన్నయ్య తడిగుడ్డతో గొంతులు కోస్తారని ఏమాత్రం అనుమానమున్నా ఈ విడాకులకి ఒప్పుకునేదాన్నా ?

విశ్వం : (ఆశ్చర్యంగా) ఏం జరిగింది.

సావిత్రి : (దీనంగా) ఇంకేం జ ర గా లి ! అరుణకోసం ఎవరినైనా టీచర్ని కుదర్చమని ఎన్ని సార్లు చెప్పినా నీవు పట్టించుకున్నావా ? ఇప్పుడు నాపాలిట శనిలాగా ఒకతె వచ్చి ఆయన్ని బుట్టలో వేసేసుకుంది.

విశ్వం : ఎవరేమిటి ?

సావిత్రి : నాకుమాత్రం ఏం తెలుసు ? మనిషిని కుదుర్చుకునేటప్పుడు నాతో సంప్రదించనక్కరలేదూ ? చూడటానికి ఒక సినిమా స్టారులాగా వుంది. నవనవలాడే వయస్సు. అలాంటి పిల్లని తెచ్చి యింట్లో పెట్టుకోవడం సభ్యతగలవాళ్లు చేసే పనేనా ? (విచారంగా) చూడు విశ్వం. మేమెంత అన్యోన్యంగా వుండేవాళ్లమో నీకు తెలుసు. చంటిదానికోసం మనసు రాయిచేసుకుని విడాకుల కొప్పుకున్నామగాని పరిస్థితులిలా తారుమారవుతాయని ఎప్పుడూ వూహించలేదు. అంతా నా దురదృష్టం.

విశ్వం : విడాకులంటే దాగుడుమూతలనుకున్నావు కాబోలు. అయినా అన్నయ్య స్వభావం నీకు పూర్తిగా తెలిసికూడా ఇలాంటి సందేహాలు అనుమానాలు పెట్టుకోటం బాగాలేదు. ఆయన నిప్పులాంటి మనిషి.

సావిత్రి : (వెటకారంగా) చెప్పావులే ! మగవాళ్ల బుద్ధులు ఎవరికి తెలియవు ? ఏ వయస్సు మళ్లినావిడనో పెద్దదిక్కుగా తెచ్చిపెట్టుకోవాలిగాని చిలకలాంటి పిల్లని ఇంట్లో వుండేటట్లు కుదుర్చుకోవడం చాలా అసహ్యంగా వుంది. నేనీ మాటే అంటే తారామండలానికి ఎగిరిపడ్డారు.

డైవోర్స్ – '70

విశ్వం : నువ్వూ నీ పిచ్చి అనుమానాలు! ఆ పిల్ల ఎవరో నేను కనుక్కుంటానులే. నువ్వు చెప్పేదానికేమైనా ఆస్కారం వుంటే ఆవిడని నిమిషాలమీద వదిలించే భారం నాది. సరేనా?

సావిత్రి : కబుర్లకేం? ఇంటిపట్టున ఒక్క రోజైనా వుండవు. మాటలుమాత్రం కోటలు దాటతయి.

విశ్వం : అలా కాదు వదినా, నేనెప్పుడూ ఇక్కడే వుండి అన్నయ్యగారిని ఒక కంట కనిపెడుతూ వుంటాను. ఇదిగో (కెమెరా టేప్ రికార్డరూ చూపిస్తూ) పురుషోత్తం అన్నయ్య మీద వాటర్ గేట్‌ని మించిన నిఘా వేస్తాను. నువ్వూరికే బెదిరిపోవద్దు. ఇలాంటి పరికరాలు మనదగ్గిర వుంటే మీరు పెట్టుకున్న ఈ చొప్పదంటు గోడ ఒక లెక్కా.

సావిత్రి : (తృప్తిగా) సరే, నీమీదే అంతా భారం వేస్తున్నాను... నేను కాసేపు బయటికి వెళ్ళాలి. తిరిగి వచ్చేదాకా ఇల్లు కనిపెట్టుకుని వుంటావు గదూ?

విశ్వం : అలాగే, వదినా. (సావిత్రి బయటికి వెళ్ళిపోతుంది. విశ్వం ఈల వేసుకుంటూ టేపు రికార్డరు బయటవాళ్ళకి కనబడకుండా పుస్తకాల మధ్య పెట్టి, మైకుని రెండు వాటాల్లోంచి వినబడేటట్లుగా అమర్చి పుస్తకం తీసుకుని చదువుకోటం ప్రారంభిస్తాడు. ఇంతలో మాలతి ఒగర్చుకుంటూ వస్తుంది.)

మాలతి : హల్లో, విశ్వం! అయిపు లేకుండా పరారైపోయావేమిటి? నీ దగ్గిరనుంచి ఏమైనా కబురు వస్తుందేమోనని ఎదురు చూసి చూసి నా కళ్ళు కాయలు కాసిపోయాయి. నువ్వు చెప్పినట్లు ఇవాళే ఇక్కడ పనిలో చేరాను కాని సాధక బాధకాలు ఆలోచించావా? ఇక్కడ పరిస్థితి ఏమీ బాగున్నట్లు కనబడటం లేదు.

విశ్వం : అబ్బబ్బ! వచ్చీరావటం గుక్క తిరక్కుండా ఒక ఉపన్యాసం దంచేశావు. ఇవాళ పనిలో చేరావో లేదో అంత తొందరపడితే ఎలా? విడాకుల నాటకం ఆడే ఈ రంగస్థలంలో శాంతిభద్రతలు ఎలావుంటాయి? అందుకేగా నిన్నిక్కడ వుండమన్నాను.

మాలతి : పోనీలే, ఏదోవిధంగా మనిద్దరం ఒకచోట వుండటమే నాకు కావాల్సింది! ఇంతకీ మీ నాన్నగారు మెత్తబడే సూచనలేమైనా వున్నాయా?

విశ్వం : శాంతం కాంతా భూషణం అన్నారు. కొంచెం ఓపికపట్టు. మా నాన్న చాలా కరుకుగా కనిపించినా నేనంటే పంచప్రాణాలు. నెమ్మదిగా ఆయనే దారిలోకి వస్తాడు. ఒకవేళ దురదృష్టవశాత్తూ అలా రాకపోయినా మన వివాహం మాత్రం తప్పదు. ఏం? అలా చూస్తావేం? నా మాట మీద నీకు నమ్మకంలేదా?

మాలతి : నీమీద నాకు విశ్వాసం లేకపోతే నా జీవితాన్ని నీకు ఎందుకు అంకితం చేస్తాను. (గద్గదికంగా) మీ తల్లితండ్రులకి ఒక్కగా నొక్కడివి. వాళ్లకి నిన్ను దూరం చేశానే అని బాధపడిపోతున్నాను. నాలాంటి దురదృష్టవంతురాల్ని ప్రేమించి నీ భవిష్యత్తునే పాడుచేసుకుంటున్నావంటే నా గుండెలు బద్దలైపోతున్నాయి.

విశ్వం : అయినా నువ్వులేని భవిష్యత్తు నాకేముంది?

(ప్రక్కవాటాలో పురుషోత్తం నెమ్మదిగా తలుపు తీసుకుని వస్తాడు. విశ్వం మాటలు అస్పష్టంగా వినబడుతయి. అతను సావిత్రితోటే మాట్లాడుతున్నాడనుకొని గబగబ అలమారు దగ్గిరకి వచ్చి వింటుంటాడు.)

విశ్వం : నిన్ను చూడకుండావున్న ఈ పదిహేను రోజులు నాకొక యుగంలా అనిపించింది. ప్రతిక్షణం నువ్వే నా కళ్లముందు మెదులుతుండేదానివి. నన్ను నమ్మి నీకోసం అన్నీ వదులుకున్నాను. ఇదుగో (దగ్గిరకివచ్చి బుగ్గ గిల్లుతాడు.)

మాలతి : (నెమ్మదిగా) హుష్ ... (ఏదో అనబోయి సిగ్గుతో పూరుకుంటుంది.)

విశ్వం : ఇక నిన్ను విడిచి నేను ఎక్కడికీ వెళ్లను. పరిస్థితులు మనకి అన్నివిధాల కుదిరాయి. నరహరి మాటలు విని ఆస్తికోసం దిగజారిపోయాడు మా అన్నయ్య. నీకోసం ఆస్తంతా

వదులుకునా[illegible] నే[illegible] ా దగ్గిరకి రద్దూ ... ఒక చిన్న ...

(ప్ర[illegible] ురుషోత్తం ఆఘమేఘాల మీద వున్న [illegible] విందామన్న ఆదుర్దాలో అలమారామీద వున్న ఫోటో క్రింద పడేస్తాడు.)

మాలతి : (గతుక్కుమని నెమ్మదిగా) ఆయన వచ్చినట్లున్నారు. (బయటికి వెళ్ళిపోతుంది.)

(ప్రక్కవాటాలో పురుషోత్తం భరించరాని ఆవేదనతో, రోషంతో కూలబడిపోతాడు. అరుణ వస్తుంది.)

అరుణ : ఆకలేస్తోంది నాన్నా ...

పురుషోత్తం : (వళ్లుతెలియని కోపంతో, ఏం మాట్లాడుతున్నాడో తెలియకుండా) పో, ఇక్కడనుంచి పో...

అరుణ : (భయపడిపోయి) ఆదేమిటి నాన్నగారూ ... నిజంగానే ఆకలేస్తోంది ... పోనీ అమ్మ దగ్గి...ర...కి

పురుషోత్తం : ఛీ. మీ అమ్మమాట ఎత్తుతావా? మళ్లీ అనవుగదా? అనవుగదా? (కొడతాడు.)

అరుణ : (బిగ్గరగా ఏడుస్తూ) అమ్మా ...

(బయటనుంచి మాలతి ఆదుర్దాగా వచ్చి పిల్లని తీస్తుంది.)

పురుషోత్తం : (తేరుకుని) ఛీ ... ఎంతపని చేశాను! ... ఒక్కనాడైనా నా చిట్టితల్లిని కసురుకోలేదు ... ఇవాళ — ఇవాళ (కొంచెం ఆగి) నా మనస్సు బాగోలేదు ... బయటికి పోతున్నా ... కొంచెం మీరే అమ్మాయిని సముదాయించండి...

మాలతి : అలాగేనండీ ... రా, అరుణా ... (లోపలికి తీసుకువెళ్తుంది.)

(కొంచెం వ్యవధి. ప్రక్కవాటాలో విశ్వం పచార్లుచేస్తూ వుంటాడు. బైటనుంచి "విశ్వం బాబూ విశ్వంబాబూ" అన్న కేక వినిపిస్తుంది.)

విశ్వం : ఎవరూ?

వెంకటేసు : (లోపలికి వస్తూ) నేనే బాబూ.

విశ్వం : ఓహో వెంకటేసూ! నువ్వా! ఇక్కడ నౌకరీ మానేసి వూరెళ్లిపోయావన్నారుగా!

వెంకటేసు : నౌకరీ మానేశానుగాని వూరు వెళ్లడానికి మనసొప్పలేదు బాబూ. ఈ ప్రక్కనే మా మేనల్లుడింట్లో తలదాసుకుండా.

విశ్వం : వెంకటేసూ, ఈ ముసలికాలంలో నీకెందుకీ అగచాట్లు? నీ కొడుకు దగ్గిరకి పోయి కృష్ణా రామా అనుకుంటూ కాలం గడిపితే బాగుంటుంది కదా?

వెంకటేసు : అలాగే అనుకున్నా బాబూ, కాని చూస్తూ చూస్తూ ఏళ్లపాటు కనిపెట్టుకున్న కుటుంబాన్ని ఎలా విడిచిపెట్టి వెళ్లేది? పండంటి కాపరం ఆ సావిత్రమ్మ పాడుచేసుకుంది. అరుణమ్మని సూస్తావుంటే నా గుండె పగిలిపోతావుంది. తల్లినీ బిడ్డనీ ఈ చేతుల్తో పెంచాను.

విశ్వం : వాళ్లకి నచ్చచెప్పడానికి ఎంతో ప్రయత్నించాను. కాని నా మాట విన్నారా? ఆ నరహరిగాడి మాటలే వేద వాక్యాలనుకుని తగనిపని చేశారు. వాణ్ణి ఏం చేసినా పాపంలేదు.

వెంకటేసు : మన బంగారం మంచిదైతే ఇంకోళ్లని అని ఏం ప్రయోజనం బాబూ! నువ్వు సదువుకున్నోడివి. అన్నీ తెలిసినోడివి. ఏదైనా ఉపాయం కనిపెట్టు బాబూ – ముసిలోణ్ణి వుండలేక సెపుతున్నా

విశ్వం : తెలిసీ తెలిసీ గోతిలో దిగుతామంటే నువ్వూ నేనూ ఏమి చెయ్యగలం? ఆస్తి రంధిలో పడి ప్రేమ, అభిమానం మానవతా – అన్నీ మరిచిపోయారు.

వెంకటేసు : నువ్వుకూడా అలా అంటే ఎలాగు బాబూ? సావిత్రమ్మ బయటికి వెళ్లటం చూసి ఈ మాట నీ చెవిని పడేసి పోదామని వచ్చాను ... నౌకరు ముండావాణ్ణి – వాలాటోడు చెపితే ఎవరింటారు! నువ్వే ఏదో ఒకదారి సూడాలి. లేకపోతే పచ్చటి సంసారం చితికిపోతుంది.

విశ్వం : అదే నేనూ ఆలోచిస్తున్నాను. (కొంచెం కోపంగా) వీళ్ల చేష్టలు చూస్తుంటే నాకు వళ్లు మండిపోతోంది. సమాజం ఒక వెల్లువలా ముందుకు సాగిపోతుంటే ఎదురీదుదామని శుష్కప్రయత్నం చేస్తున్నారు. మా నాయనకూడా ఆ కోవకు చెందినవాడే!

వెంకటేశు : నా మతితగలడ! అసలు వచ్చిన పనే మరిచిపోయాను. (జేబులోంచి ఉత్తరం తీసి) మీ అమ్మగోరు జాబు పంపించారు. మీకు అర్జంటుగా యివ్వమన్నారు.

విశ్వం : అలాగా! (ఆదుర్దాగా తీసుకుని చదువుతుంటాడు. ప్రక్కవాటాలో మాలతి ప్రవేశం.) అరే ... వెంకటేసూ! ఎంత మంచి వార్త తెచ్చేవు ... (నెమ్మదిగా) అక్కడ ఆవిడ వచ్చినట్లుంది. నువ్వు తప్పుకో.

వెంకటేసు : ఆవిడెవరు బాబూ!

విశ్వం : నీకు తెలిసిన అమ్మాయే. తరువాత

చెప్తాను. ముందు నువ్వు ఎవరికంటా బడకుండా వెళ్ల ... ఇంకోమాట. అరుణని ఒక కంట కని పెడుతూ వుంటావుకదూ ?

వెంకటేసు : నేనెక్కడకీ పోను బాబూ. రాత్రైతే ఈ అరుగుమీదే పడుకుంటున్నానండీ ... (వెళ్లిపోతాడు.)

విశ్వం : (జాబు చదవడం పూర్తి చేసి, గంతులువేస్తూ) మాలతీ ! అక్కడ ఎవరూ లేరుగా ?

మాలతి : ఎవరూ లేరులే. పురుషోత్తంగారు బయటికి వెళ్తూ ఆలస్యంగా వస్తానన్నారు. అరుణ వాళ్ల నాన్నగారు కొట్టారని ఏడ్చి ఏడ్చి యిప్పుడే నిద్రపోయింది.

విశ్వం : నీకొక మంచిమాట చెప్పాలి. నన్ను అక్కడికి రమ్మంటావా ? ఇక్కడికి వస్తావా ?

మాలతి : నువ్వే రా. (కొంచెం తటపటా యిస్తూ) మీ వదినగాని గబుక్కుని వస్తే —

విశ్వం : మా వదిన సంగతి నీకింకా తెలియదు కాబోలు. లేడీస్ క్లబ్బులో రమ్మీ ఆడడానికి వెళ్లింది. అందులో పడితే ఒకపట్టాన తెములు తారా ? (తలుపు దగ్గిరకి వేసి పురుషోత్తం వాటాలోకి కూనిరాగంతీస్తూ ప్రవేశిస్తాడు.)

మాలతి : మంచి హుషారులో వున్నావే ? ఏమిటా మాట ?

విశ్వం : ముత్యంలాంటి మాట. మరి నాకు బహుమానంగా ఒక చిన్న ...

మాలతి : (చిరుకోపంగా) అదే వద్దన్నది. ఆహా ! నన్నిక్కడ ఉద్యోగంలో చేరమన్నది ఎందుకో నాకిప్పుడు అర్థమయింది.

విశ్వం : అంత కోపమైతే ఎలా ? నాకు మాత్రం తెలియదా ఏమిటి ?

మాలతి : ఏమో బాబూ నీవు కొంటె కోణంగివి. అలా అంటూనే ఏదో తంటాతెస్తావు. తొందరగా చెప్పు ఏమిటీ !

విశ్వం : (నాటక ఫక్కీలో) యింకేం చెప్పాలి ? నీవు నా ప్రేయసివనీ, నా జీవిత నౌకకి చుక్కానివనీ, ఎంకివలె నా గొంతుకలో కొట్లాడే గుండెవనీ ...

మాలతి : ఓహో ! ప్రేమతోపాటు కవిత్వం కూడా మూడుపువ్వులూ ఆరుకాయలూ కాస్తుంది. ఆ చెప్పేదేదో త్వరగా కానీ. పుణ్యకాలంకాస్తా అయిపోతే అక్కడ ఆవిడా, యిక్కడ ఈయనా తయారవుతారు.

విశ్వం : నేను ఉద్యోగం వెతుక్కుంటూ వెళ్లానా ? అది తెలియక ఏ సన్యాసం పుచ్చుకున్నానో, లేక తపీమని ప్రాణత్యాగం చేశానో అని గాబరాపడి మా అమ్మ మంచం ఎక్కింది. నేను తిరిగివచ్చానని తెలిసి వెంకటేసుతో ఉత్తరం పంపింది. పాపం ! చాలా బాధపడుతూవుంది. అటు హిరణ్యకశిపుడులాంటి భర్త. ఇటు ప్రహ్లాదుడు లాంటి కొడుకు !

మాలతి : ఎంతైనా తల్లిమనసు. ఈ కష్టా లన్నీ నామూలంగానే వచ్చినయి. తల్లినీ కొడుకునీ వేరుచేశాను. నేను నిజంగా పాపాత్మురాలిని ! (కళ్లనీళ్ళు పెట్టుకుంటుంది.)

విశ్వం : ఈ సందిగ్ధాలూ, సమస్యలూ మానవ జీవితంలో ఎప్పుడూ వున్నయ్యే. ఈనాడు క్రొత్తగా వచ్చినవికావు. పరిస్థితులనిబట్టి వాటి స్వభావం మారుతూవుంటుంది. అంతే. ఆస్తి ! గౌరవం, హోదా అనే కల్పిత విలువలని పట్టుకుని అభ్యుదయాన్ని నిరోధించే వ్యక్తులు, శక్తులు ప్రతి వ్యవస్థలోనూ వుంటారు. వాళ్లే తల్లులూ తండ్రులూ !

మాలతి : బాగానేవుంది. ఒకప్రక్క కవిత్వం ఇంకొకప్రక్క ప్రేమ, అడపాతడపా రాజకీయాలు నీతో చాలా గొడవగా వుంది. ఇంతకీ అసలు సంగతి చెప్తావా లేదా ?

విశ్వం : మా అమ్మ కంటికీ మంటికీ ఏడుస్తూవుంటే మా నాన్న కొంచెం మెత్త పడ్డాడట...

మాలతి : (సంతోషంగా) నిజంగానే ! ఇంత చల్లని కబురు చెప్పటానికి ఇంతసేపు యీ ఉపన్యాసాలతోటి ఏడిపించావెందుకూ ?

విశ్వం : నువ్వు చెప్పనిస్తేగా ? ఒక్క షరతు మాత్రం పెట్టారు. ఏ నిర్ణయానికీ వచ్చేముందు మా అమ్మ నీతో మాట్లాడాలట. నిన్ను తీసుకు రమ్మంది.

మాలతి : ఇదంతా నిజమే ! నేను నమ్మ లేకుండా వున్నాను.

విశ్వం : నిజమే మాలతీ. నువ్వుకూడా మా సావిత్రమ్మొదినలాగ అనుమానం మనిషివే ! కావా లంటే యీ ఉత్తరం చూసుకో. పద, మా యింటికి వెళదాం:

మాలతి : విశ్వ లా భయంగా వుంది. అక్కడికి మీ నాన్నగారు ధాం ధాం అని కేక. పై ప్రాణం పైనే పోతుంది.

విశ్వం : ఇంతేనా? ఏదో చాలా ధైర్యస్థురాలి వనుకున్నాను.

''జమీందారుగారి అమ్మాయి''లో



మాలతి : (సంకోచిస్తూ) ఇప్పుడే బయలు దేరాలంటారా ?

విశ్వం : (టైం చూసుకుంటూ) ఈ క్షణంలో బయలుదేరకపోతే మా నాన్నగారికి అనవస రంగా కోపం తెప్పించినవాళ్ల మవుతాం. పద. ఎందుకైనా మంచిది నువ్వు ముందు నేను వెనకా బయలుదేరదాం. మా వదిన చూచిందంటే లేనిపోని సంజాయిషీలు చెప్పుకోవాలి.

(సావిత్రమ్మ అదే సమయానికి తన వాటా లోకి వస్తుంది. ప్రక్కన మాటలు వినిపిస్తాయి. పురుషోత్తమే మాలతితోటి మాట్లాడుతున్నాడను కొని చప్పుడు చెయ్యకుండా అలమారా దగ్గిరకి వస్తుంది.)

మాలతి : ఏమిటోనండీ, నాకు చాలా భయంగావుంది.

విశ్వం : (మాట్లాడకుండా దగ్గిరకివస్తాడు.)

మాలతి : అదిగో, అదే వద్దంది. ఇంత తొందరపడితే ఎలాగండీ ? అహర్నిశలూ మీ కంటి ఎదుటే వెలుగుతున్నానుగా. ఈ యింట్లోంచి బయటపడితే నేనెప్పటికీ మీదాన్నే. ముందు... (ప్రక్కకి చూపిస్తూ) ఆవిడగానీ వచ్చిందంటే అసలుకే మోసం.

విశ్వం : (మాట్లాడకుండా గాలిలో ముద్దు పెడుతూ నవ్వుతూ బయటికి వెళ్లిపోతాడు.)

(సావిత్రి చాలా కలవరపడిపోతుంది. కాసేపు నిశ్శబ్దం. మాలతికూడా బయటికి వెళ్లి తలుపు వేసుకుంటుంది. ఇంకేమీ వినరానందున సావిత్రి ఉసూరుమంటూ కుర్చీలో కూలబడిపోయింది. కళ్లల్లో నీళ్ళు గిర్రున తిరిగాయి. కొంచెం తేరు కుంటుంది. ముఖంలో కోపం ఈర్ష్య గోచ రిస్తాయి)

సావిత్రి : (కోపంగా) విశ్వం. విశ్వం.

విశ్వం :(బయటనుంచి వస్తూ) ఏంవదినా?

సావిత్రి : ఎక్కడికి వెళ్లావు ? నేను వచ్చే టప్పటికి తలుపు బార్లా తీసుంది. ఏ దొంగవెధవైనా దూరితే ఏమైయ్యేది ? అయినా యిల్లు కాస్త చూస్తుండమని బైటికి వెళితే నువ్వు పెత్తనాలేమిటి ?

విశ్వం : ఏమిటి వదినా ? అంత కోపంగా వున్నావు ? తోచకపోతే బైటికివెళ్లి సిగరెట్టు కాల్చుకుంటున్నాను.

సావిత్రి : మరి నాకు కనబడలేదే ?

విశ్వం : నేను వీధి మొగలో నిలబడి మన యింటిమీద ఒక కన్నువేసి వుంచానులే. నీవు రావడం చూసి వెనకాలే వచ్చాను.

సావిత్రి : (ఉసూరుమంటూ) అలాగా ! అయితే నేననుకున్నది నిజమేనన్నమాట. (బాధగా) భగవంతుడా ! నాకెంత కష్టం తెచ్చిపెట్టావు !

విశ్వం : (ఆశ్చర్యంగా) అదేమిటి వదినా ? ఇప్పుడేమైంది ? అలా నీరుకారిపోతున్నావేం ?

సావిత్రి : (దీనంగా) నా బాధ నాది. ఎవరితో చెప్పుకుంటే తీరుతుంది. ఈ అగ్ని నా గుండెల్లో పెట్టుకుని బ్రతకాల్సిందే. (కొంచెం ఆతృతతో) మీ అన్నయ్యని చూశావా ?

(ఇంకా వుంది)

సినిమా విశేషాలు

1974లో 4 గురు హీరోయిన్లు

ప్రేక్షకులు యిష్టపడే హీరోయిన్లు నలుగురు మాత్రమే నన్నది నా వాదం. నా అభిప్రాయంతో అందరూ ఏకీభవించకపోవచ్చు. అధిక శాతం నన్నే బలపరచగలరన్న నమ్మకం నాకున్నది.

ప్రజలు వాణిశ్రీ, శారద, జమున, మంజుల చిత్రాలను చూడడానికి అలవాటుపడ్డారు. గ్లామర్ + యాక్టింగ్ రెండూ వున్న నటిగా వాణిశ్రీకి పేరు వున్నది. శోకరసం పోషించడంలో శారదకు ప్రత్యేకమైన పేరు వున్నది. ఎట్టి పాత్రకయినా సరితూగే నటిగా జమునకు పేరున్నది. గ్లామర్ వేషాలకు మంజులకు పేరున్నది.

1974లో ఎవర్ని ఉత్తమ నటిగా పేర్కొనాలో సమస్యగా పరిణమించింది. పోటీ యిద్దరి మధ్య జరిగింది. "కృష్ణవేణి"లో వాణిశ్రీ నటనను మెచ్చుకోవాలా లేక "ఊర్వశి"లో శారద పాత్ర పోషణను ప్రశంసించాలా అన్న సంశయం వచ్చిన మాట వాస్తవమే అయినా, నా మనసు వాణిశ్రీ వైపే మొగ్గింది. "దీర్ఘ సుమంగళి"లో జమున నటనకు స్పెషల్ కాంప్లిమెంటు యివ్వక తప్పదు.

"మంచి మనుషులు" లో మంజుల చక్కగా నటించి అందరినీ ఆశ్చర్యచకితుల్ని చేసింది. "సిడలేని ఆడది" ప్రభకు వుజ్వల భవిష్యత్తుకు బాటవేసింది. "ఓ సీత కథ" చిత్రం రోజారమణి ఆంతస్తును పెంచింది. "అమ్మమనసు" చిత్రం జయంతి పాపులారిటీని పెంచింది.

1974 లో వాణిశ్రీ నటించిన చిత్రాలు విజయాన్ని చవిమాచాయి. ఖయిదీబాబాయ్, మంచివాడు, మనుషుల్లో దేవుడు, కృష్ణవేణి చిత్రాలన్నీ ప్రజలకు నచ్చాయి. వాణిశ్రీకి మంచి పేరును తెచ్చాయి. ఆమె ఏడు చిత్రాలలో నటించ, నాలుగు ఘనవిజయాన్ని సాధించాయి. అగ్రనటి పట్టానికి వాణిశ్రీ అర్హురాలుఅని నిరూపించింది. "సత్యానికి సంకెళ్లు, చక్రవాకం, కన్నవారి కలలు" దెబ్బతిన్న చిత్రాలు.

శారదకూడా ఏడు చిత్రాలలో నటించింది. నటనకు మంచి పేరు తెచ్చుకొన్నదేగాని, చిత్రాలు అంతగా విజయాన్ని సాధించలేకపోయాయి. "ప్రేమలు—పెళ్లిళ్లు, తులాభారం, రాధమ్మ పెళ్లి, ఆడంబరాలు—అనుబంధాలు, హారతి, పల్లెపడుచు, ఊర్వశి" చిత్రాలలో వైవిధ్యమున్న పాత్రలను ప్రతిభావంతంగా పోషించింది.

జమున ఆరు చిత్రాలలో వెరైటీ పాత్రలను పోషించింది. "పెద్దలు మారాలి, మనుషులు—మట్టిబొమ్మలు, గౌరి, దీర్ఘ సుమంగళి, భూమి కోసం, దీక్ష" చిత్రాలు ఎంతగా ప్రజలను ఆకర్షించాయో నేను వ్రాయక్కర్లేదు.

నేను నిజాలను రాశాను. ఎవరిని నొప్పించడం నా వుద్దేశ్యం కాదు. ఒక బాధ్యత గల విలేఖరిగా కన్న నిజాన్ని, తెలిసిన సత్యాన్ని వెల్లడించడం నా ధర్మం.



— "రాముని మించిన రాముడు"లో —



"బలిపీఠం"లో శోభన్‌బాబు, శారద

నందమూరి యింట అక్కినేని

కారణజన్ములు కొందరే వుంటారు. అట్టి వారిలో నందమూరి తారకరామారావు ఒకరు.

ఆయన యిద్దరు కుమారులు నటించడం ఆరంభించారు. ఒకతని పేరు హరికృష్ణ. మరొకతని పేరు బాలకృష్ణ.

పెద్దతను తన తండ్రివలె నటించడానికి ప్రయత్నించి జయించిన నిజాన్ని "రామ్—రహీమ్" చిత్రం వెల్లడిచేసింది.

చిన్నతను ప్రత్యేక బాణీని చూపెట్టి, ప్రజలను ఆకట్టుకొన్న నిజాన్ని "రామ్—రహీమ్" చిత్రం నిరూపణ చేసింది.

ప్రేక్షకులు ఈ చిరంజీవులను గూర్చి అన్న మాటలను రాస్తాను.

నందమూరి యింట నటరత్న, నటసామ్రాట్ వెలిసారు. చిరంజీవి. హరికృష్ణను రామారావు తోనూ, చిరంజీవి బాలకృష్ణను నాగేశ్వరరావు తోనూ పోల్చారు. ఈ యిద్దరూ మూడు దశాబ్దాలుగా అగ్రస్థానాన్ని వహిస్తున్న రామారావు, నాగేశ్వరరావుల వలె రాణించాలని ఆశిస్తున్నాను.

బాక్సింగ్ యువతులుగా లక్ష్మి, చంద్రకళ

సురేష్ యింటర్నేషనల్ నిర్మిస్తున్న "అమ్మాయిల శపథం" చిత్రంలో బాక్సింగ్ నేర్చిన యువతులుగా లక్ష్మి, చంద్రకళ గమ్మత్తయిన పాత్రలను పోషిస్తున్నారు.

అల్లరి చేయవచ్చిన రౌడీలను చితగ్గొట్టే సాహస వనితలుగా చంద్రకళ, లక్ష్మి నటించ, వారి చెప్పిన మాటలను తు. చ. తప్పక పాటించే భర్తలుగా రామకృష్ణ, చంద్రమోహన్ నటిస్తున్నారు. ఈ చిత్రానికి జి. వి. ఆర్. శేషగిరిరావు దర్శకుడు.

చల్లనితల్లిగా అంజలీదేవి

లలితా మూవీస్ నిర్మించిన ''చల్లనితల్లి'' చిత్రం మహిళాలోకాన్ని విశేషంగా ఆకర్షించగల అంశాలను గొనియున్నది. ఈ కథను ప్రముఖ నిర్మాత దుక్కిపాటి మధుసూదనరావు రాశారు. ఈ చిత్రంలో అంజలీదేవి అపూర్వంగా నటించింది. ఇలాంటి పాత్రలకు ఆమె అందెవేసిన చేయి అని మరొకసారి ఋజువు అవుతుంది. ఆమె ధరించిన పాత్రను గూర్చి వాళ్లయిదు వాక్యాలను వ్రాస్తాను.

''పాత్ర పేరు పార్వతి. సావిత్రలాము. కల్లా కపటం ఎరగని కలవారి ఇల్లాలు. రాఘవయ్యగారి గృహిణి. ఆమెకు ఒక్కగానొక్క కొడుకు ... అతడి పేరు గోపీ.

చెట్టంత కొడుకు హత్య చెయ్యబడ్డాడు. దిక్కులేని అన్నపూర్ణకు ఆశ్రయం యిచ్చింది. కన్న కూతురుకన్నా మిన్నగా కాపాడింది. ఆమెకు పుట్టిన గీతను మమతానుబంధాలతో పెంచి, పెళ్లి చేయటానికి నిశ్చయించింది.

అందరికీ మంచిని చేసిన ఆ చల్లనితల్లిని దేవుడు శపించాడు. బ్రతుకంతా భరించలేని కష్టాలను తెచ్చిపెట్టాడు.' ఇట్టి క్లిష్టమైన పార్వతి పాత్రను అంజలీదేవి ఉత్తమంగా పోషించింది. చిరంజీవి. జగదీష్‌చంద్రప్రసాద్ నిర్మించిన ఈ చిత్రానికి కె. ఎస్. రామిరెడ్డి దర్శకుడు.

అనంతలక్ష్మిలో రామకృష్ణ

''ప్రేమలు—పెళ్లిళ్ళు'' చిత్రాన్ని అందించిన అనంతలక్ష్మి భాస్కరరావు. యిప్పుడు ''భిన్న ధృవాలు'' నవలకు తెర రూపం యిస్తున్నారు.

ఈ చిత్రంలో రామకృష్ణ నాయక వేషం వెయ్య, ప్రభ నాయికగా నటిస్తుంది. విక్టరీ మధుసూదనరావు దర్శకుడు. 'ఊర్వశి' ఫేమ్ సత్యానంద్ మాటలను రాస్తున్నాడు.



''ఆడదాని అదృష్టం''లో చలం, సుమ

రామకృష్ణ జాతకం !

1975 యీ నటుడికి చాలా ప్రోత్సాహకరంగా వుంటుంది. ఇన్నేళ్ళు లభించని అవకాశాలు యిప్పుడు వచ్చాయి.

ఏ. వి. ఎమ్. సంస్థ, సురేష్ సంస్థ, అనంతలక్ష్మి సంస్థ రామకృష్ణకు రావడం, కొత్త జీవితానికి దారి తీస్తుంది.

ఆంధ్రుల అగ్రనటితో రెండు చిత్రాలు, ఎవర్ గ్రీన్ జమునతో రెండు చిత్రాలు హీరోగానటించడం కూడా యీ ఏడు జరిగిన కొత్త సంఘటనే.

గురుదక్షిణ !

విశ్వశాంతి విశ్వేశ్వరరావు నిర్మించిన ప్రయోగాత్మక చిత్రం ''తీర్పు'' విడుదలకు సిద్ధంగా వుంది. నేడు సమాజంలో జరుగుతున్న సంఘటనలను యథాతథంగా చిత్రించిన చిత్రం ''తీర్పు''. ఇందులో నటించిన వాళ్లలో అధిక శాతం కొత్తవారున్నారు. ముఖ్యమైన జడ్జి పాత్రను 'నటరత్న' పోషించారు. మరొక ముఖ్య భూమికను ప్రభాకర రెడ్డి ధరించారు.

పై చిత్రం చూచిన వాళ్లందరూ ప్రభాకర రెడ్డి నటనను గూర్చి గొప్పగా చెప్పారు. జడ్జి పాత్రను నటరత్న తప్ప మరొకరు చెయ్యలేరని శ్లాఘించారు. చిత్రం ఆద్యంతం దర్శకుడు విశ్వేశ్వరరావు నేర్పు అగుపిస్తుంది అన్నారు.

తను దర్శకత్వం నెరపిన ''తీర్పు'' చిత్రాన్ని తన గురుదేవులు, పూజ్యులు పి. పుల్లయ్యకు అంకితం యివ్వడానికి నిశ్చయించిన విశ్వేశ్వరరావును ఎంతేని అభినందించాలి.

ఈ కాలంలో గురువు పట్ల యింత భక్తిని ప్రదర్శించడం ముదావహం.

క్షేత్రయ్యగా తుకారామ్

భక్త తుకారామ్‌గా నటించి, సాత్విక ప్రధానమైన పాత్రలకు తనే సాటి అని మరొకసారి గుర్తు చేసిన అక్కినేని మహాకవి క్షేత్రయ్యగా దర్శనమివ్వబోతున్నారు. మంచి ఎంపిక.

ఎనభై గ్రంథాల పరిశీలన !

గత వారం అంజలీదేవిగారింటికి వెళ్లాను. అప్పుడు, ఆదినారాయణరావుగారు ఒక పెద్ద గ్రంథాన్ని పరిశీలిస్తున్నారు. అదేమిటని అడిగాను. క్షేత్రయ్య జీవితానికి సంబంధించిన పుస్తకము అని చెప్పి, తను 79 గ్రంథాల నుండి సేకరించిన విషయాలను వెల్లడించారు.

క్షేత్రయ్య చిత్రానికిగాను స్వర్గీయ సముద్రాల, రామకృష్ణశాస్త్రిగార్లు తయారుచేసిన స్క్రిప్టును చూపించారు. ఈ చిత్రానికి వలసిన మరికొంత సమాచారాన్ని సేకరించే ప్రయత్నాలను చేస్తున్నట్టు ఆదినారాయణరావు చెప్పారు.

కవయిత్రి పాత్ర !

మహాకవి క్షేత్రయ్యను భక్తుడిగానేగాక, శృంగార పురుషుడిగా కూడా చిత్రించబోతున్నట్టు చెప్పి, ముగ్గురు కొత్తమ్మాయిల కోసం అన్వేషణ జరుపనున్నట్టు వ్యక్తపరచారు. ఇందులో క్షేత్రయ్యను ఢీకొనే కవయిత్రిగా అంజలీదేవి నటించగలదు.

1975లో అక్కినేని చిత్ర రంగ ప్రవేశం క్షేత్రయ్యతో ప్రారంభం గావడం ముదావహం. పవిత్ర ఐక్యంతో చిత్రాలను నిర్మించే ఆదినారాయణరావుకు యిది శుభదాయకం.

త్యాగయ్యగా అక్కినేని !

నటించే ''శ్రీ త్యాగరాజ రామాయణం'' చిత్రాన్ని ఎన్. ఎస్. మూర్తి నిర్మించగలరని, బాపు దర్శకత్వంలో రమణ రూపొందించగలరని తెలిసింది. త్యాగయ్య పాత్రను పోషించాలన్న అభిలాష అక్కినేనికి చాలా కాలంగా వున్నది. తనకు నచ్చిన యీ పాత్రను ప్రజలు మెచ్చే విధంగా అక్కినేని పోషించగలరు. జయీభవ!



ఢిల్లీలో జరిగిన అంతర్జాతీయ ఫిలిం ఉత్సవంలో పాల్గొన్న రుమేనియా చిత్రం ది ''ప్రాడిగల్ ఫాదర్''లో ఒక దృశ్యం


సృష్టి అంత చిత్రం
జీవిత మంత నిజం
LAKSHMI PUBS


శ్రీలక్ష్మి ప్రొడక్షన్స్
ఈస్ట్మన్ కలర్
స్క్రీన్‌ప్లే-దర్శకత్వం
నిర్మాత:
లక్ష్మి ఫిలింస్ రిలీజ్



''ఉత్తమురాలు''లో జయంతి, విజయలలిత

నాగేశ్వరరావు చిత్రాలు !

ఇప్పటికీ పాపులర్ స్టార్‌గా వున్నది నాగేశ్వర రావు అన్న నిజం యీ మధ్య విడుదలైన ''దేవదాసు'' నిరూపించింది. నిర్మాతల పెదవులపై నవ్వు నాట్యమాడాలి అనేది మనస్తత్వం గొప్ప యీ మంచి మనిషితో చిత్రాలను నిర్మించడానికి అందరూ సుముఖులే.

ఈయనతో చిత్రాలను నిర్మించదలచిన వాళ్ళ సంఖ్య నాకు తెలిసి యిరవై వున్నా, అందరికీ చెయ్యగల టైము లభించడం అసాధ్యము.

జగపతి పిక్చర్స్‌కు, సురేష్‌కు, ప్రసాద్ ఆర్ట్స్ పిక్చర్స్‌కు, అన్నపూర్ణా పిక్చర్స్‌కు, ఫణి మాధవీ కంబైన్స్‌కు, అనంతలక్ష్మి పిక్చర్స్‌కు, అంజలీ పిక్చర్స్‌కు, చిత్ర కల్పనకు, శ్రీ వాణీ ఆర్ట్స్ కంబైన్స్‌కు చెయ్యడం తథ్యము అని విశ్వసనీయంగా తెలిసింది.

మరో అయిదుగురు అక్కినేని సమ్మతి కోసం నిరీక్షిస్తున్నారు. ఆయన సరేనంటే పిందరైనా తీస్తారు. అత్యాశ లేని అక్కినేని అందరికీ అవునన లేదు.

రాధా చిత్రం ప్రారంభం

మురళీకృష్ణా మూవీస్ పతాకం క్రింద యం. కె. రాధా నిర్మిస్తున్న చిత్రం నవంబరులో ప్రారంభమవుతుందని లోగడ వ్రాసాము. కాని ఫిలిం దొరకనందువల్ల ఈ చిత్రం షూటింగ్ డిశంబరు 15 వ తేదీ విజయవాడ నటరాజ హోటల్లో శ్రీకారం చుట్టుకుంది. ఏ. శేషగిరిరావు (రఘురాం ఫిలిమ్స్) క్లాప్ కొట్టగా, యం. సీతారామారావు (తారకరామా డి|సి) స్విచ్ ఆన్‌చేసారు. మొదటి షాటును ్తల్లో జయకుమారి నృత్యాన్ని షూట్‌చేసారు దర్శకుడు కె. యస్. ఆర్. దాస్. రంగనాథ్, సుచిత్ర అనే కొత్తమ్మాయిలపై కొన్ని ముఖ్య సన్నివేశాలను కొండపల్లిలో చిత్రీకరించారు. దాదాపు వారంపైగా జరిగిన ఈ షెడ్యూలులో ప్రభాకరరెడ్డి, కాంతారావు, రామదాసు, చిట్టిబాబు, దేవిక, విజయలలిత పాల్గొన్నారు.

ఈస్ట్‌మన్ కలర్‌లో తయారవుతున్న ఈ చిత్రానికి రమేష్‌నాయుడు సంగీతానికి, ఎస్. ఎస్. లాల్ కెమెరాకు, జి. విశ్వనాధం కూర్పుకు, ఆరుద్ర రచనకు కర్తలుగా వ్యవహరిస్తున్నారు. తారకరామా విడుదల.

విజయా ప్రొడక్షన్స్‌లో కృష్ణ !

విఖ్యాత విజయా సంస్థలో హీరో కృష్ణ గమ్మత్తయిన పాత్రను పోషించనున్నట్లు, ఆయనే చెప్పారు. ఈ చిత్రానికి కె. ఎస్. రామిరెడ్డి దర్శకత్వాన్ని, పెండ్యాల సంగీత సారధ్యాన్ని నిర్వహిస్తున్నారు. రచన పాలగుమ్మి పద్మరాజుగారిది.

ఇటీవల యీ చిత్రానికి సంబంధించిన మూడు పాటలను రికార్డింగ్ జరిపినట్లు, నిర్మాణ నిర్వాహకుడు టి. వి. ఎస్. శాస్త్రి చెప్పారు.

అభిమానవతి వాణిశ్రీ

త్రిమూర్తి ప్రొడక్షన్స్ వారి ''కరుణ'' చిత్రానికి ''అభిమానవతి'' అని పేరు మార్పు జరిగింది. టైటిల్ పాత్రను ఆంధ్రుల అగ్రనటి వాణిశ్రీ పోషించింది. విప్లవ భావాలను గొప్ప వింత వనితగా వాణిశ్రీ విశిష్టంగా నటించిన యీ చిత్రంలో కృష్ణ ద్విపాత్రాభినయం ప్రశంసనీయంగా వున్నదని తెలిసింది. ఈ చిత్రానికి ''ప్రశ్నావళి'' రామలక్ష్మి రాసిన రచన రమణీయంగా వున్నదట. ఇందులో ప్రభాకరరెడ్డి, శుభ, ప్రమీల,



ఎస్వరలక్ష్మి, మాడా, టి. జి. కమల ముఖ్య తారాగణం.

ప్రముఖ వ్యాపారస్తుడు, విషయం తెలిసిన వివేకి యగు డూండీశ్వరరావు దర్శకత్వం నెరపిన మొదటి చిత్రం ''అభిమానవతి'' ఆంధ్ర ప్రేక్షకుల అభిమానాన్ని చూరగొనగలదు. ఈ చిత్రాన్ని బాబ్జి — సాంబశివరావు నిర్మించారు. శ్రీ ఫిలింస్ విడుదల.

తండ్రి — కొడుకుల మధ్య పాటరూపంలో జరిగిన సంవాదం ఈ చిత్రానికి హైలైటు అంటున్నారు.



ప్రక్కనగల బొమ్మలు ఎడమనుంచి కుడికి
(1) లక్ష్మి, చంద్రమోహన్ (పరివర్తన)
(2) మంజు, గిరిబాబు (చదువు—సంస్కారం)
(3) ప్రభ,సత్యేంద్రకుమార్ (అన్నదమ్ముల కధ).

సీరియల్

అహం-అనురాగం

జి. పరిమళా సోమేశ్వర్

(గత సంచిక తరువాయి)

ఎంతో నిర్మలమైన మనసులతో, ఉధృతమైన ప్రణయ పారవశ్యంతో తమ యిరువురిమధ్యా ఏర్పడిన పవిత్ర బంధానికి యీ అల్ప మానవులిచ్చే వ్యాఖ్యానాలు వింటుంటే వారిని చూసి జాలిపడాలో, నవ్వాలో తెలియలేదు రవికి.

ఒకసారి ఆఫీసులో ఒకతనికి పెళ్లి అయింది. పెళ్లికి ముందు అతను పాతిక వేలు కట్నం తీసుకున్నాడన్న విషయం విని లోలోపల అసూయ పడుతున్నా యువక రత్నాలన్నీ అతని అదృష్టానికి తమ సంతోషాన్ని తెలిపేరు.

అదంతా విని అతనన్నాడు. "ఆఁ. నాకు వచ్చే టోడి పాతిక వేలు ఏ మూలకో పోతాయోయ్. అందులో కనీసం పది వేలన్నా పెట్టి పెళ్లికూతురుకి నగలు చేయించాలి. పోతే ఆ పదిహేను వేలలో నా చదువు కోసం చేసిన అప్పులకుగాను పదివేలు, నా పెళ్లి ఖర్చులకుగాను ఐదువేలు. పోగా యింక నాకు మిగిలేదేముంది? రవిని చూడండి. అతని పని ఎంత బాగుందో. ఇన్స్టాల్‌మెంట్లలో నెల నెలా యింత డబ్బంటూ వస్తుంటే ఆ డబ్బంతటినీ బ్యాంకులో వేసుకుంటే ఆమె రిటైరయ్యేసరికి లక్ష పైగా పెరిగిపోతుంది కట్నం. బ్రతుకంటే అలా రవి బ్రతుకులా ఉండాలోయ్. నాదేముంది?" అంటూ ఉపన్యాసం యిచ్చేడు.

వైవాహిక బంధాన్ని ఆర్థిక విషయాలతో ముడిపెట్టే మూర్ఖులకు ఎలా సమాధానం చెప్పాలో రవికి తెలియదు. అందుకే అతని మాటలు వినికూడా విననట్లే నటించేడు.

ఈ ప్రపంచంలో మనిషి డబ్బు లేనిదే బ్రతకలేడని తెలుసు. బ్రతకటానికి డబ్బు చాలా అవసరమని కూడా తెలుసు. కాని డబ్బు ఎంతటి పాపిష్టిదో, డబ్బును గురించి ఎన్ని పాపిష్టి అపవాదులు, అసూయలు రేకెత్తుతాయో రవికి అప్పుడప్పుడే అర్థమవసాగింది.

అన్ని చికాకుల మధ్యా రవి అప్పుడప్పుడు తన మనశ్శాంతి కోసం కథలు, గేయాలు వ్రాస్తూ వాటిని వివిధ వార, మాస పత్రికలకు పంపిస్తుండేవాడు. అవి అచ్చయినప్పుడల్లా చుట్టూ ఉన్న దుష్ట బృందం మరింత విజృంభించేది.

"కలిమి వచ్చినా, కష్టాలొచ్చినా కలసికట్టుగానే వస్తాయోయ్. నీ రచనలవల్ల యిటు కీర్తి అటు డబ్బూ రెండూ వచ్చి వాళ్లో వాలాయికదా" అనేవారు.

అంతే తప్ప సాహితీ దృష్టితో ఆ రచనలను

సినిమా

డాక్టరు కావాలా? మేజరు కావాలా?

దేశానికి ఈ యిద్దరు వెన్నెముకలాంటివాళ్లు. దేశాన్ని శత్రువుల బారినుండి రక్షించేది మేజరయితే, దేశాన్ని రోగాల బారినుండి కాపాడేది డాక్టరు అనేడి నిజం అందరికీ తెలిసినదే.

రాజేశ్వరి ఫైన్ ఆర్ట్సువారి "రాముని మించిన రాముడు" చిత్రంలో నటరత్న డాక్టరుగా, మేజరుగా ద్విపాత్రాభినయం చేస్తున్నారు. ఈ చిత్రం యొక్క పదమూడు రీళ్లను విమర్శకులకు చూపించారు, దర్శక-నిర్మాత గోపీనాధ్.

డాక్టరుగా రామారావు ఎంత దర్జాగా చేశారో, మేజరుగా నందమూరి అంత జోరుగా నటించారట. అగ్రనటి వాణిశ్రీ హార్ట్ పేషెంటుగా సహజంగా నటించిందట. చలపతిరావు సమకూర్చిన సంగీతం గూర్చి విశేషంగా చెప్పుకొన్నారట. జి. కె. రాము ఛాయాగ్రహణ మహాత్మ్య ఫలము ప్రతి ఫ్రేములో ప్రత్యేకంగా కనిపించినట్టు వార్త. ఈ చిత్రం నిర్మాతలు భక్తవత్సలం, గోపీనాధ్‌లకు ధనలాభాన్ని ఆర్జించి పెడుతుందట.

"రాముని మించిన రాముడు" చిత్రంలో ప్రతి చిన్న వేషాన్ని కూడా ప్రతిభావంతులు పోషించడం వల్ల, కథకు పూర్తి న్యాయం చేకూరినట్టు వార్త. జగ్గయ్య, ప్రభాకరరెడ్డి, రాజబాబు, త్యాగరాజు, శ్రీవిద్య, పండరీబాయి వంటి వెటరన్లు నటించిన చిత్రం "రా. మి. రా."

జమిందారుగారి అమ్మాయి!

నవత చిత్రవారి యీ చిత్రం జనవరి 31 న విడుదలవుతుంది. హిందీలో ఒకప్పుడు "శేషమహల్" పేరిట విడుదలయిన చిత్రానికి అనేక మార్పులు, చేర్పులు చేసి కొత్త కథగా రాయబడింది. ఈ చిత్రానికి డి. వి. నరసరాజు రచయిత.

గుమ్మడి - శారద!

జమిందారుగా గుమ్మడి గొప్పగా నటించారా, అమ్మాయిగా శారద గొప్పగా నటించారా అనేడి ప్రశ్న వుదయిస్తే, యిద్దరూ ఒకర్ని మించి మరొకరు చేశారన్న సమాధానం వస్తుంది. ముఖ్య పాత్రలను పోషించిన రంగనాథ్, గిరిబాబు, మమత, కృష్ణకుమారి, వెంకటేశ్వర గిరిజారాణి, రాధాకుమారి, అల్లు రామలిం[illegible]కివారే సాటి అనిపిస్తారు. రాజబాబు వేషం ప్రత్యేకత అగుపిస్తుంది.

సింగీతం ప్రతిభ!

ఈ చిత్రానికి మూలం హిందీ అయినా, దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు ఎంతో వూహాశక్తిని ప్రదర్శించిన నిజం షాటు విభాగంలోనూ, చిత్రీకరణలోనూ కనిపిస్తుంది.

మొత్తం మీద నిర్మాత ఎన్. కృష్ణంరాజు ఆంధ్ర ప్రేక్షకులకు ఒక మంచి సినిమాను అందిస్తున్నందుకు అభినందనీయుడు. ఈ చిత్రానికి శ్రీరంగరాజు, విజయరామరాజు సహ నిర్మాతలు. అన్నపూర్ణా విడుదల.

గిరిబాబు గ్రేడు పెరిగింది

అన్నపూర్ణా సినీ ఎంటర్‌ప్రైజస్ వారి "ఊర్వశి" చిత్రం గిరిబాబు గ్రేడును పెంచడం కోసం నిర్మించబడినదా అనిపిస్తుంది. ఈ చిత్రంలో గిరిబాబుకు ప్రముఖ పాత్ర యివ్వబడింది. అట్టి ప్రాముఖ్యత గల పాత్రను ప్రతిభావంతంగా పోషించాడు. ఈ మాటను సినిమా చూచిన ప్రేక్షకులందరూ ఏకగ్రీవంగా అన్నారు.

ఇంత పేరు తెచ్చిపెట్టిన చిత్రంలో గిరిబాబు ధరించిన పాత్ర తేనెపూసిన కత్తి పాత్ర. చాలా చక్కగా చేశాడు. ఈ పీరియడ్‌లో గిరిబాబు సముచితమైన నిర్ణయం తీసుకోవాలి.

ప్రజలు గిరిబాబును విలన్‌గా మాత్రమే యిష్టపడతారు. కాబట్టి తనను ఆదరించే ప్రేక్షకులకు యిష్టమైన పద్ధతిలో అంటే విలన్ వేషాలలో మాత్రమే నటించడం మంచిది.

పైగా, పరిశ్రమలో విలన్ వేషాలు వెయ్యడానికి నటులు లేని ఈ సమయంలో గిరిబాబు విలన్ పాత్రలపై శ్రద్ధ తీసుకుని చెయ్యగలిగితే, మరొక దశాబ్దం వరకు పేరు, ప్రతిష్టలను, డబ్బును గడించవచ్చు.

మదరాసు వివాహం!

తెలుగు నటుడు టి. ఎల్. కాంతారావుగారి కుమార్తె సౌభాగ్యవతి సుశీల; చిరంజీవి కె. అప్పారావు, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ మిల్లట్, మాల్ట్సు, బివిరేజస్ మరియు హైద్రాబాద్ కపిల రామయ్యగారి కుమారుడుగార్ల వివాహం డిశంబరు 30 న స్థానిక అబాట్స్‌బరీ భవంతిలో వైభవంగా జరిగింది.

— శ్రీనివాస్

"చల్లని తల్లి"లో సుమిత్ర, విజయకాంత్



చదివి, విమర్శించి, మంచి చెడులను గురించి మాట్లాడటం మాత్రం వాళ్లకు చేతకాదు.

"వీళ్లంతా సగటుమనుషులు" అని సరిపెట్టుకో జూసేవాడు రవి. సగటు మనుషుల నుండి సగటు విలువలనే ఆశించాలి. వాళ్లలో ఏదో ఔన్నత్యం వుంటుందని భావించటం, ఉండాలని ఆశించటం వట్టి తెలివితక్కువ అనుకునేవాడు రవి.

అలా మంచి హోదాలో వున్న భార్యను చేసుకున్న అపరాధానికేకాక గొప్ప రచయితగా పేరు ప్రతిష్ఠలు సంపాదించుకుంటున్న నేరానికికూడా రవి చాలామంది మిత్రులకు దూరమవటం, కొత్త శత్రువులను సృష్టించుకోవటం జరిగింది. లోకంలో తననిమించిన అదృష్టవంతులు చాలామంది వున్నారని రవికి తెలుసు. కాని అలాటివాళ్లందరినీ వదిలి తనని చూసే వీళ్లు అసూయపడటం ఎందుకో అనుకునేవాడు. ఏమో ! ఆ అదృష్టవంతులనబడే వాళ్లకూడా తనలాగే యితరుల అకారణ ద్వేషానికీ, ఈర్ష్యకీ గురి అవుతూ బాధపడుతూనే వున్నారేమో ! తనకేం తెలుసు ? పైకి చాలామంది అదృష్టవంతులలాగానే కనపడతారు. కాని వాళ్ల హృదయాల్లో ఎన్ని అగ్నిపర్వతాలున్నాయో మామూలు మనుష్యులకేం తెలుస్తుంది ? అనుకుని తనని తాను సమాధానపరచుకునేవాడు రవి.

ఇలా ఎవరికి వారు భార్యాభర్త లిద్దరూ తమ చుట్టూ వున్న దుష్టశక్తుల ప్రభావానికి లోనై బాధపడుతున్నప్పటికీ ఒకరి సమక్షంలో ఒకరు ఆ విషయాన్ని గురించి ఆలోచించనట్లే ప్రవర్తించేవారు. అనవసరంగా ఎదుటి వ్యక్తి మనసు నొప్పించట మెందుకని తమ బాధని తమ కంఠంలోపలనే దిగమ్రింగుకునేవారు.

కాని శ్యామలది ఆవేశ ప్రకృతి. ఆమెలో రవి కున్నంత గుండెనిబ్బరం లేదు. అందుకే ఎన్నోసార్లు ఒంటరిగా వున్నప్పుడు కుమిలి కుమిలి ఏడ్చేది. చివరకు ఆ దుఃఖం పట్టుదలగా మారి ఆమెకు ఒక దృఢత్వాన్ని కలిగించేది.

ఆ పట్టుదలతోనే ఆమె రవి ముందు పుస్తకాలు, గైడులు తెచ్చిపడేసి "ఏమైనాసరే. ఈ మార్చికి మీరు బియ్యే పరీక్ష ప్యాసవ్వాలి" అన్న దొకసారి.

"అమ్మో. మార్చికా ? పట్టుమని రెండు నెలలన్నా లేవు. ఈ రెండు నెలల్లోను గ్రూపు పరీక్షకు తయారవటం సాధ్యమా ?" అన్నాడు రవి.

"పట్టుదల వుండాలేగాని రెండునెలలు కాదు. రెండు వారాలు చాలు. బోడి పరీక్షలు ... ఆఫ్టరాల్ ఈ పరీక్షలు ప్యాసవటంకూడా ఒక గొప్పేనా ? అందునా మీది ఆర్ట్సు గ్రూపయ్యె. ఆర్ట్సును చదివి గుర్తుంచుకోవటం ఎంత తేలికో !" అన్నది శ్యామల.

"ఎంత తేలికో నువ్వు చదివితే తెలుస్తుంది."

"ఏం నేను చదవలేనంటారా ? ఏదీ. ఆ పుస్తకాలిలా యివ్వండి. ఆ పుస్తకాలన్నిటినీ పది హేను రోజుల్లో చదివి హయ్యర్ సెకెండ్ క్లాసు తెచ్చుకోకపోతే అప్పుడనండి."

"నీకు పుణ్యం వుంటుంది. అలాగే చెయ్యరాదూ ? నాబదులు నువ్వే వెళ్లి పరీక్షలు వ్రాసిరారాదూ ?"

జరిగిన కథ : స్త్రీల కళాశాల లెక్చరర్ శ్యామల. విద్యార్థినులతో నెహ్రూ జూలాజికల్ పార్కుకు వెళ్లి వచ్చిన శ్యామల అక్కడ తనను ప్రమాదం నుంచి కాపాడిన అపరిచితుడిని మరిచిపోలేకపోతుంది. తనని పెళ్లి చేసుకోవాలనుకుంటున్న చంద్రకి భార్యగా ఊహించుకోవటానికే అసహ్యం పడుతుంది శ్యామల. తనను ప్రమాదం నుంచి కాపాడిన వ్యక్తి బి. ఎ. తప్పిన పేద నిరుద్యోగని తెలుసుకుంటుంది. చంద్ర ప్రేమను శ్యామల నిరాకరించడంతో వెంకటేశ్వరరావుగారి ఆరోగ్యం చెడి మరణించగా ఒంటరి దవుతుంది శ్యామల. తనను ప్రభావితం చేసిన కథా రచయిత రవి ఆమెను ప్రమాదం నుంచి కాపాడిన వ్యక్తే అని శ్యామల తెలుసుకుంటుంది. రవిని పెళ్లి చేసుకుంటే జీవితాంతం బాధ పడవలసివస్తుందని శ్యామలను హెచ్చరిస్తాడు చంద్ర. రచయితగా రవిని ప్రేమించి పెళ్లి చేసుకున్నా, భర్తగా అతడు తనకంటే ఉన్నత ఉద్యోగంలో ఉండాలని అందుకు మరల చదవమని రవిని బలవంతం చేస్తుంది శ్యామల. తమ అంతస్తులను గూర్చి ఇతరులన్న సూటిపోటీ మాటలవల్ల మనస్తాపం చెందుతారు రవీ, శ్యామల

"నేను [illegible] యితే అలాగే చేసేదాన్ని..."

"ఇప్పటి[illegible]ంచిపోయిందేముంది ? నా షర్టూ పాంటూ వేసుకుని మీసం, గడ్డం తగిలించుకో..."

"హాస్యాలకేంగాని కావాలంటే మీతోపాటు కూర్చుని నేనూ చదువుతాను వుండండి."

"నువ్వూ నేనూ ఒకటేననుకుంటే ఎలా ? నువ్వు పోస్ట్‌గ్రాడ్యుయేట్‌వి. పదిమందికి చదువును నేర్పుతున్నదానివికూడాను. నేనేమో ఆరేళ్లక్రితమే చదువుకు స్వస్తిచెప్పిన బియ్యే ఫెయిల్డు కాండిడేట్‌ని. మీకూ నాకూ పొంతన ఎక్కడ మేడమ్?" అనేవాడు నవ్వుతూ రవి.

భర్త పరీక్షకు కూర్చుంటున్నాడని తోటి ఆర్ట్సు లెక్చరర్ల దగ్గర ఇంపార్టెంటు క్వొశ్చన్లు, రెండు మూడు సంవత్సరాల పేపర్లు తీసుకుంది శ్యామల.

అది చూసి వాళ్లు హేళనగా నవ్వుకునేవారు.

"ఈవిడ కాలేజీలో డిగ్రీ స్టూడెంట్లకు పాఠాలు చెప్తుంది. అలాటావిడ కనీసం ఒక్క యూనివర్శిటీ డిగ్రీ అన్నా లేని మనిషిని ఎలా పెళ్లి చేసుకుందో పాపం !" అని కొంత సానుభూతీ మరి కొంత వెటకారం ధ్వనింపజేసేవారు.

ఆ మాటలను చూచాయగా విన్న శ్యామల గుండె తునాతునకలైపోయిందని వేరే చెప్పనక్కర్లేదు. ఆ బాధను మనసులో పెట్టుకుని యింటికి వచ్చిన శ్యామలకు ఆరోజు మధ్యాహ్నం సెలవుపెట్టి యింటికివచ్చి కథ వ్రాసుకుంటున్న భర్తని చూసేసరికి ఎక్కడలేని ఆగ్రహమూ ముంచెత్తుకువచ్చింది.

"విలువైన కాలాన్ని యిలా అడ్డమైన చెత్త వ్రాస్తూ వేస్ట్ చెయ్యకపోతే చక్కగా కూర్చుని చదువుకోరాదూ ?" అంది.

"ఇది 'చెత్త' అని ఎవరన్నారు ? చదివేక నువ్వే అంటావు యిది బంగారంకన్నా కూడా విలువైనదని" అంటూ తలెత్తి ఆమెవంక చూడనైనా చూడకుండా తన ధోరణిలో తాను వ్రాసుకుపోసాగేడు రవి.

'ఛీ ! మీకోసం ఎంతగా బాధపడుతున్నానో మీరంత నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తున్నారు. మీకసలు సిగ్గు, అభిమానం అనేవి వుంటే యిలా చీమ కుట్టనట్లు వుండేవారా ?" అంటూ చటుక్కున అతని చేతిలోని కాగితాలు తీసి, చింపి క్రింద పడవేసింది శ్యామల.

ఎదురుచూడని ఆ సంఘటనకు నిరుత్తరుడయ్యేడు రవి. వెంటనే అతని ముఖం క్రోధావమానాలతో జేవురించిపోయింది.

"శ్యామలా ! ఏమిటిది ?" అన్నాడు సాధ్యమైనంతవరకు తన కోపాన్ని అణచిపెట్టుకుంటూ.

కాని శ్యామల అతనిని అర్థంచేసుకునే స్థితిలో లేదు.

"ఏమిటో తెలియటంలా ? ఆ చెత్త కథలు వ్రాసుకోకపోతే చదువుకోరాదూ ?" అంది గట్టిగా.

"చదువు ! చదువు ! అది తప్ప నీకు మరో ప్రపంచమే లేదు "

"ఔను. మీలాటి గుమాస్తాలకు చదువు విలువ ఏం తెలుస్తుంది ? ఎంతసేపూ మీకు వచ్చే మూడువందల మొత్తాన్నే మహావరంగా భావిస్తూ తృప్తిపడటంతప్ప జీవితంలో ముందుకు పోవాలని, ఎన్నో నేర్చుకోవాలనీ మీ కెందుకుంటుంది ? అసలు మిమ్మల్నని లాభంలేదు. మీలోని యీ మందకొడితనానికి కారణం మీరు వెలగబెడుతున్న ఉద్యోగమే ! కనీసం ఏ స్కూల్లో టీచర్‌గా పనిచేస్తున్నా మీకంటె ఎక్కువ డిగ్రీలున్న ఉపాధ్యాయులను, మిమ్మల్ని మించి పై చదువులు చదువుతున్న మీ విద్యార్థులను చూసైనా మీలో కొంత 'వేడి' పుట్టేది. మీ ఆఫీసులోని 'సరుకం'తా మీవంటిదేగా. ఎంతసేపూ 'చా'లు తాగటం, సిగరెట్‌పొగ పీల్చటం, వెకిలి కబుర్లు చెప్పటంతప్ప ఒక మంచి ఆలోచన, ఒక మంచిపని చేద్దామన్న కోరిక, ఏమన్నా ఉంటేగా ? ఛీ ! మిమ్మల్నని లాభంలేదు. తప్పు నాది..." అంటూ అక్కడ ఒక్కక్షణం అయినా వుండకుండా వెళ్లిపోయింది శ్యామల.

"జీవితంలో ముందుకు పోవాలంటే నేర్చుకోవలసింది డిగ్రీ పుస్తకాలలోని విజ్ఞానమేకాదు. ఇంకా చాలా వున్నయ్ శ్యామలా !" అన్న రవి కంఠం విని చటుక్కున ఆగిపోయింది.

ఆమెకు చప్పున ఎందుకో నోటివెంబడి మాటలు రాలేదు. తీక్షణంగా అతనివంక చూస్తూ నిలబడింది.

క్రిందపడిన కాగితాలను తీసి దగ్గరగా వాటిని చేర్చి, టేబులుమీద పెట్టేడు రవి. "ఇప్పుడు నువ్వు చించింది ఈ కాగితాలనేకాదు. నా మనసును కూడా. ఇలాటి పని యింకెప్పుడూ చెయ్యకు శ్యామలా ! నీతో పరుషంగా మాట్లాడి నిన్ను దూరంచేసుకోవటం నాకిష్టంలేదు" అని మెల్లగా

ఒక్కొక్కమాటే తూచినట్లు మాట్లాడేడు రవి.

శ్యామల ఆవేశంకాస్తా అతని గంభీర స్వరాన్ని వింటూనే ఒక్కసారిగా చల్లబడిపోయింది.

చిరిగిపోయిన ఆ కాగితాలు పేపర్‌వైట్ క్రింద గాలికి రెపరెపలాడుతూంటే వాటితోపాటు ఆమె మనసుకూడా వూగిసలాడింది.

తాను అనవసరంగా ఆవేశం తెచ్చుకుని భర్త మనసును కష్టపెట్టానని గ్రహించింది.

మారు మాట్లాడకుండా తన గదిలోకి వెళ్లి బట్టలు మార్చుకుంది. "నీతో పరుషంగా మాట్లాడి నిన్ను దూరం చేసుకోవటం నాకిష్టం లేదు" అన్న రవి వాక్యాలు పదే పదే ఆమె చెవులలో ప్రతిధ్వనించసాగినయ్.

అంటే ఏమిటి అతని ఉద్దేశ్యం ? తను అతనితో యివ్వాడు పరుషంగా మాట్లాడి అతనిని దూరం చేసుకుంటున్నదనా ? ఎంత మెత్తగా వాత పెట్టేడు ! ఎంతైనా రచయితకదా ? మాటలను తూచి తూచి మాట్లాడటం అతనికే చెల్లింది. తనే వట్టి బోళా మనిషి. నోటికి వచ్చినట్లు మాట్లాడుతుంది. మంచీ చెడూ యేవీ ఆలోచించదు. ఛీ ! తనెంత సిగ్గుమాలిన మనిషి !

ఆ తరువాత ఐదారుగంటల వరకు మనసులో మధనపడుతూనే వుంది శ్యామల.

కాసేపు భర్తమీద కోపం వచ్చింది ఆమెకు. కాసేపు తనమీదనే కోపం తెచ్చుకుంది. మరి కాసేపు ప్రపంచాన్నంతటినీ కాల్చి భస్మం చెయ్యాలన్నంత కోపం వచ్చింది. ఆ అకారణ కోపం, అర్ధం పర్ధంలేని ఆవేశం బాగా ప్రకోపించి చివరికి పాలపొంగులా ఒక్కసారిగా అణగిపోయినయ్. ఆ క్షణంలో జీవితమంటేనే విరక్తి కలిగింది శ్యామలకు. అలా రకరకాల ఆలోచనలతో సతమతమవుతూ చివరికి వంట పనీ, స్నానం అన్నీ ముగించుకుని బయటకు వచ్చేసరికి రవి తాను వెళ్లినప్పుడే గదిలో వున్నాడో అక్కడే కుర్చీలో కూర్చునివున్నాడు. ఐతే అప్పటిలాకాక బల్లమీద తలానించి ముఖాన్ని దోసిట్లో పెట్టుకుని వున్నాడు.

అతనివారకంగా చూసేసరికి ఆమె గుండె ద్రవించిపోయింది.

"రవీ ! నన్ను క్షమించు" అంది అతని బుజంమీద చెయ్యివేసి. అలా అంటుంటే ఆమె కంఠం జీరవోయింది.

'రవి'ని పేరు పెట్టి పిలిచి అప్పటికి చాలా కాలమయింది. ఆ పిలుపు వినేసరికి రవి గుండెలో అలజడి రేగిన మాట నిజమే !

కాని అతనికి తగిలిన గాయం చిన్నదేంకాదు. అందువల్ల ఆత్మ గౌరవం అతనిలోని అనురాగాన్ని కూడా జయించింది. కదలక మెదలక అలాగే కూర్చున్న రవి ముఖంమీద నున్న రెండు చేతులనూ బలవంతాన తీసివేసింది శ్యామల. "తప్పయిందని ఒప్పుకుంటున్నానుగా. ఇంకెప్పుడూ మీ రచనల విషయంలో జోక్యం కలిగించుకోనని మాట యిస్తున్నాను కూడాను. ఇంక నన్ను క్షమించి మీ కోపాన్ని కట్టిపెట్టండి" అంది.

రవి తలెత్తి కూర్చున్నాడు. కాని అతని చూపులు మాత్రం నేలమీదనే ఉన్నయ్.

"ప్లీజ్ ! ఇంక అలుక మానండీ !" అంటూ అతని నుదిటిమీద ముద్దు పెట్టుకుంది శ్యామల.

"వట్టి ముద్దులతో నా కోపం పోతుందా ?" అన్నాడు.

"మరింకా ఏం కావాలి ?"

"ఏమీ అక్కర్లేదు. ఇకముందెప్పుడూ నా రచనలను విమర్శించననీ, నా కాగితాలు చింపననీ మాటివ్వు చాలు" అన్నాడు రవి.

అతని మాట తీరు, ముఖ కళవళికలూ ఆమె నెందుకో గాయ పరిచినయ్.

తాను తన తప్పను ఒప్పుకుని, పైగా క్షమాపణ వేడుకున్నా కూడా అతను తన మొండిపట్టు వదలలేదే ? తను అంత మహాపరాధం ఏం చేసిందని అతని కింత కోపం ? అనుకుంది.

ఎంతైనా స్త్రీ హృదయం కనుక అతనిలోని కరకుతనాన్ని యిట్టే మర్చిపోవాలని ప్రయత్నించింది.

అతనిని హాస్యాలు పట్టించి, ఏవో జోక్స్ చెప్పి నవ్వించి చివరి కెలాగైతేనేం అతనిని మామూలు స్థితికి తీసుకురాగలిగింది.

భోజనాలయిన తరువాత "ఇంతకూ యివ్వాళ కాలేజీలో ఏం జరిగిందేమిటి? వస్తూనే నా చదువును గురించి అంత మధనపడ్డావ్ ?" అనడిగేడు రవి.

"ఇవ్వాళ ప్రత్యేకంగా మధన పడుతున్నదేముంది ? ప్రతి రోజూ ఉన్న బాధేగా ?"

"ప్రతి రోజూ ఉన్న బాధేననుకో. కాని యివ్వాళ కాలేజీలో ఎవరో ఏదో అనకపోతే నీ కింత ఆవేశం వచ్చేదికాదు."

"మీకెలాతెలుసు?"ఆశ్చర్యంగాఅడిగిందిశ్యామల.

రవి నవ్వేడు.

"ఆమాత్రం తెలుసుకోలేనా ? మన వివాహమైన దగ్గరనుండి మా ఆఫీసువాళ్లంతా మనిద్దరి మధ్యా గల అంతస్తుల తారతమ్యాన్ని గురించి మాట్లాడుతూ 'నన్ను ఏదో రకంగా ఎత్తిపొడుస్తూనే ఉన్నారు. మీ కాలేజీలో కూడా నీకు అలాంటి మర్యాదలే జరుగుతూ ఉండి ఉంటాయని ఊహించుకోవటానికి గొప్ప మేధస్సేమీ అక్కర్లేదు" అన్నాడు.

"నిజమే ఒక లెక్చరర్ ఏమన్నదో తెలుసా ?" ఈమె డిగ్రీ క్లాసులకు పాఠాలు చెప్తుందికదా కనీసం



కాలచక్రంలో వయసు

— "సంధ్య"

రెండు వయస్సుల మధ్యనుంచి వెలువడింది ఒక పసి వయస్సు
హోటళ్ల యజమానుల "సిరి"ని శుభ్రపరుస్తుంది ఒక బాల వయస్సు
లక్జరీ షూ మార్ట్‌లో 'అనామిక' కాళ్లను పట్టుకొంటుంది అదే లేత వయస్సు
డెందాన్ని బ్రతికించాలని "ఎక్కడికో" వెళుతుంది ఒక సగటు వయస్సు
"ఘెరావో", "ఘెరావో" అనరుస్తుంది ఉడుకు వయస్సు
అంతా నిదురపోతుంటే, చీకటిలో నలుగుతుంది ఒక "అభాగిని" మనస్సు
వయస్సు పరిపూర్ణతను కోరుతుంది ఒక యువక వయస్సు
"మారోజులు". "ఆరోజులు" అంటూనే వుంటుంది ఒక ముసలి వయస్సు
ఈ వయసుల చక్రం కాలచక్రంలో తిరిగి తిరిగి అలసిపోక తిరిగి తిరుగుతూనే వుంటుంది.

అహం – అనురాగం

తన భర్త ఒక డిగ్రీ అన్నా కలవాడై ఉండాలని ఎందుకనుకోదు ?" అని.

"ఔను. నిజమే! వివాహానికి ముందు నువ్వు యీ విషయాన్ని గురించి ఆలోచించవలసి ఉండవలసింది."

"ఏం యిప్పుడు డిగ్రీలు లేనంత మాత్రాన మీకేం తక్కువ వచ్చిందని ?" మనసులో ఎంతటి కోతఉన్నా పైకిమాత్రం నవ్వుతూనేఅన్నది శ్యామల.

"ఏమీ తక్కువ రాకపోతే అస్తమానం "చదువు, చదువు" అని ఎందుకిలా నా ప్రాణం తీస్తావు చెప్పు" అన్నాడు రవి కూడా నవ్వుతూనే.

దానికిఏమీ సమాధానంచెప్పలేకపోయిందిశ్యామల.

అది చూసి మందహాసం చేసేడు రవి.

"ఔను. వాళ్లన్నదాంట్లో నిజం లేకపోలేదని నీ అభిప్రాయం. అందుకే నువ్విలా బాధ పడుతున్నావు. నీ మనసులో ఉన్న మాటనే యితరులు నీ ముఖం మీద అనేసరికి నువ్వు ఆ చేదు నిజాన్ని భరించలేకపోతున్నావు. నీకు గనుక నిజంగా నా డిగ్రీలతో నిమిత్తం లేకపోతే వాళ్ల మాటలకు అంత ఆవేశం తెచ్చుకొనేదానివీ కాదు. ఆ ఆవేశాన్ని నామీద కురిపించేదానివీ కాదు."

శ్యామల మరి మాట్లాడలేకపోయింది.

"నేను మామూలు మనిషిని రవీ! స్త్రీ లందరిలో ఉండే బలహీనతలన్నీ కొంతవరకు నాలోనూ ఉన్నాయ్." అంది కాసేపైన తరువాత అపరాధినిలా తల వంచుకుని.

"మామూలు మనుషులు మామూలుగానే జీవించాలి శ్యామలా ? అసాధారణంగా జీవించాలనుకుంటే యిదిగో — యిలాటి చిక్కులే వస్తాయ్. అసాధారణ పరిస్థితులలో జీవించే గుండె నిబ్బరం లేని మనుషులు సాధారణమైన జీవితంతోనే సరిపెట్టుకోవటానికి ప్రయత్నించాలి. మీ నాన్నగారి కోరిక ప్రకారం అందం, ఐశ్వర్యం, హోదా అన్నీ ఉన్న చంద్రను — నిన్ను కోరుకున్న చంద్రను — వివాహంచేసుకునిఉంటే నీకీ బాధలన్నీ ఉండేవికావు."

అతని ధోరణి చూస్తుంటే ఆమెకు భయం వేసింది.

"ప్లీజ్ ! రవీ! అలా మాట్లాడకు. నేను భరించలేను. ఆవేశంలో నిన్ను ఏమేమో అన్న మాట నిజమే. దానికి నన్నింతగా బాధ పెట్టటం మంచిది కాదు. ఇంతటితో యీ టాపిక్‌ని కట్టిపెట్టేద్దాం" అంది ప్రాధేయపూర్వకంగా.

"నేనుకూడా మామూలు మనిషినే శ్యామలా ! నాకూ ఆత్మాభిమానం, సిగ్గూ లజ్జా అన్నీ ఉన్నయ్. అందుకే నీ మాటలను సహజంగా తీసుకోలేకపోతున్నాను" అన్నాడు గద్గదిక స్వరంతో రవి.

శ్యామల నిస్సత్తువగా కూర్చుండిపోయింది.

ఆ సంఘటన తరువాత యింట్లో మళ్లీ మామూలు వాతావరణం నెలకొనటానికి వారం రోజులు పట్టింది. కాలం ఎలాటి గాయాలనైనా మాన్పగలుగుతుందన్న వాక్యం వాళ్ల విషయంలో నిజమయింది.

రవి కూడా అన్నీ మర్చిపోయి శ్యామలతో సరదాగానే ఉంటున్నాడు. ఆ రోజును తలచుకున్నప్పుడల్లా శ్యామలతో మరీ కఠినంగా ప్రవర్తించానేమోనన్న పశ్చాత్తాప భావం కూడా అతనిలో కలగకపోలేదు.

శ్యామల [illegible] యికముందెప్పుడూ అలా తొందరపడి న[illegible] కూడదని నిశ్చయించుకుంది.

ఐతే రవి మాత్రం పరీక్షలకు చదవటం మానలేదు. కేవలం శ్యామలను సంతృప్తి పరచటానికే రోజూ అతను పుస్తకాలు చదువుతున్నాడని ఆమె గ్రహించలేకపోయింది. అతనికి తనమీద పూర్తిగా కోపం పోయిందనీ, తన మాటలు అతనిమీద బాగా పని చేసేయనీ, అందుకే అంత శ్రద్ధగా చదువుతున్నాడనీ భావించిందామె.

అలా అనాసక్తిగా చదివిన అతని చదువుకూడా అతనికి బాగానే బుద్ధి చెప్పింది. రెండు మార్కులు తక్కువ రావటంతో అతను బియ్యే పరీక్ష తప్పేడు.

ఆ రోజు శ్యామల ఎంతగా బాధ పడిపోయిందో రవికి కూడా సరీగ్గా తెలియదు.

రవి మాత్రం చాలా యిబ్బందిలో పడిపోయేడు. తను తప్పినందుకుకంటె శ్యామల అంతగా బాధ పడుతున్నందుకే అతనికి ఎక్కువ బాధగా ఉంది. ఆమె నెలా ఓదార్చాలో అతనికి తెలియలేదు. "మీకేం తక్కువ ? డిగ్రీలు లేకపోతేనేం ?" అని కొన్ని మధుర క్షణాలలో అనే శ్యామలే తనకా డిగ్రీ రానందుకు అంతగా తల్లడిల్లిపోతుంటే ఆమె నెలా ఓదార్చాలో నిజంగానే అతనికి తెలియలేదు.

"ఈసారి తప్పకుండా ప్యాసవటానికి ప్రయత్నిస్తాను శ్యామలా !" అన్నాడు.

అలా అన్నాడేకాని ఆ అపజయం అతనిలో ఉన్న కాస్త ఆత్మ విశ్వాసాన్ని కూడా తునా తునకలు చేసిందన్న సంగతిని మాత్రం తన మనసులోనే రహస్యంగా ఉంచుకున్నాడు రవి.

ఈసారసలు ఆ మాత్రం కూడా పుస్తకాలు ముందు వేసుకుని చదవగలనా అన్న సందేహం అతనిని పీడిస్తూనే ఉంది. అలాగే రోజులు గడుస్తున్నయ్. శ్యామల కిప్పుడు ఏడవ నెల. ఆమెకు యింట్లో పనులు చేసుకోవటం, అటు ఉద్యోగం చేసుకోవటం కష్టంగా ఉంది. అత్తగారిని సాయం రమ్మందామా అనుకుంది. కాని ఆవిడవెంట పిల్లాజల్లా అంతా రాకమానరు. ఆ బెడదలన్నీ ఎందుకని తనే అవస్థలు పడదలచుకున్నది శ్యామల. పనిమనిషి సహాయంతో అలాగే యింటి పనులు చేసుకుపోతోంది. కాని కాలేజీలో మాత్రం ఆమెకు ఎప్పటిలాగానే క్లాసులు తీసుకోక తప్పటంలేదు.

వీటికి తోడు రవి బియ్యే పరీక్షలకు మునుపటిలా శ్రద్ధగా చదవటం లేదన్న ఆలోచన ఆమెను మరింత క్రుంగదీయసాగింది.

రవికి రచనా వ్యాసంగం మీద ఆసక్తి రోజు రోజుకీ అధికమవుతోంది. వాస్తవిక జీవితంలోని కఠోరత అనుభవంలోకి వస్తున్నకొలదీ దానినుండి తప్పించుకునే నిమిత్తం ఊహా జగత్తులో విహరించటం ప్రారంభించేడు రవి.

అతని గుండెలో పుట్టెడు దిగులు గూడు కట్టుకుని ఉంది. ఆ ఆవేదన అనేక రూపాలలో అతని కలంద్వారా వెలువడసాగింది. ఆ ఆవేదన కొందరు పాఠకులను ముగ్ధులను చేస్తే మరికొందరి చేత పెదవి విరిపించింది. "పట్టి పెసిమిస్టు" అంటూ కొందరు విమర్శకులు అతనిని గురించి తీవ్రంగా విమర్శించేరు. అలా కొందరతనిని ఆకాశాని కెత్తివేస్తే మరికొందరు అతనిని ఎందుకూ పనికి రాని రచయిత అంటూ పాతాళానికి తోసేసేరు. రచనా రంగంలోకి అడుగు పెట్టిన తరువాత దూషణ భూషణలను రెంటినీ సమంగా స్వీకరించగల మనస్థయిర్యం అతనికి అబ్బింది. అందుకే అందరి అభిప్రాయాలనూ చిరునవ్వుతో వినేవాడు.

6

రవి ఒకరోజున ఉన్నట్టుండి ఒక విషాద వార్తను మోసుకువచ్చేడు. అతను పనిచేస్తున్న కంపెనీ దివాళాతీసేటట్లు ఉన్నదని చాలామంది ఉద్యోగులను 'రిట్రెంచ్' చేసేస్తున్నారట. రిట్రెంచ్ చేయబడే ఉద్యోగులలో 'రవి' కూడా ఒకడు. తరువాతి నెలలోనే రిట్రెంచ్‌మెంట్ ఆర్డర్లు రావచ్చు.

ఆ మాట వింటూ శ్యామల బాధపడవలసినంతగా బాధపడలేదు. "పోన్లెండి. పాడు ఉద్యోగం పోతేపోయింది. ఆ వెధవ గుమస్తా ఉద్యోగం చెయ్యటంకన్నా ఏ ఉద్యోగం లేకుండా ఇంట్లో కూర్చుని హాయిగా బియ్యే పరీక్షలకు చదువుకోవటం మంచిది" అన్నది.

దాంతో రవికి బాగా కోపంవచ్చింది. "నీకు డిగ్రీల సంగతితప్ప మరో ఆలోచనలేదు. రేపు ఏమ్మే ప్యాసయితే మాత్రం ఉద్యోగాలువచ్చి వాళ్లో వాలుతాయా ? అప్పటిదాకా భార్య సంపాదనమీద బ్రతకాల్సిందేనా ?" అన్నాడు.

"ఇప్పుడుమాత్రం భార్య సంపాదనమీద కాక మీ సంపాదనమీద బ్రతుకుతున్నారా? చక్కగా వచ్చిన అవకాశాన్ని వినియోగించుకొమ్మంటే మీకెందుకంత బాధ ?" అన్నది శ్యామలకూడా కోపంగానే.

రవికి షాక్ తిన్నట్లయింది. (ఇంకాఉంది)

ప్రశ్నావళి

— కె. రామలక్ష్మి

కె. వి. ఎస్. మంత్రిపాలెం.

ఒకరి మాటలు విని చీటికి మాటికి చేయి చేసుకునే వారిని ఏమనాలి?

రోగగ్రస్తులు వాళ్లు. తమలో ఉన్న లోపాలను, చేతకానితనాన్ని కప్పిపుచ్చుకుంటూ, తాము అధికులం అనీ, అధారిటీ చెలాయించ కలవారమని నిరూపించుకునే తహతహ— వారినలా— తమ అండన చేరిన ఆడదాని మీద చేయి చేసుకునేలా చేస్తుంది . . . సెక్సాన్ని కొట్టే మగవాడు మరీ థర్డ్ రేట్ మనిషి. మనిషి పుట్టుకే అయినా— మనిషికి ఉండవలసిన సంస్కారం లేనివాడని నా నమ్మకం.

కె. ఏ. ఆర్. భీమునిపట్నం.

నేను మంచి అందమైన అమ్మాయి దొరక్కపోతే పెళ్లి చేసుకోను. ఇప్పటికి ఎనిమిది సంబంధాలు చూశాను. మావాళ్లకి కట్నం కావాలి. నాకు కట్నం అక్కరలేదని. ఎవరు నెగ్గుతారు ?

మీ వాళ్లే! కట్నం తేగల్గిన పిల్ల ఎప్పుడూ అందంగానే ఉంటుందని . . . మీకీపాటికి అర్థం అయివుంటుంది !

మీరేదైనా రాసుకుంటూ కూర్చుంటే— ఆ పూట మీకాయన ఏమైనా సహాయం చేస్తారా?

ఏమైనా చేయవలసిన టైములో నేను రాస్తూ కూర్చోను!

ఎన్. ఆర్. బి. బరంపురం.

సినిమాలకి చక్కని కథలిస్తున్న రచయిత్రులు వారే ఎందుకు మాటలు వ్రాయలేక పోతున్నారు ?

రాయలేకపోవడానికి కారణాలు చాలా ఉంటాయి ! 1. సీరియల్‌లో ఎంత రాస్తే అంత లాభంగా అలవాటైన వారికి— 'సీను'లో చెప్పవలసినదాన్ని ఇమిడ్చి చెప్పడం కష్టం. 2. సినిమాకి డైలాగులు రాయడం— ఏదో రాసిముగించడంలాంటిది కాదు. సినిమా తీస్తున్నంత కాలం చిన్న చిన్న మార్పులు చేర్పులు చేయవలసి రావచ్చు. అందుచేత రచయిత స్థానికంగా ఉండాలి. అది చాలామందికి కుదరదు.

సి. సి. ఎస్. ఆర్. మహబూబ్ నగరు.

నేటి స్త్రీలోకంలో ఒక ధ్యేయంతో మార్గదర్శకంగా నిర్మాణాత్మకంగా రచనలు చేసేది రంగనాయకమ్మగారు ఒక్కరే. మిగతావారంతా అలాంటి ధ్యేయంలో ఎందుకు రాణించుటలేరు ?

ఆమె ధ్యేయం బాగానే ఉంది గాని దారే మార్గదర్శకంగా లేదని భయపడుతున్నారేమో సార్. ఎలా చెప్పగలం?

ఎల్. వి. ఆర్. ఖమ్మం.

ఖచ్చితంగా 27 ఉత్తరాలు రాశాను. ఒక్కదానికి జవాబివ్వలేదు మీ అహంకారం, నిర్లక్ష్యం వల్ల మాలాంటి పాఠకులు ఎలా నష్టపోతున్నారో చూశారా?

పోనీ ఈ సొమ్ము ఖర్చులో లాటరీ టిక్కెట్లు కొనుక్కున్నాననుకోకూడదా తమ్ముడూ! నీ ఉత్తరాలు చూస్తే నవ్వొస్తుంది. వాటినిండా నువ్వు ప్రదర్శించే అహంకారాన్ని, తొందరపాటుని— నలుగురిముందూ పెడితే— ఇంకా నవ్వులపాలవుతావని పూరుకుంటున్నానేగాని, నీలా ఆడనంటే చెప్పు కింద అణిచి ఉంచాలనే— నువ్వంటే నాకెంత ఇష్టమో ఎలా చెప్పను?!

కె. ఎ. జాడి జమాల్‌పూరు (బోధన్)

ప్రఖ్యాత సైంటిస్టు లెవోయిజర్ ఎందుకు ఉరితీయబడ్డాడు?

మీ కాలేజీలో ఉంటే ఎన్‌సైక్లోపిడియా తీసి ఎల్ సంపుటి తీసి యీ పేరు కోసం వెతుకు తమ్ముడూ, విద్యార్థివి. ఆ మాత్రం రిఫరెన్సు పనిచేయటం నీకే మంచిది.

వి. కె. డి. — కాశీబుగ్గ

మనదేశంలో నిరుద్యోగ సమస్యలు తీరే మంచి రోజులు వస్తాయంటారా ?

ఆ ఆశతోనే కదా—యింకా విద్యార్థులు కాలేజీలకి వెళ్ళడం —డిగ్రీల కోసం పోటీపడడం.

జి. ఎస్. — ఏలూరు

ప్రేమ గొప్పదా ? ఆరాధన గొప్పదా ?

ఆరాధనే ప్రేమగా మారుతుంది.

రచన దేవుని వరమా ? మనిషి సాధనవల్ల సాధించవచ్చా ?

చిన్నప్పుడు చదువుకోలేదా ? 'అభ్యాసము కూసు విద్య'అని. . . . రాయగా రాయగా అదే వస్తుంది. ఒకసారి రాయడం వస్తే దానికి మెరుగులు దిద్దుకోవడం —ఏమంత కష్టం కాదు.

జి. డి. ఆర్. నారాయణపేట

ఫుల్‌స్కేపు సైజులో అంటే ఎన్ని తావులు ?

ఫుల్‌స్కేపు అంటేనే తావు! అంటే మామూలు నోటుబుక్కుకి రెట్టింపు సైజు.

కె. ఎం. బి. బెంగుళూరు

తెలుగు అమ్మాయిని కట్నం లేకుండా పెళ్లి చేసుకోవాలని. కాని నా జీతంతో బ్రతక కలమా అని భయం. మావాళ్ళకి నచ్చిన పిల్లని చేసుకుంటే ఆస్తి వస్తుంది. కాని నా మనసు . . .

దీన్నే 'డోలాయమాన' పరిస్థితి అందాం. కొన్నాళ్ళిలా వెధవ మనసు ఊగిసలాడి ఆడి చివరికి ఆస్తిపాస్తులతో వచ్చే అమ్మాయే సర్వవిధాలా నయం అని ఒప్పుకుంటుంది.

వి. ఎస్. ఆర్. — సికింద్రాబాదు

ఆంధ్ర విశ్వవిద్యాలయం యివ్వవలసిన కళాప్రపూర్ణ ను ఆరుగురు మంత్రులుకలిసి సన్మాన సభలో నటుడికి యివ్వడం ఏమిటి ? ఆశ్చర్యంగా లేదూ ?

బహుశా వారు "హాస్య కళా ప్రపూర్ణ" అని యిద్దామనుకున్నారేమో !! మరిచిపోయి వుంటారు.

ఎమ్. వి. ఆర్. పి. — హైద్రాబాదు

మరణించలేక జీవిస్తున్నాను . . . దీనికి కారణం నాకు మనసులేని మనువు జరుగుటయే !

ప్రసాద్‌బాబూ, యీ మాట రాయడానికి పౌరుషంగా లేదుటయ్యా !..... నీకు పెళ్ళిచేసినప్పుడు నీ వయస్సెంత ?! పది నెలల పాపవా?

ఎస్. పి. ఆర్. — నల్లూరుపాలెం

మేము సహాయం చేసిన వారెవ్వరూ మా అవసరానికొక రూపాయి యివ్వలేదు.

ఇవ్వరు అందుకే —ప్రతిఫలాపేక్షతో ఎవరికీ సహాయం చేయకూడదంటారు.

పి. ఎస్. ఎస్. — శ్రీకాకుళం

కే రా. గారూ, ప్రేమకు నిర్వచనం ఏమిటి?

అనిర్వచనీయమైన అనేక విషయాలలో ప్రేమ కూడా ఒకటి. అది అనుభవైకవేద్యమేగాని —ఎంత చెప్పినా తెలియదు.

టి. ఆర్. — శ్రీకాకుళం


డబ్బుంటే గర్వం అంటారు. కాని లేని వాళ్ళు ఎంత మంది గర్వంగాలేరు. అది మనిషినిబట్టి వుంటుంది —ఏమంటారు ?

నిజమే. కాని గొప్పవాడికి గర్వం —సహజం అనుకుంటారు. పేదవాడి గర్వం —బేషజం అంటారు.

కె. వి. — ఏలూరు

దేవుడున్నాడనే అనుకుందాం. ఉన్నా, అతడిని పూజించాలని ఏమన్నా రూలుందా ?

లేదే ! !



ఇంక్‌లెస్ పెన్స్



శంకరం పక్కసీటే రామారావుది. వాళ్లిద్దరూ ఒకే ఆఫీసులో గుమాస్తాలు. వాళ్లని స్నేహితులనడం కంటె కొలీగ్స్ అంటేనే సబబేమో!

ఎంచేతంటే వాళ్లిద్దరికీ, ఒకరిమీద మరొకరికి అనుమానం — బాస్ చేత మంచివాడనిపించుకోవాలని అవతలివాడు ట్రైచేస్తున్నాడేమోనని! ఇద్దరూ ఇంచుమించు ఒకేసారి ఉద్యోగంలో చేరారు. ఇద్దరికీ ఒకటే క్వాలిఫికేషన్స్.

వాళ్లిద్దరూ స్నేహితులు కాకపోయినా పైకి నవ్వుతూ, ఆఫీసులో కాలక్షేపం చేసేందుకు ఏదోఒకటి మాట్లాడుకుంటుంటారు.

ఏదో ఫైలు చూస్తున్న వాడల్లా ఆగి! శంకరం, ''చూశారా, రామారావుగారూ, నే నిన్నాళ్లా ఏమిటో అనుకున్నాను గాని, మా అమ్మాయిని, అల్లుణ్ణి నిన్న ఈమైకా కేసులో పెట్టడం మరచిపోయి ఇంటికెళ్లిపోయానండి. అంతే, మా ఆవిడ ఎక్కడికో ఊరుకెళ్లవలసి వచ్చింది. వీటికి ఎడబాటు కలిగించి నందువల్ల మా దంపతులకు కూడ ఎడబాటు కలిగింది'' అన్నాడు రామారావుతో.

వాస్తవానికి, శంకరానికి పెళ్లయితే అయింది కాని, ఇంకా పిల్లలెవరూ లేరు. మరయితే ఏదో అమ్మాయి, అల్లుడు అంటున్నాడు, కొద్దిగా స్క్రూలూజు కాని కాదు కదా, అంటే అదీకాదు. అతను అమ్మాయి, అల్లుడు అని అంటున్నవి అతనికి వాళ్ల సంస్థ ఇచ్చిన రెండు బాల్ పెన్నులు. అందులో ఒకటి రెడ్డింకుది — మరొకటి బ్లాకింకుది. రెడ్డింకు దాన్ని, తన కూతురుగాను, బ్లాకింకు దాన్ని తన అల్లుడుగానూ వ్యవహరిస్తూ, ప్రతిరోజూ ఆఫీసు విడిచి వెళ్లిపోయే ముందు వాటికి సంబంధించిన మైకా కేసులో రెండూ పెట్టేసి 'జాగ్రత్తగా పడుకోండి' అని చెప్పి వెళ్లిపోతుంటాడు.

శంకరం మాటలు విన్న రామారావుకు నవ్వాగింది కాదు. కాస్సేపు నవ్వి, ''మీరు భలేవారే! పెన్నులు రెండూ విడదీసినంత మాత్రాన, మీకు ఎడబాటు రావట మేమిటండీ ?'' అన్నాడు.

''మీ రట్లా వేళాకోళంగా తీసుకోకండి సార్! నేను నిజంగానే చెబుతున్నాను. ఇట్లా ఇదివరకు రెండు, మూడు సార్లు జరిగినది అబ్జర్వ్‌చేసే చెపుతున్నాను. ఒకసారయితే ఆ రోజు మా ఆవిడ బర్త్‌డే. ఆవిణ్ణి ఏదేని సినిమాకు తీసుకెళ్లి, రాత్రంతా సరదాగా గడపాలనుకుని, ఆ హడావిడిలో మా అమ్మాయిని, అల్లుణ్ణి, ఒకచోట పెట్టటం మరచి వెళ్లిపోయా. అంతే–ఎవరో చుట్టాలొచ్చారు ఆ వాళ మా యింటికి. ఇంక సినిమాలేదూ– సరదాలేదు! నేనివ్వన్నీ అబ్జర్వ్‌చేశానుకాబట్టే ఇంత నిక్కచ్చిగా చెబుతున్నా!'' అన్నాడు శంకరం కొద్ది సీరియస్‌గా

''మీరెన్నైనా చెప్పండి, నేను మాత్రం నమ్మను. ఆ పెన్ను లేమైనా జీవమున్న వస్తువులా ఏమిటి, విడదీస్తే బాధ పడ్డానికి ?'' అన్నాడు రామారావు.

''మీరు నమ్మితే నమ్మండి, లేకపోతే లేదు. కాని జరుగుతున్నది మాత్రం అట్లాగే'' అన్నాడు శంకరం.

'ఏమో, నమ్మలేను' అన్నట్లుగా పోజు పెట్టి, రామారావు తనపనిలో మునిగిపోయాడు.

కొంచెం సేపయిన తరువాత శంకరం కూడ పనిలో పడిపోయాడు

ఆఫీసు ప్యూను కోటయ్య వచ్చి అందరి దగ్గర డబ్బులు వసూలు చేసి, అందరికీ టీ తీసుకువచ్చి యిచ్చాడు.

శంకరం, రామారావు టీ లు త్రాగుతూ మళ్లీ బాతాఖానీలో పడ్డారు.

ఇంక్‌లెస్ పెన్స్

'ఏంటిసార్. విశేషాలు ?'' అడిగాడు శంకరం, రామారావుని.

''విశేషాలేముంటాయి! అవునుకాని. మీరు నిన్న రిలీజయిన 'ఆదర్శ దంపతులు' సినిమా చూశారా?''అడిగాడు రామారావు.

''లేదండి !''అన్నాడు శంకరం.

ఎందుకో అటుగా వెళ్తున్న వాళ్లబాస్, వాళ్ల సంభాషణలు విని, ''శంకరంగారు 'ఆదర్శ దంపతులు' సినిమా చూడ్డ మెందుకండి రామారావుగారూ ! వాళ్ల దంపతులే నిజంగా ఒక ఆదర్శ దంపతులు. అంచేత ఇంక వేరేగా సినిమా చూసి నేర్చుకునేదేముంటుంది ?'' అన్నాడు.

శంకరం నెమ్మదిగా నవ్వుతూ, ''థాంక్స్ సర్!'' అన్నాడు.

రామారావు లేని నవ్వు ముఖం మీదకు తెచ్చుకుంటూ, ''కరెక్టుగా చెప్పారు సార్.'' అన్నాడు వాళ్ల బాస్‌తో.

బాస్ నవ్వుకుంటూ లోపలకు వెళ్లిపోయాడు.

టీ త్రాగటం ముగించి, శంకరం, రామారావు మళ్లీ పనిలో పడిపోయారు. కాని శంకరం మనసు మాత్రం తన భార్య అరుణ మీదకు మళ్లింది 'నిజంగా అరుణ లాటి ఆడది తనకు భార్యగా లభించటం తను ఏ జన్మలో చేసుకున్న పుణ్యమో ! తమ జంటను చూచి చాలమంది ముచ్చట పడతారు. ఒకసారి తమ బాస్ అయితే, ''మీరు విల్స్ వాళ్ల 'మేడ్‌ఫర్ ఈచదర్' కంటెస్ట్‌కు వెళ్లండి ! తప్పకుండా మీ జంటకు ప్రయిజు వస్తుంది !'' అన్నాడు. కాని తనకు సిగరెట్టు కాల్చడమే తెలియదు. ఇంక స్టైలిష్‌గా ఏమి కాలుస్తాడు. ఏమి ప్రయిజు వస్తుంది అని ఊరుకున్నాడు. తమ బాస్ దగ్గరున్న మంచి గుణం అదే — చెడయినా, మంచయినా మనసులో ఉన్నది పైకి అనేస్తాడు. తనకు అరుణతో పెళ్లయినప్పట్నించి ఏవరేజిన రోజుకొకసారేనా అన్నాడు తమ బాస్, ''మీ ఇద్దరు ఒకళ్ల కోసం ఒకరు పుట్టారండి !'' అని.

'లంచ్ అవర్ వచ్చేదాకా అట్లా ఆలోచిస్తూనే ఉన్నాడు శంకరం.

''ఏం గురూగారూ! లంచ్‌కి పోదామా?'' అంటూ పిలిచిన రామారావు పిలుపుతో ఈ లోకంలోకి వచ్చాడు శంకరం.

శంకరం, రామారావు ఒక వీధిలోనే రెండు, మూడిళ్ల తేడాలో ఉంటున్నారు. అంచేత లంచ్‌కు పోయేటప్పుడు కలిసే వెళుతూంటారు.

''ఇవాళ ఇంటిదగ్గర నా వైఫ్ లేదుగా ! అంచేత ఇవాళ్టికి హోటల్లోనే కానిచ్చేస్తాన్లెండి ! మీ రెళ్లండి!'' అన్నాడు శంకరం.

''ఓ – అన్నట్లు ఇందాకా చెప్పారుగా— 'ఎడబాట్లు' వచ్చాయని. అయితే నే వస్తా మరి !'' అంటూ ఇంటికి బయలుదేరాడు రామారావు.

రామారావుకు కూడ పెళ్లయి రెండేళ్లవుతుంది. తమజంటకూడ 'చిలకా గోరింక'ల్లా ఉంటే బాగుండునని రామారావు చాల సార్లు అనుకుంటూంటాడు.

రామారావు ఇంట్లోకి ప్రవేశించేటప్పటికి

అతని భార్య రుక్మిణి మంచం మీద పడుకుని ఏదో పత్రిక తిరగేస్తోంది. పుస్తకంలోంచి తల తిప్పి, "వచ్చారా? ఇవాళ ఒంట్లో కొద్దిగా బద్ధకంగా ఉండి టిఫిన్ ఏమీ చెయ్యలేదండి. ప్లీజ్! కొద్దిగా కాఫీ పెట్టి నాక్కూడ ఇవ్వండి!" అంది.

ఇట్లాంటి మాటలు వినడం రామారావుకు కొత్తకాదు. అసలు ఇంటికి రావడంకన్న ఏ హోటల్లోనో టిఫిను చేసేస్తే బాగుంటుందని రామారావుకు తెలుసు. కాని, ఇంటిదగ్గర పెళ్లాం ఉండికూడ లంచ్‌కు ఇంటికి పోవటంలేదంటే కొలీగ్స్, ఊర్లో వాళ్లు ఏదైనా అనుకుంటారేమోనని వస్తున్నాడు.

చొక్కా తీసి హేంగర్‌కు తగిలించి, వంటగదిలోకి వెళ్లి స్టౌ వెలిగించబోయాడు, కాని అది అంటుకోలేదు — ఎంతసేపు ప్రయత్నించినా. స్టౌ కదిపి చూశాను—కిరసనాయిలు ఉన్నట్లు లేదు.

"రుక్కూ!" పిల్చాడు తన భార్యను.

"దేనికండీ?" అంది రుక్మిణి అవతలి గదిలోంచి.

"ఇందులో కిరసనాయిలు అయిపోయినట్లుంది—కొద్దిగా పోస్తావా?" అన్నాడు రామారావు.

"అబ్బ! కథ మంచిపట్టులో ఉందండీ! మీరే కానిచ్చేదురూ!" అందిరుక్మిణి అవతలిగదిలోంచే.

"ఛ! ఛ! వెధవకొంప!" అని విసుక్కుంటూ స్టౌలో కిరసనాయిలు పోసి వెలిగించాడు రామారావు.

ఎట్లాగో కష్టపడి, నాలుగుసార్లు చేతులు కాల్చుకుని, అయిదు సార్లు 'ఛ! వెధవకొంప!' అనుకొని, కాఫీ చేయటం ముగించి, "కాఫీ తయారయింది—ఇటు తగలడు!" అంటూ పిలిచాడు రుక్మిణిని.

"ప్లీజ్! ఓ కప్పుతో ఇటుతిస్కురండి!" అంది రుక్మిణి.

రామారావుకు ఏం చేయాలో బోధపడటం లేదు. కొద్దిసేపు ఆలోచించి రెండుకప్పులలో కాఫీ తీసుకుని, అవతలిగదిలోకి వెళ్లి తన భార్యకు ఒకటిచ్చి, తను ఒకటి తీసుకుంటూ, రుక్మిణి పడుకున్నమంచంమీదకూర్చున్నాడు.


కొద్దిగా పక్కకు జరుగుతూ, "ఏమిటీ—ఇవాళ ఇంక ఆఫీసుకెళ్లరా ఏం?" అంది రుక్మిణి చిన్నగా, చిలిపిగా నవ్వుతూ.

"అదికాదు రుక్కూ! నీతో ఒక ముఖ్య విషయం మాట్లాడాలి!" అన్నాడు రామారావు నెమ్మదిగా.

"అయితే రెండునిముషాలాగండి! ఈకథ పూర్తి చేసింతర్వాత తాపీగా మాట్లాడుకుందాం!" అంది రుక్మిణి, కాఫీతాగి కప్పు అతని చేతికిస్తూ.

ఇంచుమించు ప్రతిరోజూ జరిగే పనే అయినా, రామారావుకు మతిపోతున్నట్లుంది.

కథ చదవడం ముగించి, పుస్తకం మూసేస్తూ, "ఊఁ! ఇప్పుడు చెప్పండి — ఏమిటో ఆ ముఖ్య విషయం?" కొద్దిగా



మమ్మల్ని గుర్తుపట్టలేకపోతే మాత్రం ఇలా నెంబర్లెయ్యటం ఏం బాలేదుఫాదర్...

ఎగతాళి మిళితమయిన స్వరంతో అడిగింది రుక్మిణి.

"నువ్విది వేళాకోళంగా తీసుకోకు రుక్కూ! నేను సీరియస్‌గా చెబుతున్నాను. ఆ శంకరం వాళ్ల దంపతులను మా బాస్ ప్రతిరోజూ,'మేడ్‌ఫర్ ఈచదర్' అని, 'ఆదర్శ దంపతుల'ని అంటూంటాడు. మనం కూడ అట్లా అనిపించుకోవాలని నా ఉద్దేశం." అన్నాడు రామారావు.

"బాగుందండీ! దీనికా ఇంత పోజు! మొగుడూ పెళ్లాలన్నాక ఏదో సర్దుకుపోవాలి కాని, ఇప్పుడు మనకొచ్చిన లోటేమిటి?" అంది రుక్మిణి, అతని గుండెలమీద చేతులేసి బనీను సర్దుతూ.

"అదికాదు రుక్కూ! మా ఆఫీసులో ఇంతమంది ఉన్నాంకదా! వేరొకళ్ల నెవర్నైనా అట్లా అనచ్చు కదా! ఆ వెధవ శంకరం గాడ్నే ఎందుకనాలి మా బాస్ అని? అందుకే వాడికి మహాగొప్పు! వాడికది లేకుండా చేయాలనే నా ఆరాటం!" అన్నాడు రామారావు.

"ఇదిగో చూడండి! ఎవళ్లో అనుకోవాలని, మనం ఏ పనీ చేయలేము. మనకు చాతనయినట్లు మనం బ్రతుకుదాం!" అంది రుక్మిణి, ప్రక్కన పడేసిన మాగజైన్ మళ్లీ అందుకుంటూ.

'ఇంక లాభంలేదు!' అనుకుంటూ రామారావు చొక్కా వేసుకుని ఆఫీసుకు బయలుదేరాడు.

"ఏమిటి రామారావుగారూ! ఇవాళ ప్రతిరోజు కంటే లేటుచేసేశారు!" అంటూ పలకరించాడు శంకరం, రామారావు ఆఫీసులోకి వస్తూండగానే.

"ఆఁ! ఏముంది?" అని లేనినవ్వునవ్వుతూ వెళ్లి తన సీట్లో కూర్చున్నాడు రామారావు.

'ఇంటిదగ్గర చెప్పినట్లు వినేభార్య వుంది కాబట్టి, ఈ వెధవ శంకరంగాడు టైముకు వస్తూంటాడు. దానికోసం పెద్దగర్వం!' అనుకున్నాడు లోపల రామారావు.

పనైతే ఏదో చేస్తున్నాడు కాని, మనసు మాత్రం మండిపోతోంది రామారావుకు. "ఈవెధవశంకరం వాళ్లనే'ఆదర్శదంపతుల'ని తమ బాస్ ఎందుకనాలి?" ఇదే ఆలోచన అతన్ని తినేస్తోంది.

సాయంత్రం టైమవుతూనే శంకరం సీటులోంచి లేచి, "ఇంటికి వస్తారా రామారావుగారూ!" అని అడిగాడు.

"లేదండీ! ఈ ఫైలు గొడవేదో ఈవాళే చూసేయమన్నాడు బాస్. అంచేత కొంచెం లేటవుతుంది. మీరెళ్లండి!" అన్నాడు రామారావు.

"ఓకే! గుడ్‌నైట్!" అంటూ శంకరం ఆఫీసు బయటకు నడిచాడు.

* * *

మర్నాడు ఉదయం సీట్లో కూర్చుని, తన డ్రాయరు సొరుగు తీసిన శంకరం ఆశ్చర్యపోయాడు—తన రెడ్డింకు, బ్లాకింకు బాల్ పెన్స్, అని పెట్టుకొనే మైకా కేసు పగిలిపోయి ఉన్నాయి!

రామారావింకా ఆఫీసుకు రాలేదు!

భవబంధాలు

(17వ పేజీ తరువాయి)

లేదు. ఏ మాత్రం కూడా మార్పు చెందలేదు. అందర్నీ ఎదిరించి నిలబడింది.

లత స్నేహపూర్వకంగా హెచ్చరించింది.—కాని ఫలించ లేదు.

కేశవయ్య పెద్దరికం నిలబడ లేదు.

కృష్ణమూర్తి వాత్సల్యం పనికి రాలేదు.

ముగ్ధగా వుండే మనోరమ, అమాయకంగా వుండే మనోరమ, తేలికగా గాలిపటంలా కనిపించే మనోరమ స్థిరమూర్తి అయింది. ఛాలెంజీకి నిలబడింది.

"ఇది పాంచజన్యం కథ ఫలితమా?" మాధవి అడిగింది.

"కావచ్చు"

"నేనప్పుడే అనుకున్నాను"

"థాంక్స్"

తాను చేసిన పనికి పాంచజన్యం కథ ఎంతదాకా ప్రాతిపదిక అయివుంటుంది ? మనోరమ చాలాసేపు ఆలోచించింది. సహజంగా ఏర్పడిన పరిస్థితులా లేక పాంచజన్యం కథా... ఈ రెంటిలో ఏది ఎక్కువ అన్న ప్రశ్నకి మనోరమ జవాబివ్వలేదు. ఆ కల రగంపలో తనదారి ఎక్కడనుంచి బయలు దేరి మనోరమకి తెలియదు. తను ఏర్పరచుకున్న ..కి, పాంచజన్యం కథలోని సిద్ధాంతాలకి వర్తమానంలో ఆమెబేరీజు వేసుకునే పరిస్థితిలో లేదు. ఎన్నికచేసుకున్న దారి ముందర వుంది. దాని భవితపై ఆలోచించడం వివేకం. కాని గతాన్ని పునః పరిశీలన చెయ్యడం అవివేకం.

ఇదీ మనోరమ వాదన.

కేశవయ్య తల్లడిల్లి పోయాడు. మనోరమ తప్పుచేస్తున్నదని ఒకవైపు, కుటుంబ సాంప్రదాయాలు మరొకవైపు. ఈ రెంటి మధ్య ఆయన నలిగి పోయాడు.

"ఏమిటమ్మా యిదంతా?"మాధవి ముందువాపోయాడు.

ఆమె మాత్రం ఏం చేస్తుంది ?

వెనకటి గౌరవాన్నిబట్టి మాధవి, తానేదయినా చెయ్యగలనని అనుకుంది. కాని వాస్తవాన్ని చూశాక ఆమెకే నిరాశ వచ్చింది.

"మనమేం చెయ్యలేం"అన్నది కేశవయ్యతో

"ఆ..."అదిరి పడ్డాడు.

కేశవయ్య బెదిరించాడు. లాలించాడు. తాను దూరదేశాలకి పోతానన్నాడు. ఆస్తిలో భాగం యివ్వనన్నాడు. కాని ఆ ముసలాయన తంత్రాలు ఫలించలేదు. ఆయన ఒక విషయం మరిచిపోయాడు. కేశవయ్య బెదరింపులకి ఆధారం ఏమీ లేదు. ఎందుకంటే మనోరమ "ఎదుగుదల"ని ఆయన గమనించలేదు. మనోరమ చదువుకుంది. ఆర్థికస్వాతంత్ర్యం వున్నది. ఇక ఆమె తిరుగుబాటు తనానికి అడ్డేమిటి.

కృష్ణమూర్తి కూడా ఒక సమాధానానికి వచ్చేశాడు.

"అది చిన్నపిల్ల. మంచికో చెడ్డకో ఒక నిర్ణయానికి వచ్చేసింది. దాన్ని మనం నివారించలేక పోతున్నాం. వృథాగా కోపతాపాలు చూపకుండా నాలుగు అక్షింతలువేసి మన పెద్దరికాన్ని నిలుపుకుందాము."

"నోర్మూయ్‌రా పిచ్చిసన్నాసీ. అజ్ఞానంతో అదేదో వాగితే, దానికి తాళం వేస్తానంటావ్? ఎందుకు లొంగదో చూస్తాను." కేశవయ్య భీష్మించుకుని కూర్చున్నాడు. ఆయనలో పాతరక్తం వుంది. ఆ తరం పట్టుదల వుంది.

మనోరమ చలించలేదు.

చలిచీమ కుట్టేదాకా తెలియదు.

ఏర్పాటులన్నీ రహస్యంగా ముగించి, ఆ రాత్రి కుటుంబంలో ఈ విషయం చెప్పింది. తాతయ్యని మాధవి కృష్ణమూర్తులను రిజిష్ట్రారు ఆఫీసుకు

రమ్మని కోరింది.

"పిలవడానికి నీకు సిగ్గులేకపోతే రావడానికి మాకు సిగ్గువున్నదమ్మాయ్. చాల్లే మా మర్యాద యింతదాకా నిలిపావ్ ? ఇక నీపెళ్ళికి రావాలి" కేశవయ్య భగ్గుమన్నాడు.

ఇప్పటిదాకా ఆయన వాత్సల్యాన్ని చూసింది. ఇప్పుడు కోపాన్ని చూసింది.

కళ్ళలో నీళ్ళు తిరిగింది. మాట్లాడకుండా మనోరమ పైకి వెళ్ళిపోయింది.

"మనం కూడ బెదరకొడితే ఎలా తాతయ్యా" కృష్ణమూర్తి జోక్యం చేసుకున్నాడు

కేశవయ్య రుషగా తల ఆడించాడు. తీక్షణంగా చూస్తూ "నీ చెల్లెమ్మ పసికూన కాదురా అబ్బాయ్. మనకే పాఠాలు చెబుతుంది"

తనని నిర్లక్ష్యం చేసినందుకు ఆయన బాధ

మొత్తానికి మనోరమ—చక్రవర్తి దంపతులయ్యారు.

హాపీ క్లబ్బువారు విందు ఏర్పాటు చేశారు.

సంక్షేమశాఖామంత్రి సభని ప్రారంభిస్తూ : "ఈ తరం కొత్తవైపు పరుగులు తియ్యడం, మరో ప్రపంచాన్ని చూపించడం చేస్తోంది' ఇది వాంచనీయం. మనోరమ చేసిన సాహసం పదిమందిని ప్రభావితం చెయ్యగలదని ఆశిస్తున్నాను." సంతోషం వ్యక్తం చేశాడు.

పలువురు హాజరయ్యారు. శుభాకాంక్షలు తెలిపారు.

"పిచ్చిలోపడింది."

"ఆ దొంగవెధవది అదృష్టం."

"లోగుట్టు పెరుమాళ్ల కెరుక."

. . . వగైరా విమర్శలూ, నవ్వులూ కూడా వచ్చినయి. మనోరమ రెంటినీ గమనించింది. మెచ్చుకున్న వారికంటె వెటకారం చేసినవాళ్లే ఎక్కువని గ్రహించింది.

విందు జరుగుతోంది.

మనోరమ ఎవరితోనో మాట్లాడుతోంది. చక్రవర్తి గుమ్మం దగ్గర సిగరెట్ కాలుస్తూ నిలబడ్డాడు. ఇంతలో ఒకపోలీసు ఆఫీసరులోపలికి వచ్చాడు.

చక్రవర్తిని చూసి : "ఏరా దొంగవెధవా ఇక్కడున్నావ్." సాధికారంగా అడిగాడు.

కంపించాడు చక్రవర్తి.

"ఏమిటండీ." ప్రక్కనున్న ఆసామీ అడిగాడు.

పోలీసు ఆఫీసరు నవ్వుతూ, "వీడు మా ఖాతాదారుడులెండి. ఈ మధ్య ఎక్కడా దర్శనంలేదు. ఇక్కడచూస్తే అనుమానం వచ్చింది" మనోరమ కేసి వచ్చాడు.

భర్తని పరిచయం చేసింది, మనోరమ తేరుకుంటూ.

"అలాగా" పొడిగా నవ్వాడు పోలీసు ఆఫీసరు.

అంతమందిలో చక్రవర్తిని తిట్టడం, అవమానించడం, చక్రవర్తి పిల్లిలా నోర్మూసుకునికూర్చోవడం చాల బాధవేసింది మనోరమకి. ఆమెకి కోపం రేగినా బలవంతంగా దిగమింగింది. ఇటువంటి అవమానాలకి అలవాటుపడాలి. ఆవేశ పడటం మంచిదికాదు. చక్రవర్తి గతం సంఘానికి హానిచేసేది.

అందుకే పదిమందికి దుష్టుడయ్యాడు. ఈ నాడు చెడ్డ నుంచి మంచికివస్తున్నాడు. ఇది సంధికాలం ఇక్కడే ఎన్నో పరీక్షలు ఎదురవుతాయి. వాటిని అధిగమిస్తేనే విజయం.

వచ్చేస్తుండగా కారులో అన్నాడు. "నాకు పోలీసులంటే భయం మనో"

"ఎందుకు? తప్పు చెయ్యనివాడి భయంవుండదు"

"ఏమో మరి."

వీళ్లిద్దరూ వచ్చేసరికి కృష్ణమూర్తి—మాధవి ప్రయాణంలో ఉన్నారు. రామయ్య సామానులు టాక్సీలో పెడుతున్నారు. కేశవయ్య గేటు దగ్గర నిలబడిఉన్నాడు.

"వస్తాను మనో. ఉత్తరంరాయి." పొడిగా వీడ్కోలిచ్చింది మాధవి.

కృష్ణమూర్తి నవ్వుతూ చెయ్యి వూపాడు.

టాక్సీ కదిలింది.

"అందరికీ దూరమైపోతున్నాను" అనుకుంది మనోరమ.

ఆ రాత్రి పదింటిదాకా విచారంగా ఆలోచిస్తూనే వుంది. మాధవి కోపంగా వెళ్లిపోవడం బాధగానే వుంది. కేశవయ్య మౌనవ్రతం పట్టాడు. ఇవన్నీ మనోరమని కదిలించివేస్తున్నాయి.

"ఏమిటలా వున్నావ్" చక్రవర్తి భార్య మంచం మీదకి వచ్చాడు.

"ఏం లేదు." మనోరమ మరోవైపుకి తిరిగింది.

"ఏదో వుంది." చక్రవర్తి ఆమెని తనవైపుకి తిప్పుకున్నాడు. తెల్లటి బట్టల్లో పాలరాతిబొమ్మలా వున్న ఆమెని మురిపెంగా ముద్దుపెట్టుకున్నాడు.

"ఛీ. . . ." వదిలించుకునే ప్రయత్నాలుచేసింది.

"ఏం దొంగాడిముద్దు బాగోలేదా ?"

"మంచాడిముద్దు కావాలి"

"అబ్బో ఆశ."

"దురాశకాదు" నవ్వింది.

చక్రవర్తి ఆమెని తనలోకి తీసుకుంటూ : "నేను చాల అదృష్టవంతుణ్ణి మనో. ఇందుకు చాల గర్వంగా ఉన్నది." ఆనందం వ్యక్తం చేశాడు.

* * *

ఆశించిన దానికంటే నెరవేరినది తక్కువగా వుంటే అసంతృప్తి బయలుదేరుతుంది. నిరుత్సాహం జనించడం సామాన్యం. మనోరమ పెళ్లితో ఈ

'గోల' ఎన్నివిధాలచేటు ?

'స్టెనోగ్రాఫర్లు టైపు చేస్తున్నప్పుడు ఎందుకు ఎక్కువ తప్పులు కొడతారు?' అన్న విషయం మీద ఈ మధ్య అమెరికాలో సర్వే జరిగిందట. దీనికి కారణం ఆఫీసుల్లో ఉండే రణగొణ ధ్వనేట. కొంతమంది ఆఫీసుల వాళ్ళు ఇది పని . . . చెవిటి స్టెనోలని నియమిస్తున్నారట. చెవిటి వాళ్ళు అయితే ఎంత గొడవ ఉన్నా వాళ్లకేమీ పట్టదుగా. కానీ, ఆఫీసరు వారు స్టెనోకి ఎలా డిక్టేట్ చేస్తారు? అన్నదే సమస్య.

రకం ఆశాభంగమే చెందాడు కేశవయ్య. మనోరమ మీదికంటే చక్రవర్తిమీద కోపం రేగింది ఆయనకు. అది అమాయకురాలు. వాడే ఏదో మోసగించాడని ఆయన అభిప్రాయం. దానికి సాయం బయట పరిచితులు వేళాకోళాలు ప్రారంభించారు. ఇవన్నీ తట్టుకోవడం అసంభవంగానే తోచాయి.

సరిపడని పరిస్థితులలో అమరడం ఆయనకి బొత్తిగా యిష్టం లేదు. చక్రవర్తి ప్రవర్తన, వ్యక్తిత్వం, వెకిలితనం అన్నీ కంటకింపుగానే కనపడ్డాయి. ఇంట్లో వుండి ఈ అసంతృప్తిని హెచ్చువేయడం వల్ల ఏమీ ఫలితం లేదు.

అందుకే వ్యాపారాన్ని రూపాయిల్లోకి మార్చేసి, కృష్ణమూర్తికి ఉత్తరం రాసి బయలుదేరాడు యాత్రలకని. అలాగయినా మనశ్శాంతి పొందుదామని ఆయన ఉద్దేశం.

ఆ ప్రయాణం హడావిడి చూచి "ఎక్కడికి తాతయ్యా" మనోరమ అడిగింది. "పోపికుండగానే నాలుగు యాత్రలు చేసి వస్తాను." పొడిగా వచ్చింది సమాధానం.

తాతయ్య తనని క్షమించలేదు. కోపగించి యిల్లు వదలి పోతున్నాడు. ఆయన కాళ్ల మీద పడాలనిపించింది. కాని యింతలో మనోరమకి అభిమానం అడ్డు వచ్చింది. ఇందులో తను చేసిన తప్పు ఏముంది ఇంత మంది మాటలు బిగించడానికి? తనకిమాత్రం పౌరుషం లేదా?

కేశవయ్య వెళ్ళి పోయాడు.

కూడా రామయ్యా వెళ్లాడు. "మీరు లేకుండా యిక్కడ వుండను."

మనోరమకి ఉక్రోషం వచ్చింది. "అంతా పొండి. ఇక్కడ ఎవరూ వుండొద్దు. ఏం కనకమ్మా నువ్వూ పోతావా?"

కనకమ్మ మాట్లాడలేదు.

రోజులు గతించి పోతున్నాయి.

చక్రవర్తి పని హాయిగా వుంది. శుభ్రంగా తినడం, అయిదారు సిగరెట్లు పెట్లు కాల్చడం, క్లబ్బులో రమ్మీ ఆడటం, ఓ బ్రాందీ బాటిల్ త్రాగి రాత్రి పదకొండుగంటలకి యింటికి రావడం... యిదీ కార్యక్రమం.

మనోరమ బతిమాలింది. కోప్పడింది. నచ్చచెప్పింది. కాని ఫలితం శూన్యం. చక్రవర్తి ఏమీ లక్ష్యపెట్టలేదు.

"నాకేం. . హాయి . నువ్వు సంపాదిస్తున్నావు. నేను జల్సా చేస్తాను. నేను కూడ కష్టపడటం అనవసరం. "ఇదీ సమాధానం.

మనోరమ దిక్కులు చూస్తోంది.


ఈ మలుపునుంచి తను పొందినదేమిటి? చక్రవర్తికి ఉత్తమ జీవితం యిచ్చి మహాత్ముంగా మార్చాలని చూసింది. అన్నింటికీ నిలబడి సాధించింది. కాని అంచనా వేసుకున్న జీవితం ఆవిరయిపోతున్నది. ఈ చక్రవర్తి కోసం తను ఎన్నో పోగొట్టుకుంది. తాతయ్య దూర తీరాలకి వెళ్ళిపోయాడు. అన్నయ్య వదిన కష్టపెట్టుకున్నారు. మంచి స్నేహితురాలు లతకూడా దూరంగా వుంటోంది,

భరించలేని అవమానాలు పొందుతోంది. బాగా

ధర్మపథం. వ్యర్థమైన ఉపాసన. బులుసు వేంకటరమణయ్య

ఉపాసన అంటే భగవంతుని పూజించుట. భగవదుపాసకులలో రెండు తరగతుల వారున్నారు. ఒక తెగవారు నిరాడంబరంగా నిస్స్వార్థంగా భగవంతుని పూజిస్తారు. ఇంకొక తెగవారు ఎంతో ఆర్భాటంగా ఎక్కువ సొమ్ము ఖర్చుచేసి, విలువైన వస్తువులూ, రకరకాల పరిమళ పుష్పాలు తెప్పించి, పది మందినీ పిలిపించి, దేవునికి నివేదించిన భక్ష్య భోజ్యాదులతో వారిని తృప్తిపొందించి, ఆ వచ్చినవారివల్ల "ఎంత గొప్ప భక్తులో ?" అని మెప్పు పొందుతారు. ఆ విధంగా మెచ్చుకున్నప్పుడే ఆ ఉపాసకులకు ఎక్కువ తృప్తి కలుగుతుంది. వారు కీర్తి ప్రతిష్ఠలకోసమే ఎక్కువ తాపత్రయపడుతారు. వారి పూజలు లౌకిక విషయాలకు అతీతములు కావు. అందువల్ల అట్టి భగవత్కైంకర్యం వ్యర్థమే అవుతుంది.

ఒక కర్షకుడు తన మడిలో చెరకును నాటినా డనుకుందాము. చెరకుతోటకు నీరు సమృద్ధిగా కావాలి. ఆ సమీపంలో ఉన్న ఒక చెరువునుండి ఒక కాలువ తీసి, దాని మూలంగా ఆ తోటకు నీరు పెట్టవలసి యున్నది. అతడు ఆ రీతిగానే కాలువతీసి, పగలంతా కష్టపడి ఆ కాలువగుండా నీటిని ప్రవహింపజేశాడు. సాయంకాలానికి చెరకు తోటనిండుగా నీరు ఉంటుందని తన శ్రమకు



తగిన ఫలం ఉంటుందని తృప్తిపడ్డాడు తీరా వచ్చి, సాయంకాలం చూసేసరికి ఆ చెరకు తోటలో ఒక్క చుక్క అయినా నీరు కనబడ లేదు. అతనిగుండె గుభేలుమన్నది. నీరు ఏమయిపోయినట్లు? అని పరిశీలించి చూడగా కాలువ గట్టులకు ఉన్న ఎలుక కన్నములనుండి నీరు బయటికి పోయినట్లు తెలిసింది. తిన్నగా కాలువనుండి ప్రవహించనందున చెరకుతోటకు నీరు చేరలేదు. ఈ విధంగా ఆ రైతు పడిన శ్రమ అంతా నిరుపయోగమైపోయింది.

కీర్తి ప్రతిష్ఠలకోసం పడే తాపత్రయాలు కాలువకు ఉన్న ఎలుక కన్నములవంటివి. ఆర్భాటంగా చేసే పూజావిధానం కాలువ వంటిది. అందువల్లనే రైతువలెనే భగవదుపాసకుడు చేసే ప్రయత్నం వ్యర్థమవుతున్నది.

కీర్తి ప్రతిష్ఠలకోసం, నలుగురి మెప్పు కోసం భగవదుపాసన చేస్తే ప్రయోజనం ఉండదు నిరాడంబరంగా, ఎట్టి కోరికలు లేకుండా చేయునట్టిదే ఉచితమైనదిగా ఉంటుంది. ●

పరిచితులు 'దొంగగారు' ఏం చేస్తున్నారు అంటూ వేళాకోళాలు, చివరికి నర్సులు కంపౌండర్లు కూడ వెనకటి గౌరవాన్ని చూపించడం లేదు. తన వెనక ఎంతో అపహాస్యంగా మాట్లాడుతున్నారు. పేషంట్లు కూడ తగ్గి పోయారు. సమాజంలో తన స్థానం దిగజారి పోయింది. నలుగురిలోను చులకనయి పోయింది.

ఇవన్నీ ఒక వైపు— ఎంచుకున్న చక్రవర్తి జీవితం మరొక వైపు.

చీకటి— చీకటి.

వెలుగును అంతా ఆర్పుకుని చీకటిని స్వీకరించింది. చక్రవర్తి కోసం తను చేసిన త్యాగం, సాహసం అన్నీ బూడిదలో పోసిన పన్నీరయినాయి.

దీని కోసమా ఎదురు చూసి?

మనోరమలో ఉత్సాహం నశించింది. వెనకటి చలాకీతనం మృగ్యమయింది. తనగది దాటి రావడం లేదు. బయటి ప్రపంచంలోకి రావడానికి భయపడుతున్నది. ప్రాక్టీసునంతా వదిలేసింది.

ఓ మధ్యాహ్నం భోజనానికి క్రిందకి దిగి వచ్చింది. హాల్లో పది మంది దాకా వున్నారు. చక్రవర్తి వున్నాడు. అంతా నవ్వుతూ ఉషారుగా వున్నారు. మనోరమకి వాళ్ల మీద సదభిప్రాయం కలుగ లేదు. సంస్కారం లేని మనుషులు క్రింద కనిపించారు. వెంటనే

భవబంధాలు

వంటింటిలోకి వెళ్లి పోయింది.

"కనకమ్మా పది మందికి వంట చెయ్యి" చక్రవర్తి లోపలికి వచ్చాడు.

"ఎవరు వాళ్ళు?" నిశితంగా ప్రశ్నించింది.

"స్నేహితులు."

"నైలు బాపతా." కసి ధ్వనించింది.

"నీ కనవసరం" మగతనం కనపడింది.

చక్రవర్తి వెళుతున్నవైపు చూసి కనకమ్మ కేసి తిరిగింది. "నువ్వేం చెయ్యనక్కరలేదు. మాట్లాడకూరుకో. ఇలాంటి వెధవలకి విందులు తక్కువ వచ్చాయి."

"ఎలాగమ్మా. నా మీద విరుచుకు పడతాడేమో."

"భోజనంచేసి, సాయంత్రం దాకా ఎక్కడికయినాపో."

మనోరమ ఏదో యాంత్రికంగా భోజనం ముగించి మేడమీదకి వెళ్లింది. రేడియో ఆన్ చేసి మంచం మీద పడుకుంది [illegible]విస్తూ.

అరగంటలో చక్రవర్తి వచ్చాడు కోపంగా "ఎక్కడ చచ్చింది కనకమ్మ"

"ఏమో."

"నువ్వే పంపించి వుంటావ్. నలుగురిలో అవమానం చేశావ్."

వెటకారంగా నవ్వింది "దొంగలకి కూడా అవమానం వుందన్నమాట."

"నోర్ముయ్" వళ్ళు తెలియని ఆవేశంతో దగ్గరగావచ్చి అంతలోనే ఆగిపోయాడు. మనోరమని అసహ్యంగా చూస్తూ బయటికి వచ్చాడు.

నలుగురిలోను తను అదృష్టవంతుడని, తన జీవితం గురించి గొప్పగా చెప్పుకున్నాడు. విందుకి అందరినీ వుండమన్నాడు. ఇప్పుడెలా ? పొమ్మంటే నలుగురూ గేలిచేయరూ ? చక్రవర్తి క్రిందకివచ్చి హోటల్‌కి ఫోన్ చేశాడు.

"పదిమందికి లంచ్ ఏర్పాటు చెయ్యండి" అంటూ.

చక్రవర్తి స్నేహితులు సామాన్యులు కారు. శుభ్రంగా భోజనంచేసి కిళ్లీలు బిగించారు. తమతో చక్రవర్తిని కూడ రమ్మని కోరారు.

"ఎక్కడికి ?" విస్మయంగా అడిగాడు.

జోగినాథం కారాకిళ్లీ నముల్తూ : "ఏం తెలియనట్లు నాటకమాడకురా బాబూ. మనమంతా ఎన్ని దొంగతనాలు కంబైండ్‌గా చెయ్యలేదు ? కేవల్‌సింగ్ నగల కొట్టుపని పడదామని వచ్చాం. ఇంతలో నువ్వు కనిపించావ్" చెప్పాడు.

చక్రవర్తి ఒప్పుకోలేదు.

"ఏంట్రా పెళ్ళానికి భయపడి చస్తున్నావ్"

రాంబాబుజోకు విసిరాడు.

అంతా నవ్వారు.

చక్రవర్తిలో పౌరుషం విజృంభించింది. "అయితే నడవండి."

ఈ మధ్య ఎక్స్పీరియన్స్ లేక చక్రవర్తి అదోలా ఉంటున్నాడు. దీనితో ఉత్సాహం బయలు దేరింది. తను ఏర్పరుచుకున్న కొత్త ప్రపంచం, మనోరమకి చేసిన వాగ్దానాలూ అన్నీ మరచిపోయి, క్షణికావేశంలో పాత జీవితాన్ని అందుకున్నాడు.

నాలుగున్నరకి మనోరమ నిద్రలేచింది.హాల్లోకివచ్చి కూర్చుంది. ఇంతలో కనకమ్మ టీ తీసుకువచ్చింది.

"చక్రవర్తి ఏడి ?"

తెలియదంది కనకమ్మ.

రిక్షా దిగిలతలోపలకి వచ్చింది.మనోరమ సంతోషంగా చెయ్యి ఊపింది. ఆమెనిచూసి నెలకిపైగా అయింది.

"నీకూ్క్కడ విషమయి పోయాననేమాట"నిష్ఠూరంగా అడిగింది మనోరమ.

"చ. . . చ . . . ఖాళీ లేక రావడం లేదే."

ఇద్దరూ టీ త్రాగి మేడ ఎక్కారు.

"ఏమిటలా నీరసంగా వున్నావ్ ?" అప్యాయంగా అడిగింది లత.

"ఏముంది ?"

"ఏదో వుందిలే. చక్రవర్తి ఎలా వుంటున్నాడు"

లత ధోరణి చూసి చల్లబడింది మనోరమ. వ్యంగ్యం లేదని తెలిశాకా సర్వం చెప్పింది. వర్తమానంలోని సమస్యలు అన్నీ వివరించింది.

"తప్పు చేశానేమో లతా! చక్రవర్తి విషయంలో నా అంచనాలు తప్పయ్యాయి. జల్సాగా తిని తిరగడం, క్లబ్బులో తందనాలు ఆడటం తప్ప, మనిషిగా బ్రతకడం లేదు. బాధ్యతగా జీవించడంలేదు. ఇంత మందిని దూరం చేసుకుని నేను చేసిన ఘనకార్యం యిది" లత ఒడిలో విషాద తీవ్రతచేత వాలిపోయింది.

లత లేవనెత్తింది. తన చేతులతో ఆమె కన్నీరు తుడుస్తూ, "ఈ దశలో ఆ భావం రాకూడదు మనో. లోకం నువ్వు వోడిపోయావంటుంది. ఎంచుకున్న జీవితం ఎదురు తిరిగినప్పుడు మచ్చిక చేసుకొని మలచుకోవాలి. ఈ అసంతృప్తివల్ల నీకేం ఉపయోగంలేదు." వోదార్చింది.

సోము పైకివచ్చాడు పరుగెత్తుకుంటూ.

"ఏరా ?"

"పోలీసులు. . . వచ్చారండి."

ఇద్దరూ క్రిందకి దిగారు.

కానిస్టేబుల్ విష్‌చేసి చెప్పాడు. "చక్రవర్తిని అరెస్టు చేశాము."

అదిరి పడింది మనోరమ : "ఏం ?"

"కేవల్‌సింగ్ పగలకొట్టు చోరీలో."

మధ్యాహ్నం సంఘటనలన్నీ జ్ఞాపకం వచ్చాయి వాటి నుంచి తేరుకుంటూ "నేను వోడిపోయాను లతా" అన్నది నిర్వేదంగా.

"ముందర అసలు విషయం చూడు"లతధైర్యం చెప్పింది.

* * *

వెయ్యి రూపాయల ఖర్చుతో చక్రవర్తి బయటికి వచ్చాడు. జరిగినదానికి పశ్చాత్తాపం అతడి ముఖంలో కనబడుతున్నది.

"నీకు ఈ జీవితమే సుఖంగా ఉంటే యిక్కడ్నుంచిపో నలుగురిలో నన్ను అపహాస్యం చెయ్యకు. దొంగలాగే బ్రతికి, దొంగలాగే చచ్చిపో" చక్రవర్తి రాగానే ఆవేశంగా విరుచుకుపడింది.

చక్రవర్తి ప్రాధేయపూర్వకంగా అన్నాడు "నను క్షమించు మనో. నాలో ఏదో బలహీనత ఆవరించి ఆక్షణంలో అల్లానడిపించింది. అది పునరావృతం కాకుండా జాగ్రత్తపడతాను."

"సీతో జీవితం పంచుకోవడం నేరమయితే, దానికిది శిక్ష" మనోరమ నేత్రాలు సజలమయ్యాయి చక్రవర్తిని చూస్తూంటే హృదయం భగ్నమంటోంది.

ఆమె కోపం తగ్గేదాకా చక్రవర్తి ఇల్లుకదలలేదు. తనలోని మార్పు భార్య గమనించాలని తాపత్రయ పడ్డాడు.

"ఫర్వాలేదు." మనోరమ గుర్తింపు లభించింది

ఇద్దరిమధ్య ఎడం క్రమంగా తగ్గుముఖంపట్టింది చక్రవర్తి ఆత్మ సంస్కారానికి మిక్కిలి పాటుపడ్డాడు. ఆతని ధ్యేయం మనోరమ మెప్పుపొందడమే. అతడి మనస్తత్వంలో కూడా మార్పుకలిగింది. మనోరమని పెళ్లి చేసుకున్న కొత్తలో ఆమె మీద మోజు తప్పమరేంలేదు. తనగురించి కూడా పెద్దగా ఆలోచించుకోలేదు. తనజీవితాన్ని సరిదిద్దుకోవాలన్న ఉత్సాహం కూడా అతడిలో కల్గలేదు. తను సాధించిన ఘనవిజయ గర్వంలో బ్రతికాడు.

క్రమేణా జీవితం తెలియ , అందులోని మంచి చెడ్డలు తెలియసాగాయి. మనోరమ చేసిన త్యాగం, ఆమె పొందుతున్న క్షోభ గుర్తించాడు.

"సీతో జీవితం పంచు. . ." ఆ వాక్యమే మార్మోగుతోంది.

చక్రవర్తి లారీట్రాన్సుపోర్టులో గుమస్తాగా చేరాడు. ప్రొద్దుటే పోయి రాత్రి తొమ్మిదింటికి రావడం. పనిఎక్కువయినా యిప్పుడు అతడికి సంతృప్తిగా ఉంది. మనోరమ మీద ఆర్థికంగా ఆధారపడనక్కరలేదన్న ధీమాఒకటి, ఆమెయొక్క అనురాగం లభిస్తుందన్న గర్వమొకటి 'ఆ కష్టాన్ని' తెలియనివ్వలేదు.

ప్రశాంతత చేరుకోవడంవల్ల, మనోరమ తెప్పరిల్లింది.

మామూలుగా హాస్పటల్‌కి పోయి వస్తోంది.

చక్రవర్తి తన మొదటి జీవితం భార్యకిచ్చాడు.

అతడిలో ఉత్సాహం. ఆమెలో వెలుగు.

ఆరు నెలలు గడిచి పోయాయి.

మాధవికి ఉత్తరం పోస్టుచేసింది.

"వదినా !

వైకుంఠ పాళిలో చిన్న చిన్నపాములు మింగినా తర్వాతనిచ్చెనలే దొరికాయి. చక్రవర్తి సమాజంలో స్థిరపడగలిగాడు. ఈ మధ్యే స్వంతంగా లారీట్రాన్సుపోర్టు కంపెనీపెట్టాడు. ఆ బిజినెస్‌లోపడి బిజీగా వుంటున్నాడు. కాలానికి ఎదురు నిలబడినా, విజయం సాధించినందుకు సంతోషంగావుంది. అన్నయ్య,నువ్వు ఒకసారివచ్చి వెళ్లవలసింది. రాతయ్య సమాచారం వ్రాయవలయును.

ష.రా. త్వరలో ఉయ్యాల

మనోరమ."

(అయిపోయింది.)



అడుగడుగు దండాలు :

"అడుగడుగు దండాల వాడా? వడ్డి కాసుల వాడా? పొర్లు దండాలవాడా?"అని మనం వెంకటేశ్వరుణ్ణి మొక్కుకోడం, పూర్వం మెట్లమీద నుంచి ఎక్కేవారు ఈ నినాదాలు చేయడం మనకు తెలిసినవే. కాని, ఈ నినాదాలు మన రాజధానిలో పేవ్‌మెంట్‌ల మీద నడిచేవారికి అప్రయత్నంగానే అనుభవానికి వస్తాయి. ప్రధాన వీధులలో ఎక్కడ పేవ్‌మెంట్లమీదనన్నా నడవండి. రాళ్ళుఎడువు కొని అడుగుడుగు దండాలు పొర్లు దండాలు పెట్టవలసిందే. నగరానికి మకుటాయమానమైన ఆబిడ్ సర్కిల్ నాలుగు వైపు బాటల పేవ్‌మెంట్లు చూడండి. రంపంపండ్లలాగా లేచివుంటాయి బండలు. ఏదో పాపం చేసిన వారిని రంపపుకోతపెడతారట నరకంలో. ఆ పాపం చేశారో ఏమో ఏజన్మలోనో—ఏ జన్మలోనో ఎందుకు ఈ జన్మలోనే అనుకుందాము.—ఈ రంపం పండ్లలో పడి పొర్లు దండాలు పెట్టవలసిందే. అధికారానికి ఆటపట్టు సచివాగ్రణులు నిరంతరం సంచరించే అయిన సెక్రటేరియట్ —సచివాలయం — ఇరుగు పొరుగు పేవ్‌మెంట్లు చూడండి. బండలు లేచివున్నవి, విరిగి పడివున్నవి, గుంతలు పడివున్నవి, ఏ విద్యుత్కార్మికులో నిర్భయంగా తవ్వితూసి బండలు పరవక విడిచినవి —ఇలా ఎన్నో వున్నాయి. "ఏ పేవ్‌మెంటు చరిత్ర చూచినా, ఏమున్నది గర్వకారణం?"దీనికి తోడు బంగారానికి తావి అబ్బినట్టు రాత్రిళ్ళు దీపాలులేక పేవ్‌మెంట్లపై జరిగే ప్రమాదాలు చెప్పనక్కర లేదు. రామ్ కోటీనుండి చేనేత వస్త్రాలయానికి వెళ్ళేదారిని ఏ రాత్రన్నా చూడండి దీపాలు వుంటే ఒట్టు. అక్కడ వోల్డ్ ఎం. ఎల్. ఏ. క్వార్టర్సుకు వెళ్ళేదారి. కాచిగూడాకు వెళ్ళేదారికలిసే చోటన్నా దీపాలు వుండద్దా? వుండొద్దా అంటే, చాలాచోట్ల వుండాలి, లేవు మరి ! ఆబిద్‌రోడ్‌లో తాజ్‌మహల్ హొటల్ ప్రాంతం దాటాక నిజాం కాలేజి వరకు అంధకారం వుండనే వుంటుంది రాత్రిళ్ళు. చీకట్లోనే వెల్తురు వుందంటారుగా

హైదరాబాద్ నోట్ బుక్

శాస్త్రజ్ఞులు. ఆ వెల్తురే పాదచారులకు కరదీపిక అవుతున్నది. కాళిదాసు వర్ణించినట్టు రాత్రిళ్ళు సంచరించేవారికి మరెవరైనా మార్గదర్శకులైతే బాగుండును ?

కాళిదాస జయంతి :

సురభారతి డిశంబర్ మూడవ వారం సారస్వత పరిషత్తులో జరిపిన కాళిదాస జయంతి విశిష్టమని చెప్పక తప్పదు. సంప్రదాయం ప్రకారం ఆంధ్రాంగ్ల సంస్కృతాలలో ప్రసంగించిన విద్వాంసులు చాలా కొత్త విషయాలు చెప్పారు. తెలుగులో ప్రసంగించిన ఆచార్య డాక్టర్ బిరుదు రాజు రామరాజు తమ ప్రసంగంలో కాళిదాసుని రచనలలోని మనుష్యేతర చేతనాచేతన పాత్రలను గురించి కొత్త వెలుగు ప్రసరింప జేశారు. కాళిదాసు శాకుంతలంలో అంగుళీయకంతో తెచ్చిన నాటకీయతను, అంగుళీయకం, శకుంతులా దుష్యంతుల ప్రథమ సమాగమానికి, చివరన పునస్సమాగమానికి ఎలా కారణమై సౌందర్యం విరజిమ్మినదీ గర్భమంథరగమన అయిన చింక శకుంతలకు జరుగనున్న అశుభాన్ని ఎలా సూచించినదీ,దుష్యం కుంతలాదులను ఉపసర్పించడానికి కారణమైన తుమ్మెద చివర ఎలా కరుణ పాత్రమైనదీ వివరిస్తూ, నాటకకళలో కాళిదాసు సిద్ధహస్తతను నిపులీకరించారు. శ్రీ కృష్ణన్ ఆంగ్లంలో ప్రసంగిస్తూ, కాళిదాసు సంగీతవైదుష్యాన్ని వివరించారు. కాళిదాసు తరచు అనువర్ణనలలో వివరించిన మారుతరంధ్ర పూర్ణకీచకాలు, వనదేవతా సంగీతాలు మొదలయినవి ఒకప్పుడు భారత,దేశంమొదలు జపానువరకు వ్యాపించిన 'అయోనియన్' వాద్యమని సోదాహరణంగా తెలిపారు. సంస్కృతంలో ప్రసంగించిన శ్రీ గోపాల్‌రెడ్డి కాళిదాసు తన రచనలో వర్ణించిన వర్ణవ్యవస్థను, వైదిక శ్రద్ధను క్షత్రియుల బాధ్యతను విశదీకరించారు.

ఉపశ్రుతి :

"కురుక్షేత్రం చూచి వచ్చానండి!"అన్నాడు నా మిత్రుడొకడు, అక్కడ జరిగిన ప్రాచ్యవిద్వత్సభలో పాల్గొని తిరిగి వచ్చి. "అంత దూరం ఎందుకు వెళ్ళారు? మన రాష్ట్రం ప్రతి దానికీ కురుక్షేత్రమేగా?"అన్నారు మా మాటలు వింటున్న ఒక పెద్ద మనిషి.

— తిరుమల రామచంద్ర.

అవీ - ఇవీ - అన్నీ


గుంటూరు వక్తృత్వపు పోటీలు

గుంటూరు, హిందూ కళాశాల వక్తృత్వ సంఘం, ఆంధ్రప్రదేశ్ యువజన కార్యకలాపాల డైరెక్టరేటు సంయుక్తంగా సర్దార్‌వల్లభాయ్ పటేల్ శతజయంతి రాష్ట్రస్థాయీ అంతర్ కళాశాలా వక్తృత్వ పోటీలు, ఇంగ్లీషు, తెలుగు భాషలలో డిశంబరు 9, 10 తేదీలలో గుంటూరు హిందూ కళాశాలలో ఏడవసారి శ్రీ జి. ఎస్.మూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పోటీలలో రాష్ట్రంలోని ఆంధ్ర, శ్రీ వేంకటేశ్వర, ఉస్మానియా విశ్వవిద్యాలయాలకు చెందిన 33 కళాశాలలు పాల్గొన్నాయి. ఆంధ్రప్రదేశ్ యువజన కార్యకలాపాల డైరెక్టర్ శ్రీ బి. నాగేశ్వరరావు పోటీలను ప్రారంభించారు. వక్త శ్రీధన్‌కి వక్తృత్వ సంఘం సన్మానంజరిపింది. విజేతలకు రోలింగ్ ట్రోఫీలు, షీల్డులు, వ్యక్తిగత బహుమతులు, యోగ్యతా పత్రాలను శ్రీమతి కె.సావిత్రి, గుంటూరు జిల్లా విద్యాశాఖాధికారి బహూకరించారు. వాల్తేరు ఆంధ్రాయూనివర్శిటీ కాలేజీఆఫ్‌సైన్స్ అండ్ టెక్నాలజీకి చెందిన శ్రీ ఎ. కె. సేన్‌గుప్త ఇంగ్లీషులో వరుసగా రెండవసారి కూడా ఉత్తమ వక్త బహుమతిని గెల్చుకొన్నాడు. గుంటూరు హిందూ కాలేజీకి చెందిన శ్రీ సి. సత్యనారాయణ తెలుగులో ఉత్తమవక్త బహుమతిని గెల్చుకొన్నాడు. చీరాల వి.ఆర్.ఎస్ అండ్ వై. ఆర్. ఎస్. కాలేజికి చెందిన కుమారి వైష్ణవికి ఇంగ్లీషులోను, తిరుపతి శ్రీ పద్మావతిమహిళా కళాశాలకే చెందిన కుమారి వత్సలకు తెలుగులోను ఉత్తమ మహిళా వక్త బహుమతులు లభించేయి. గుంటూరు ఎ. సి. కాలేజీకి ఇంగ్లీషులోను, గుంటూరు మెడికల్ కాలేజీకి తెలుగులోను ఉత్తమటీము బహుమతులు లభించేయి.

గుంటూరు వైద్య కళాశాలకు చెందిన శ్రీ ఎస్. జయప్రకాశ్ నారాయణ్‌కు ఇంగ్లీషులో ప్రత్యేక బహుమతి, తెలుగులో ద్వితీయ ఉత్తమ వక్త బహుమతి తెలుగులో ఉత్తమ టీము బహుమతితో పాటు లభించాయి.



నేవీలో 1974 సం. జె. ఎన్. ఆఫీసర్సు నేవీ రాణీగా కిరీటము ధరించిన తదుపరి శ్రీ ఎఫ్.ఇ. పాటన్‌వాలా మరియు భారతపశ్చిమ నౌకాదళపు సి. ఎస్. సి. వైస్ ఎడ్మిరల్ జె. కర్‌సెట్జీలతో కుమారి ఇందిరా బ్రెడే మేయర్‌ను చూడవచ్చును.



రైల్వే మంత్రి శ్రీ లలిత నారాయణ్ మిశ్రా దుర్మరణం


బీహార్‌లోని సమస్తిపూర్‌లో ఈ నెల రెండవ తేదీన జరిగిన బాంబు దాడిలో గాయపడిన రైల్వే మంత్రి శ్రీ లలిత్ నారాయణ్ మిశ్రా 3వ తేదీ ఉదయం దానాపూర్ రైల్వే ఆస్పత్రిలో కన్నుమూశారు.

ఈ బాంబు దాడిలో మరికొందరు మరణించారు. 27 మంది గాయపడ్డారు.

శ్రీ మిశ్రా మృతికి దేశంలోని కాంగ్రెసు, కాంగ్రెసేతర నాయకులందరూ విభ్రాంతిని, విచారాన్ని, ఆందోళనను వ్యక్తం చేశారు. శ్రీ మిశ్రా దేశభక్తులు, స్వాతంత్ర్య సమర యోధులు, కార్యదక్షులు.



ఆంగ్ల వక్తృత్వ పోటీలో బహుమతి గెల్చుకున్న ఎ.కె. సేన్‌గుప్తా పురస్కారం అందుకొంటున్న దృశ్యం.



మీకు సంతానం లేదా ?



ఆపరేషన్, యితర వైద్య చికిత్సలచె నిరాశ చెందిన సోదరీమణు లనేకులు మా సలహాలచే సంతాన వంతులయి యిచ్చిన యోగ్య పత్రములు గలవు. స్త్రీ పురుష వంధ్యాదోష నిపుణులు.

ఉచిత వివరములకు

శ్రీ నాగార్జున మూలిక కుటీరం

రైల్వేస్టేషన్ వద్ద, రామాలయం వీధి,

తెనాలి – 2.

WHEN NATURE FAILS

HNew Super eight — మరింతఎత్తు,పొడుగు కాగలరు (2నుండి 8అం. వరకు పూచీ)

For Super Heightness

మీారు పొడుగు పెరగ దలచుకుంటే ప్రపంచప్రఖ్యాతి పొందిన మా హైటెక్స్ HYTEX ఔషధాన్ని వాడండి. వయోపరిమితిలేదు. స్త్రీలు, పురుషులు కూడా పుచ్చుకోవచ్చు. HYTEX is a great **name and meant for popular people.** వెల: బుడ్డి 1 కి (20 Tabs) Rs. 3-75. పోస్టేజి అదనం. 3 Phails (60 Tabs) Rs. 11-25. Postage free.

SCIENCE HAS SOLVED THE PROBLEMS

STOP GREY HAIR — పిన్నవారుగా అగుపించండి. మీారు పిన్న వారైనట్లే మీాకుఅనిపిస్తుంది. (Feel) Unobtainable anywhere else in the world. సంవత్సరాలుగా జరిపిన పరిశోధన ఫలితమైన బాల్ కాలా తేల్ BAL KALA TEL Brilliantine Hair Colour అద్భుతముగ తెల్లజుట్టును శాశ్వతంగా వేళ్ల నుండి నల్లబడేట్లు చేస్తుంది. వెల: బుడ్డి 1కి Rs. 3 only. పోస్టేజి అదనం. 3బుడ్లు Rs. 7-50 పోస్టేజి ఉచితం. తల తెల్లగాగాని, రంగువేసినట్లుగాని అగుపించదు. షరా: ఉత్తరాలుఇంగ్లీషులో వ్రాయుండి.

M/S. VICTORIA COMMERCIAL COY,
A.M.W. (1/75) Flat Door No. 3883X,
Beat No. 1, Ambala Cantt-133001 (N.I.)

ప్రతిరోజూ వెలువడే
శీర్షికలకు తాజా వార్తలకు
ఆంధ్రపత్రిక దినపత్రిక చదవండి !

KANTA CHAP

త్వరపడండి !

మార్కెట్టులో అన్ని రకముల వస్త్రాల ధరలు పెరిగినవి. ఇంకా పెరుగుచునే వున్నవి. కాని బొంబేడయింగ్ మిల్లువారు చాలావరకు కాటన్ వస్త్రాలపై లోగడ డిస్కౌంటు చేసిన రేట్లకే నిర్ణయించినారు. రేట్లు పెరగకముందే మా అభిమానులందరూ, యీా సదవకాశమును వినియోగించుకొని, మీ ఇంటి అవసరాలకు సరిపోవు అన్నిరకముల వస్త్రాలు ఖరీదుచేసి, డబ్బును పొదుపు చేసుకొన వలసిందిగా కోరుచున్నాము.

ఇట్లు

బొంబేడయింగ్ షోరూమ్

శ్రీ లక్ష్మి

[శ్రీలక్ష్మి క్లాత్ స్టోర్సు బిల్డింగ్ పైన]

కొత్తగూడెం.

B. A. F.

"నూతన సంవత్సర శుభాకాంక్షలు"

[యావదాంధ్రా ప్రఖ్యాతి గాంచి గొప్ప క్రమశిక్షణతో మైసూరు మాజీ సైనిక ఉద్యోగులచే నడుప బడుచున్న సంస్థ. H. O : మైసూరు. B. O : కాకినాడ]

టాగూరు కాన్వెంటు హైస్కూలు

(రిజిస్టర్డు)

(ఆంధ్రా గవర్నమెంటు వారిచే ఆమోదింపబడినది)

(1వ తరగతి నుండి 10వ తరగతి వరకు)

గాంధీనగరం :: కాకినాడ

మా పాఠశాలలో చదువుచున్న విద్యార్థి విద్యార్థునుల తల్లి తండ్రులకు వివిధ ప్రాంతముల నుండి వచ్చి మా హాస్టలులో చదువుచున్న విద్యార్థుల తల్లి తండ్రులకు, మా సంస్థ అభివృద్ధికి పూర్తి ప్రోత్సాహమిస్తున్న యావదాంధ్రా ప్రజలకు మా హృదయపూర్వక నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియచేయుచున్నాము.

పంధారీ హల్వా

— దీనిని ఎక్కువగా రాజస్థాన్‌పై పు చేస్తారు.

కావలసిన వస్తువులు :—

పాలు మూడున్నర శేర్లు, బొంబాయి రవ్వ పావుకేజి, గోదుమపిండి పావు కెజి, చక్కెర 1 కెజి, నెయ్యి అర కెజి, జీడిపప్పు 10 లేక 12 పలుకులు, ఏలకులు 6.

తయారుచేసే విధానము :—

మొదట మూడున్నర శేరు పాలను కోవా లాగ అయ్యేదాక మరిగించాలి. బూర్లె మూకుడులో నెయ్యివేసి కరిగాక అందులో గోధుమపిండి, బొంబాయిరవ్వ వేసి బాగా కలపాలి. కాస్త ఎర్రగా వేగాక అందులో ఈ కోవాను వెయ్యాలి. రెండు నిముషములు పోయాక ఒక పావు కప్పు వేడి నీరు పోసి నెయ్యి బాగా పైకి రాగానే పంచదార వెయ్యాలి. ఆ తర్వాత దానిలో జీడిపప్పు, ఏలకుల పొడి వేసి దింపెయ్యాలి. ఇది కంటికి ఇంపుగా తినటానికి చాలా రుచిగా వుంటుంది. త్వరగా కూడా అవుతుంది.

— చిత్రపు లక్ష్మి.

పూలమాల

శ్రీమతి సముయమంత్రి రాజ్యలక్ష్మీదేవి రచించిన పూలమాల(గేయ సంపుటి) మా కార్యాలయంచేరింది. 84 పేజీలు. వెల పుస్తకంలో లేదు. ప్రతులకు: రచయిత్రి, కేరాఫ్ శ్రీ ఎస్. వి. ఆర్. రావు, ఎ—2 ఎస్.ఇ. పార్క్—1, న్యూఢిల్లీ—49.

బాలానందం

శ్రీ కపుల ఆంజనేయశర్మ రచించిన బాలానందం (బుర్రకథ) మా కార్యాలయం చేరింది. వెల : ఒక రూపాయి. ప్రతులకు: రామాబాలానందంసంఘం కొడుకులవారిలేన్, గవరపాలెం హైస్కూల్ ఎదుట అనకాపల్లి—531002(విశాఖజిల్లా)కు వ్రాయాలి.

ప్రవాసి

జెంషెడ్‌పూర్ ఆంధ్ర విజ్ఞాన సమితి రజతో త్సవ సంచిక 1974 మా కార్యాలయం చేరింది. 46 పేజీలు వెల రెండు రూపాయలు. ప్రతులకు: సెక్రటరీ ఆంధ్ర విజ్ఞాన సమితి కేరాఫ్ ఎం. సి.ఎ. డిపార్టుమెంట్, సి. ఎ. ఒ. టి. ఐ. ఎస్. సి. ఒ., జంషెడ్‌పూర్—1.

ఫిలిం బ్యాలట్ : పాఠకులకు విజ్ఞప్తి

- ఏటా నిర్వహిస్తున్నట్లే ఈ ఏడుకూడా ఫిలింబ్యాలట్ నిర్వహిస్తున్నాము. పాఠకులు ఉత్సాహంగా పాల్గొంటారని ఆశిస్తున్నాము.
- బ్యాలట్‌పత్రాన్ని నింపేముందు యీ నిబంధనలు గమనించమని కోరుతున్నాము.
- ఆంధ్ర సచిత్ర వార పత్రికలో ప్రకటించిన బ్యాలట్ పత్రాన్ని మాత్రమే వాడాలి. వేరే కాగితంపై వ్రాసినవి చెల్లవు.
- పత్రంలో ఎన్నుకున్నవారి పేర్లు స్పష్టంగా, విడివిడిగా సిరాతోనే వ్రాయాలి. పంపినవారి పూర్తి పేరు, చిరునామా వుండితీరాలి. కవరుపై 'సినిమా బ్యాలట్' అని వ్రాయడం అవసరం. బ్యాలట్ పత్రాలను సంపాదకుడు, ఆంధ్ర సచిత్ర వారపత్రిక, గాంధీనగరం, విజయవాడ-520003 అన్న చిరునామాకి పంపాలి.

ముగింపు తేదీ : 7-2-75

— — — — ఇక్కడ కత్తిరించండి — — — —

ఆంధ్రసచిత్ర వారపత్రిక ఫిలిం బ్యాలట్ పత్రం

[1] ఉత్తమ చిత్రం	
[2] ఉత్తమ దర్శకుడు	
[3] ఉత్తమ నటుడు	
[4] ఉత్తమ నటి	
[5] ఉత్తమ సహాయ నటుడు	
[6] ఉత్తమ సహాయ నటి	
[7] ఉత్తమ హాస్య నటుడు	
[8] ఉత్తమ సంగీత దర్శకుడు	

పంపినవారి పేరు.....................................

పూర్తి చిరునామా.....................................

....

— — — — ఇక్కడ కత్తిరించండి — — — —

ఓం ప్రకాశ్ అగర్‌వాల్ మాజిక్ మ్యూజిక్ కదంబ కార్యక్రమం.

అన్ని రకాల దృశ్య శ్రవ్య ప్రక్రియలను మింగేసిన సినిమా యుగంలో పూర్తి నిడివి ఇంద్ర జాలిక ప్రదర్శనలను యివ్వటం—యిచ్చి ప్రేక్షకులను చకితులను పులకితులను చేయుటం సుసాధ్యంకాదు. ఓం ప్రకాశ్ అగర్‌వాల్ ఆంధ్ర దేశంలో తన 22 సంవత్సరాల అభ్యాసాన్ని అనుభవాన్ని వినియోగించి అధునాతన మైన ఎలక్ట్రిక్ అకార్డియన్ గల ఆర్కెస్ట్రా సాయంతో చేస్తున్న మ్యాజిక్ మ్యూజిక్



"హొద్యా"లు చూసి ఆనందించ గలవిగా వున్నాయి. వెలుగు నీడలను రంగు రంగు కాంతుల మేళవింపును వాడుకుంటూ అగర్‌వాల్ మనిషిని ముక్కలు చేసి అతికించటం, మనిషిని గాలిలో నిలపటం లాంటి పెద్ద పెద్ద ట్రిక్కులను చేస్తున్నారు.

సకుటుంబంగా వెళ్లి రెండు గంటలు కాలక్షేపం చేయటానికి అనువైన ప్రోగ్రాం. కాకపోతే అగర్‌వాల్ హిందీలో తప్ప వ్యాఖ్యానం యివ్వలేదు. ప్రాంతీయ భాషల టేపు రికార్డైనా పెట్టుకుంటే యింకా మంచిది. అతని "మాయాజాలం" మెచ్చదగ్గది.

('వి')

మార్క్సిజం?

కాట్స్కీచే రచింపబడిన "మార్క్సిజం?" మా కార్యాలయం చేరింది. వెల రు. 4 — కాపీలకు మేనేజరు, సాందీపని 23—177, బచ్చుపేట మచిలీపట్నంకు వ్రాయండి.

సమాజం మారాలి

శ్రీ భీశెట్టిలక్ష్మణరావు రచించిన "సమాజం మారాలి"(నాటకం) మా కార్యాలయం చేరింది. 118 పేజీలు వెల నాలుగు రూపాయలు. ప్రతులకు : శ్రీ రామా బుక్ డిపో, రాజగోపాలాచారి వీధి, గవర్నరుపేట విజయవాడ—2.


కౌముదీ పిక్చర్స్
రామయ తండ్రి
ఈస్ట్‌మన్ కలర్
నిర్మాత: యం. యస్. రెడ్డి
దర్శకత్వం: బి. వి. ప్రసాద్
VIJAYA
Kalamandir

24—1—75

ఉత్తరాలు

సినిమా

సినిమా తారలు తమ నిజ వయస్సును చెప్పరు. అన్న నిజాన్ని ఎంత స్పష్టంగా తెలియజేశారు 27—12—74 పత్రికలో శ్రీనివాస్‌గారు! శ్రీమతి జమునగారి వయస్సు మీకు తెలియకపోతే, మాకు తెలియదనుకున్నారా! అబద్ధాలు చెప్పిన గోడకట్టి నట్లు చెప్పాలండి. ఆవిడ సినిమా జగత్తులో ప్రవేశించి పాతికేళ్లు అవుతూంది. మరి వచ్చే మార్చికి ఆవిడకి 24 పోయి 25 వ సం. వస్తుంది అని రాశారు అంటే ఆవిడ పుట్టింది మొదలు సినిమా పరిశ్రమలో ఉంటున్నారా!

కుమారి, స్వర్ణ, నిర్మల, జానకి, యశోద, రమణ, సంధ్య, విద్యాలత, హరి, కాంచన (కర్నూలు)

సీరియల్

"భవబంధాలు" సీరియల్ మమ్ము ఆదిలోనే ఆకర్షించింది. "కలసినహృదయాలు—మాసినగాయాలు" కథ సారీ నవల అత్యద్భుతంగా వుంది. ఇకపోతే వేణుగోపాల్‌గారి నాటకం మార్వలెస్ 'ఎన్నికల్లో నిలబడతారా ?" ఈ వారం పత్రికకో ప్రత్యేకతని చేకూర్చిందనే చెప్పాలి.

రాగంరెడ్డి వెంకటరెడ్డి (ఇల్లెందు)

కథలు

చాలకాలం తరువాత 'నావెల్టి' వున్నకథ "హోల్డాన్" పాడిందేపాట...' అన్నట్లు, క్రొత్త అచ్చులో పాతసారా లాటి కథల్తో విసిగిపోయిన మీ అభిమానులకు మీరందించిన 'హోల్డాన్'కు నమస్సులు.

పంకజవల్లి (వాల్తేర్—2.)

కథల్లో "పెళ్లి" కథ నా కెంతోగానో నచ్చింది. తను పట్టిన పంతంకోసం, నీచబుద్ధితో, ఇరువర్గాల మధ్య తగాదాలు సృష్టించి, మళ్లీ ఏమెరగని నంగనాచి లాగుండి, పీటలమీద పెళ్లిళ్లను ఆపుచేయించే భూపతి లాంటి జిత్తులమారి నక్కలు మన సమాజంలో కోకొల్లలు. విశ్వనాథంలాంటి ఆదర్శభావాలుగల యువకులు వుంటే, భూపతిలాంటి వారి ఆటకట్టు. లేకపోతే......! శ్రీనివాస్‌గారు కథను నడిపించిన తీరు చాలా బాగుంది.

* * *

3—1—75 వారంనాటి పత్రిక సర్వాంగ సుందరంగా జిగేల్‌మనిపించింది. సినిమా న్యూస్ పాఠకులకు తెలియజేయటంలో పత్రికకు మరి సాటిలేదనిపిస్తుంది.

నూలిసత్యకుమార్ (నర్సాపురం)

కవితలు

3—1—75 నాటి ఆంధ్రపత్రికలో 'రసరాజ' వ్రాసిన "అరణ్యరోదనం" కవితలో పేదవాడిని గూర్చి కవిరాసిన భావ కవితతో గూడిన ఆవేదనమును విస్పష్టము చేసినాడు. ఈ కవిత భావనాలోకంలో లీనమై పేదను గురించి వివరించిన భావన చాలా బాగుంది.

"నాపేరు నిత్యానందం" ఉదయ శంకరుగారి కవిత "భారతావని—నిరుద్యోగానికి నిధియని" భావనా శక్తితో చాల చక్కగా రచించారు.

మీరు ఇంత చక్కని చిక్కటి భావాల కవితలు మీ (మా) ఆంధ్రపత్రికలో ప్రచురించినందుకు మీకు మా ధన్యవాదాలు

ఎస్. నాగరాజు, ఎస్. రాజేంద్ర జయరాం (వేములవాడ)

* * *

"శ్రీ జలగం వెంగళరావు పాలనలో ఒక ఏడాది" "తిరుమలరామచంద్రగారి సమీక్ష వాస్తవికంగావుంది. శ్రీ వెంగళరావుగారి గురించి రామచంద్రగారువ్రాసింది తక్కువేనేమో...అనిపిస్తుంది."

పోమాల పరమేశ్వర్ (షాద్‌నగర్)

జగమెరిగిన...పి. జి. వుడ్‌హవుస్

వుడ్‌హవుస్ అన్న పేరుకి ముందు పి. జి. అన్న రెండు పొడి అక్షరాలు వున్న సంగతి అందరికీ తెలుసుకాని వాటి 'వివరణ' ఏమిటో అంతగా ఎవరూ పట్టించుకోరు. ఇప్పుడు యీ రచయితకి బ్రిటిషు రాణి 'సర్' బిరుదు యిచ్చింది! 'సర్ పెల్‌హోమ్' అని మాత్రం అతన్ని ఎందరు పిలుస్తారు ?

వుడ్‌హవుస్ 1881 లో పుట్టాడు. బ్రిటిషువాడేకాని విదేశాలలోనే ఎక్కువగా జీవిస్తూ వచ్చాడు. ప్రస్తుతం అమెరికాలో వుంటున్నాడు. అతను ఎన్ని పుస్తకాలు రాశాడో గుర్తువుంచుకోవటం కష్టం. ఇంచుమించు అన్నీ బాగావుంటాయి — కొన్ని చెప్పలేనంత బాగావుంటాయి ! ఎందుకోగాని వుడ్‌హవుస్‌ని తెలుగులో అనుకరించి పేరు సంపాదించుకున్నవాళ్ళు కనిపించరు. అతని కథలు ఎంత బాగావుంటాయో భాష (విదేశీయులకి కూడా) అంత బాగానూ వుంటుంది.

హిలరీ కార్క్ అనే కవి ఒకసారి రాశాడు: వుడ్‌హవుస్‌తో అతని పాఠకులకి వివాహ బంధం వంటిది ఏర్పడుతుంది. ఇది ప్రేమ బంధం వంటిది కాదు. పాఠకులు మళ్ళీ మళ్ళీ అతని దగ్గరికి వెడతారు...

ఈమధ్య వుడ్‌హవుస్ తొంభయియేళ్ల వయసు తరువాత వంగి తన కాలివేళ్ళని ముట్టుకుంటున్నట్లు ఫొటో ఒకటి పడింది. ఇంత వయస్సులో అతను కాళ్ళు వంచగలిగినప్పటికీ ఎప్పుడో ముసలివాడు కాకపోడు. అతని పుస్తకాలలో పరిచయం అయ్యేవారు మాత్రం ఎప్పటికీ జీవిస్తారు... (ఒ. వి.)



“బాబు”లో వాణిశ్రీ



శ్రీ లక్ష్మీనారాయణ ఫిలింస్
శ్రీ రామాంజనేయ యుద్ధం
ఈస్ట్‌మన్ కలర్
దర్శకత్వం: బాపు నిర్వహణ: ఎస్.ఎస్.మూర్తి
నిర్మాతలు: పొట్లూరి వెంకటనారాయణరావు, ఎన్.బి.కె. ఉమామహేశ్వరరావు